
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా జి.చంద్రశేఖర్ రెడ్డి 12

సంపుటి 08, సంచిక: 156 | మంగళవారం | 06-05-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఉగ్రవాదంపై పోరుకు పూర్తి మద్దతిస్తాం

- రష్యా అధ్యక్షుడు పుతిన్ హామీ
- పహల్గామ్ దాడి వెనుక సూత్రధారులను న్యాయస్థానం ముందు నిలబెట్టాలి
- ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్ సంభాషణ



ఫైల్ ఫోటో

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భారత్‌కు రష్యా సంపూర్ణ మద్దతు ఇస్తుందని వ్లాదిమీర్ పుతిన్ చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫోన్ కాల్ సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ మేరకు పూర్తి భరోసా ఇచ్చారు. పహల్గామ్ దాడి వెనుక సూత్రధారులను న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిందేనని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భారత్‌కు రష్యా పూర్తి అండదండలు అందిస్తుందని టెలిఫోన్ సంభాషణలో పుతిన్ చెప్పారు. పుతిన్ సందేశాన్ని రష్యా దౌత్యకార్యాలయం తెలియజేసింది. ఉగ్రవాదదాడి ఆటవిక చర్య అని పుతిన్ చెప్పారనీ, నాయకులు ఇద్దరూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారని పేర్కొంది. భారత్–రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశం ఈ ఏడాది భారత్‌లోనే జరపాలన్న ప్రధానమంత్రి మోదీ ఆహ్వానానికి పుతిన్ తన సమ్మతి తెలియజేశారని కూడా రష్యా దౌత్యకార్యాలయం తెలిపింది. మోదీతో సంభాషణ సందర్భం గా పహల్గామ్ దాడిని పుతిన్ తీవ్రంగా ఖండించారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సోషల్‌మీడియా పోస్ట్ ద్వారా తెలియజేశారు. పహల్గామ్‌లో జరిగిన దాడినికి తీవ్రంగా ఖండించిన మొదటి ప్రపంచ నాయకుడు రష్యా అధ్యక్షుడే. ఈ సందర్భంగా ఆయన కాల్పుల్లో మృతులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రెండు దేశాలమధ్య ఉన్న వ్యూహాత్మక ప్రత్యేక భాగస్వామ్యాన్ని మరింత తరువాయి 2లో

### భారత్‌లో శిఖరాగ్ర సదస్సుకు పుతిన్!

ఈ ఏడాది రెండో అర్ధభాగంలో జరిగే భారత్–రష్యా శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రావాల్సిందిగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం పలికారు. అదుకు పుతిన్ తన సమ్మతి తెలియజేశారు. గత ఏడాది భారత్–రష్యా మధ్య 22వ వార్షిక శిఖరాగ్ర సమావేశం మాస్కోలో జరిగింది. ఈ సారి ఈ సదస్సును భారత్‌లో నిర్వహించాలని మోదీ నిర్ణయించారు. నాయకులు ఇద్దరూ సోమవారంనాడు టెలిఫోన్ సంభాషణ జరిపారు. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భారత్‌కు ఆయన పూర్తి మద్దతు తెలియజేశారు.

## సహకరించాల్సింది పోయి సమరమా?

- ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అండగా నిలవరా?
- ఉద్యోగ సంఘాల నాయకులకు ఆ బాధ్యత లేదా?
- మొదటి తారీఖునే జీతాలిస్తున్నందుకా సమరం!
- ఉద్యోగ సంఘాలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



ఎవరిపై సమరం. సమరం తెలంగాణ ప్రజలపైనా. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాల నాయకులపై లేదా. ప్రతీ నెలా రూ.7 వేల కోట్లు కట్టాల్సిన పరిస్థితి ప్రభుత్వానిది. గతంలో లేని విధంగా మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం. ప్రభుత్వాన్ని అస్థిర పరిచాలనే రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఏదైనా సమస్య ఉంటే చర్చించుకుందాం. – సిఎం

ప్రజాపక్షం / హైదరాబాద్

'ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహకరించాల్సిన ఉద్యోగ సంఘాల నాయకులు సమరం అని అంటున్నారు. ఎవరిపై సమరం. సంఘాల సమరం తెలంగాణ ప్రజలపైనా? ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాల నాయకులపై లేదా? ప్రతీ నెలా రూ.7 వేల కోట్లు కట్టాల్సిన పరిస్థితి ప్రభుత్వానిది. ఎందుకు ఉద్యోగుల సమరం. గతంలో లేని విధంగా మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా? ప్రభుత్వాన్ని అస్థిర పరిచాలనే రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ తరువాయి 2లో



## 'మిస్ వరల్డ్ వేడుకలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

- షెడ్యూల్‌కు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలి
- ప్రతీ కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలి
- అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- మిస్‌వరల్డ్ 2025ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటా పరిచయం చేసేందుకు ఉపయోగపడే 'మిస్ వరల్డ్–2025' వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని సిఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. మే 10 నుంచి 31వ తేదీ వరకు వరుసగా జరిగే కార్యక్రమాల షెడ్యూల్‌కు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతీ కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు. మే 10వ తేదీన సాయంత్రం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ ప్రారంభోత్సవం నుంచి 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి తరువాయి 2లో




## సిపిఐ 25వ జాతీయ మహాసభ లోగో విడుదల

- జలియన్‌వాలా బాగ్ అమరుల స్థూపం, ఇరువైపులా గోధుమ కంకులు
- మాజీ ఐపిఎస్ అధికారి నేతృత్వంలో ఆహ్వానసంఘం
- సెప్టెంబర్ 21న భారీ ప్రదర్శన, బహిరంగసభతో మహాసభ ప్రారంభం

**లూధియానా :** పంజాబ్ రాష్ట్రం ఛండీగఢ్‌లో సెప్టెంబర్ 21 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభ లోగోను ఆవిష్కరించారు. అందులో స్వాతంత్రోద్యమంలో కీలకఘటమైన జలియన్ వాలాబాగ్ అమరుల స్థూపం, దానికి ఇరువైపుల వ్యవసాయ రాష్ట్రమైన పంజాబ్‌కు చిహ్నంగా గోధుమ కంకులు, వెనుక ఎర్రజెండా ఉన్నాయి. ఇటీవల మహాసభ ఏర్పాట్లపై చర్చించేందుకు లూధియానాలో జరిగిన సిపిఐ పంజాబ్ రాష్ట్ర సమితి లోగోను ఆమోదించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి వర్గ సభ్యులు అమర్‌జీత్ కౌర్, పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి బంత్‌సింగ్ బ్రార్‌లు లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలు, పేదరికం, అసమానతలు, నిరుద్యోగం, విద్య, వైద్యం ఖర్చు పెరుగుదల వంటి సమస్యలతో పాటు తరువాయి 12లో




## వైద్యుల నిర్లక్ష్యం కవలలు మృతి

- వీడియోకాల్ ద్వారా ఆపరేషన్ చేయించారని బంధువుల ఆరోపణ
- తమకు న్యాయం చేయాలని ఆసుపత్రి ఎదుట ఆందోళన
- డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- విచారణ అయ్యేంత వరకు ఆసుపత్రి సీజ్

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం

డాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఇద్దరు కవలలు మృతి చెందారు. ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తు ఆసుపత్రి ముందు ఆందోళన నిర్వహిచారు. ఈ ఘటన సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఓ ప్రైవేటు తరువాయి 2లో

## కారల్ మార్క్స్‌కు ఘన నివాళి






ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్/ హైదరాబాద్

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ 207 జయంతిని సిపిఐ,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మార్క్స్ చిత్రపటం వద్ద పలువురు నేతలు నివాళులు అర్పించారు. కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇటి నరసింహ పూలమాలలు వేసి శ్రద్దాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్ది శ్రీమాన్, సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవిందరావు, బోయ శ్రీరాములు తదితరులు తరువాయి 12లో

## సమ్మె చేయొద్దు

- మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి
- సమస్యలు వినేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని వెల్లడి
- మంత్రితో ఆర్‌టిసి సంఘాల నేతలు భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని కార్మికులు సమ్మె చేయొద్దని రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంత్రుల నివాస సముదాయాల ప్రాంగణంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్‌టిసి సంఘాల నేతలు కలిశారు. ఆర్‌టిసి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ఆర్‌టిసి సమస్యలపై ఆర్‌టిసి సంక్షేమం కోరే ఎవరైనా ఈరోజు, రేపు ఎప్పుడైనా కలిసి సమస్యలు చెప్పుకోవచ్చు, మీకు ఎప్పుడు అందుబాటులోనే ఉంటానని తెలిపారు. ఆర్‌టిసి తరువాయి 2లో

## ఆధారాలు లేకుండా నిందితుడిపై ఆరోపణలా?

- 'ఇడి'పై 'సుప్రీంకోర్టు' గరం
- ఛత్తీస్‌గఢ్‌లో రూ.2000 కోట్ల లిక్కర్ స్కాంపై విచారణ సందర్భంగా సుప్రీం వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** లిక్కర్ కుంభకోణంలో నిందితుడిపై ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడంపై సోమవారం సుప్రీంకో ర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇది ఒక అలవాటుగా మారింది' అని అత్యున్నత న్యాయస్థానం కీలకవ్యాఖ్యలు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో రూ.2,000కోట్ల మద్యం కుంభకోణంలో బెయిల్ కోరుతూ అరవింద్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓ, ఉజ్జల్ తరువాయి 12లో

## 2 ఏళ్లలో లక్షల కోట్లు

- తెలంగాణలో జాతీయ రహదారులు అభివృద్ధి చేస్తాం
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ భరోసా
- పదేళ్ళలో రాష్ట్రంలో రూ.1.20లక్షల కోట్లతో రోడ్లను నిర్మించామని వెల్లడి
- హైదరాబాద్ అంబర్‌పేటలో ఫ్లైఓవర్ జాతికి అంకితం



ప్రజాపక్షం /హైదరాబాద్ / ఆసిఫాబాద్

రానున్న రెండేళ్లలో తెలంగాణలో రూ.2 లక్షల కోట్లతో జాతీయ రహదారులను అభివృద్ధి చేయనున్నామని కేంద్ర జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ భరోసా ఇచ్చారు. గడిచిన పదేళ్లలో తెలంగాణలో రూ.1.25 లక్షల కోట్లతో రోడ్ల అభివృద్ధి చేపట్టామని, 2500 కిలో మీటర్ల మేరకు ఉన్న జాతీయ రహదారులను 5100 కిలో మీటర్లకు పెంచామని తెలిపారు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌ను సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రజలకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపిలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డాక్టర్ కె.లక్ష్మ ణ్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, పలువురు ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ 'అందరికీ నమస్కారం.. బాగున్నారా' అంటూ తెలుగులో సంబోధించారు. హైదరాబాద్ నగరం మధ్యలో ఫ్లైవర్ నిర్మించడం కష్టతరమైందని, రాష్ట్రం భూసేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొంత భాగం పూర్తి చేయాల్సి ఉందని, ఉప్పల్ ఎలివేటెడ్ ప్రాజెక్టు పనులు ఎప్పుడో పూర్తి కావాల్సి ఉండగా, చాలా ఆలస్యమైందని, రానున్న తరువాయి 2లో

## పిల్లలకు ఉరివేసి తండ్రి ఆత్మహత్య

- సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ఘటన

ప్రజాపక్షం/ కొండాపూర్

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ సాయినగర్‌కాలనీలో ఓ తండ్రి తన ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్నాడు. కొండాపూర్ సిఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం కొండాపూర మండలం గారకూర్తి గ్రామానికి చెందిన బాయికాడి సుభాష్ (45) ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేస్తూ మల్కాపూర్ సాయినగర్ కా లనీలో నివాసముంటున్నాడు. అతనికి భార్య మంజుల, కొడుకు మరియన్ (13) కూతురు తరువాయి 2లో

## ఉత్తర తెలంగాణలో భూ ప్రకంపనలు

- 5 సెకన్ల పాటు కంపించిన భూమి
- రిక్టర్ స్కేల్‌పై 3.8గా నమోదు
- భయాందోళనలతో ఇళ్ల నుంచి పరుగులు తీసిన ప్రజలు



**హైదరాబాద్ :** ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో భూమి కంపించింది. సాయంత్రం సమయంలో కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్, పెద్దపల్లి, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భూమిలో ప్రకంపనలు తరువాయి 2లో

## రైతు ముంగిట శాస్త్రవేత్తలు

- వివిధ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించిన 150 బృందాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాల్లో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. శాస్త్రవేత్తలతో కూడిన 150 బృందాలు వివిధ గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఆరుగాలం కష్టపడుతూ తమ శ్రమనే శక్తిగా మార్చి వ్యవసాయం చేస్తున్న అన్నదాతలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం పంట సాగుకు ముందే అన్నదాతలకు తరువాయి 2లో

వక్ఫ్ సవరణ చట్టం–2025కు వ్యతిరేకంగా కర్నాటక రాష్ట్రం గుల్బర్గాలో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన భారీ బహిరంగ సభకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరై ప్రసంగించారు. సమాజాన్ని విభజించే రీతిలో తీసుకువచ్చిన రాజ్యాంగ, మైనారిటీ వ్యతిరేకమైన ఈ సవరణ చట్టాన్ని సిపిఐ పార్లమెంట్‌లో వ్యతిరేకించిందని, తాను సుప్రీం కోర్టులో కేసు వేశానని ఆయన తెలిపారు. ఈ సభకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు, దళిత సంఘాలు, హిందూ, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ మత పెద్దలు హాజరై సంఘీభావాన్ని ప్రకటించారు.





# ప్రపంచం
WORLD NEWS

# లండన్‌లో యూరప్ వార్ విక్టరీ సెలబ్రేషన్స్





**లండన్ :** రెండవ ప్రపంచయుద్ధంలో నాజీలను మిత్రదేశాల విజయానికి చిహ్నంగా సోమవారంనాడు లండన్‌లో విజయోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు ఈ వేడుకలు జరుగుతాయి. మూడు తరాలకు చెందిన రాజరిక కుటుంబసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్స్ ఛార్లెస్, ఆయన సతీమణి కెమెల్లా, కుమారులు, వారి మనుమలు ఈ విక్టరీ పెరేడ్ కార్యక్రమాలను తిలకించారు. నాజీ నియంతలపై యూరప్ సాధించిన విజయానికి చిహ్నంగా సెంట్రల్ లండన్‌లో ఉత్సవాలు జరిగాయి. రాజు ఛార్లెస్ సైనికుల వందనం స్వీకరించారు. వారి ఊరేగింపును తిలకించారు. సుమారు 1000 మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1945లో విజయోత్సవనాటు విన్‌స్టన్ చర్చిల్ చేసిన చరిత్రాత్మక ప్రసంగాన్ని మరోసారి చదివారు. 2010లో సంబంధిత చిత్రంలో నటించిన నటుడు థిమోథి స్పాల్ చర్చిల్ ప్రసంగాన్ని చదివారు. మధ్యాహ్నం బిగ్‌బ్యాంగ్ గంటల ధ్వనితో నగరం మారుమోగిపోయింది. యూరప్‌లో మే నెలలోనే యుద్ధం ముగిసింది. కానీ ఆసియా పసిఫిక్ ప్రాంతాలలో యుద్ధం కొనసాగింది. జపాన్‌కు అమెరికా జూలై 26వ తేదీని డెడ్‌లైన్ నిర్ణయించినప్పటికీ జపాన్ మాట వినలేదు. దాంతో అమెరికా ఆగస్టునెలలో హిరోషిమా, నాగాసాకీలపై అణుబాంబులు వేసింది. 2.14 లక్షలమంది ఈ దాడిలో మరణించారు. ఆ తర్వాత జపాన్ ఓటమిని అంగీకరించింది. దీనికి ముందుగానే అట్లీ బ్రిటన్ ప్రధాన మంత్రి బాధ్యతలు తీసుకున్నారు.

# గాజా స్వాధీనం, హమాస్‌పై సైనిక దాడి

విస్తరణకు ఇజ్రాయెల్ మంత్రివర్గం నిర్ణయం



**టెల్‌అవీవ్ :** పాలస్తీనాలో హమాస్ ఉగ్రవాద సంస్థపై తన సైనిక దాడిని ఇంతకుముందు కంటే భారీగా విస్తరించాలని ఇజ్రాయెల్ జాతీయ భద్రతకు సంబంధించిన మంత్రివర్గం ఒక ప్రణాళికను ఆమోదించింది. గాజాలో ఉన్న 20 లక్షలమంది ప్రజలను దక్షిణ దిశగా తరలిస్తోందని ప్రణాళిక చేసింది. దీనవల్ల మానవ విధ్వంసం జరుగుతుంది. ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయడం ద్వారా హమాస్‌ను ఓడించడానికి ఇది చాలా మంచి ప్రణాళికగా ఉపయోగపడుతుందని ప్రధానమంత్రి నేతన్యాహూ ప్రకటించారు. అదేవిధంగా గాజాలో పైచేయి కంపెనీల ద్వారా మానవతా సహాయం పంపిణీ చేసేందుకు కూడా ఒక ప్రణాళికను మంత్రివర్గం ఆమోదించింది. గాజా ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని తన అధీనంలో ఉంచుకోవాలని, హమాస్‌పై ఒత్తిడి పెంచాలని తాజా నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ రిజర్వులో ఉంచిన సైనికులను రంగంలోకి దించి కొత్త ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించింది. ఆదివారంనాడు టెల్‌అవీవ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో హౌతీ ఉగ్రవాదులు క్షిపణి దాడులు చేయడంతో తీవ్రంగా ఆగ్రహించిన ఇజ్రాయెల్ హౌతీ, ఇరాన్‌లపై దాడులు చేస్తామని ప్రతిజ్ఞ చేసింది. ఐతే అందుకు ప్రతిగా, ఇజ్రాయెల్‌గానీ, అమెరికాగానీ తమపై దాడులు చేస్తే ఈసారి ప్రతీకార దాడులు చేస్తామని ఇరాన్ కూడా ఒక ప్రకటన చేసింది. అదేసమయంలో ఇజ్రాయెల్‌పై దాడులను ఉద్ధృతం చేస్తామని హౌతీ ఉగ్రవాదులు శపథం చేశారు. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. గుడ్డిలోమెల్ల చందంగా గాజాలోకి మానవతా సహాయాన్ని సమకూర్చేందుకు ఇజ్రాయెల్ సమ్మతి తెలియజేసింది. గడచిన మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఎలాంటి మానవతా సహాయం సరఫరా కానీయకుండా ఇజ్రాయెల్ సైనికులు అడ్డుపడ్డారు.

## అగ్ని బాధితుల సహాయనిధి

రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని రావినారాయణ రెడ్డి కాలనీ భూ పోరాట బాధితుల సహాయార్థం.

**03-05-2025 నాటికి అందిన విరాళాల మొత్తం రూ.1,17,000**

**05-05-2025 నాటి విరాళాలు**

1. నెల్లికంటి సత్యం (ఎమ్మెల్సీ) రూ.10,000 (నల్లగొండ జిల్లా పార్టీ తరుపున)
2. ఉంగుటూరి నర్సింహారెడ్డి రూ.5,000 (ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా నాయకులు)
3. మేడి కుమార్ రూ.5,000 (డి సెక్టర్, ఆర్‌సిఆర్ కాలనీ)
4. బొడ్డుపల్లి కృష్ణ రూ.1,000 (వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు)

**మొత్తం విరాళాలు రూ.1,38,000**

ఫోన్‌పే: 9866996737, (రవీంద్రాచారి, భాగ్యమ్మ)

– ఆందోజు రవీంద్రాచారి,
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

# హాలీవుడ్‌లో పెనుభారంగా మారిన చిత్రనిర్మాణం

**వాషింగ్టన్ :** హాలీవుడ్ చిత్రపరిశ్రమ క్షీణస్థాయికి దిగజారిపోతోందని ఇటీవల అమెరికా చిత్రపరిశ్రమ గగ్గోలు పెడుతున్న తరుణంలో ఇతర దేశాల్లో నిర్మించే చిత్రాలపైనూటికి నూరుశాతం సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజా నిర్ణయం తీసుకున్నారు. హాలీవుడ్‌లో చిత్రపరిశ్రమకు కొత్త ఊపిరులూదాలని ట్రంప్ తలపోశారు. విదేశాల్లో నిర్మించే చిత్రాలపై ఇంత భారీస్థాయిలో సుంకాలు విధించి ట్రంప్ కొత్త వివాదానికి తెరలేపారు. అమెరికాలో చిత్రపరిశ్రమ శరవేగంగా ''చచ్చిపోతోంది'' దీనికి జీవం పోయాలి అని ట్రంప్ అన్నారు. ఇతరదేశాల్లో స్టూడియోలు భారీ ఆఫర్లతో ఆకర్షించడంవల్ల చిత్ర నిర్మాణం అమెరికా జాతీయ భద్రతకు పెద్ద బెడదగా మారిందన్నారు. ఇటీవలికాలంలో డెడ్‌పూల్, ఊల్వెరైన్, వికెడ్, గ్లాడియేటర్–2 వంటి చిత్రాలు కూడా అమెరికా వెలుపలే భారీ రాయితీలతో నిర్మించడం హాలీవుడ్ మనుగడకు సమస్యగా మారింది. యూరోపియన్ సినిమా ఫైన్ వ్యూ వ్యవస్థాపకుడు తిమోథి రిచర్డ్ ట్రంప్ చర్యలపై మాట్లాడుతూ, ఇటీవల కాలిఫోర్నియాలో సినీ నిర్మాణ వ్యయం ఊహించనిస్థాయిలో పెరిగిపోయిందని, అంతటి భారీ వ్యవసాయలను ఎక్కడి నుండి తెస్తామని ట్రంప్‌ను ఆయన ప్రశ్నించారు. స్క్రిప్ట్, డైరెక్టర్, ఆర్టిస్టులు, క్రాఫ్టింగ్, షాట్స్ వీటన్నింటికీ ఎక్కడి నుండి డబ్బు తీసుకొస్తామని ప్రశ్నించారు.హాలీవుడ్ చిత్రపరిశ్రమకు పూ ర్వవైభవం తీసుకురావాలని ఆయన గాఢంగా కోరుకుంటున్నారు. ఇటీవల హాలీవుడ్ కార్మికులకు, రచయితలకు పనులు తగ్గిపోయాయి. విదేశాలలో కారుచౌకగా అనేక రాయితీలతో చిత్రాలు నిర్మించి అమెరికాలో విడుదల చేస్తున్నారు. దీంతో అమెరికా ఆదాయం తగ్గిపోయింది. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అనే నినాదాన్ని అన్ని రంగాల్లో అమలు చేయాలనే లక్ష్యంగా ట్రంప్ విదేశాల్లో చిత్రాంచే చిత్రాలపై నూటికి నూరుశాతం సుంకాలను అమలు చేస్తానని ప్రకటించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా తయారై అమెరికాలో విడుదలయ్యే చిత్రాలకు ట్రంప్ తన నూరుశాతం సుంకాలద్వారా తనదైన 'కొత్తరకం సినిమా' చూపించబోతున్నారన్నమాట! విదేశాలలో ఉన్న అమెరికా కంపెనీలను దేశానికి రప్పించి దేశంలోనే తయారీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు దిగుమతులపై విపరీతంగా సుంకాలు విధిస్తున్న ట్రంప్ అదే వ్యూహాన్ని సినిమాలకూ వర్తింపజేశారు. దక్షిణకాలిఫోర్నియాలో ఈ విధంగా అనేక దశాబ్దాలుగా ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంవల్లనే తాము ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయామని చెప్పారు.

## శాస్త్రవేత్తలు(మొదటి పేజీ తరువాయి)

వివిధ పంటలకు సంబంధించి ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శ్రాస్తవేత్తల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వివిధ అంశాలపై రైతన్నలకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ విద్యార్థులు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రభుత్వ అధికారులు, అభ్యుదయ రైతులు, వ్యవసాయ కళాశాలలు, పాలిటెక్నిక్స్, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు,పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులను కూడా భాగస్వామ్యం కావడంతో గ్రామాల్లో పూర్తిగా పండగ వాతావరణ నెలకొంది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల బృందాలకు తక్కువ యూరియా వాడం ద్వారాసాగు ఖర్చును తగ్గించుకోవడం, అవసరం మేరకే రసాయనాలను ఏలా వాడాలి, తద్వారా భూ సారం సంరక్షించుకోవడం, పంట మార్పిడిని పాటించడం ద్వారా సుస్థిర ఆదాయం పొందడం, చెట్లను పెంచడం ద్వారా పర్యవరణ పరిరక్షణ, సాగునీటి ఆదా తదితర అనేక అంశాలపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా వివిధ పంటలకు సంబంధించి వాడాల్సిన మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకోవడం, తద్వారా అధిక దిగుబడులు సాధించడం ద్వారా ఆర్థికంగా అధిక ప్రయోజనాలు పొందడంలాంటి పలు అంశాలను శాస్త్రవేత్తలు రైతన్నలకు కూలంకుశంగా వివరిస్తుడడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**వికారాబాద్‌లో లాంఛనంగా ప్రారంభం :** రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమం వికారాబాద్‌లో శాసనసభాపతిగడ్డం ప్రసాద్ కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భూమి సునీల్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య పాల్గొన్నారు. అదేవిధంగా మెదక్ జిల్లా రామాయణపేట మండలంలోని రాయలాపూర్ వ్యవసాయ కమిషన్ సభ్యులు రాములు నాయక్, మహబూబ్ నగర్ జిల్లా కొండారెడ్డి పల్లిలో వ్యవసాయ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

## సమ్మె చేయెద్దు

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు వినడానికి తాను కానీ, తమ ముఖ్యమంత్రి కార్యాలయం తలుపులు కూడా ఎప్పుడూ తెరిచే ఉంటాయని చెప్పారు. ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సిబ్బంది సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడుతారన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఆర్‌టిసిని నిర్వీర్యం చేసిందన్నారు. కొత్తగా ఒక్క బస్సు కొనలేదన్నారు. ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదన్నారు. సిసిఎస్, పిఎఫ్ డబ్బులు వాడుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సంస్థ ఉద్యోగులకు బాండ్ మొత్తం రూ.400 కోట్లు చెల్లించామని మంత్రి వివరించారు. 1500 మంది కారుణ్య నియామకాలు చేపట్టామన్నారు. ప్రభుత్వం టిజిఎస్ ఆర్‌టిసిలో 3,038 మంది ఉద్యోగులను నియమాకం చేయడానికి అనుమతి ఇచ్చిందన్నారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామని, తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చామని మంత్రి తెలిపారు. మంత్రిని కలిసిన కార్మిక సంఘాల నాయకులలో టిఎంయు ప్రధాన కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి, నరేందర్, కార్మిక సంఘ్ ప్రధాన కార్యదర్శి ఎర్రస్వామి కుమార్, ఎస్‌టిఎంయు ప్రధాన కార్యదర్శి పున్న హరి కృష్ణ తదితరులు ఉన్నారు.

## భూ ప్రకంపనలు (మొదటి పేజీ తరువాయి)

జరిగాయి. సుమారు 2 నుంచి 5 సెకన్ల పాటు భూమి కంపించింది. భూకంప లేఖినిపై తీవ్రత 3.8గా నమోదైంది. కరీంనగర్ జిల్లాలో చాలా చోట్ల స్వల్ప భూప్రకంపనలు జరిగాయని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా గంగాధర, చొప్పదండి, రామడుగు మండలాల్లో రెండు సెకన్ల పాటు ప్రకంపనలు జరిగాయి. దీంతో జిల్లా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. నిర్మల్ జిల్లాలో 2 నుంచి 5 సెకన్ల పాటు భూమి కంపించింది. కడెం, జన్నారం, ఖానాపూర్, లక్ష్మణ్‌చాందా మండలాల్లో తీవ్రత ఉంది. అటు నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్ పల్లి, మోర్తాడ మండలాల్లోనూ భూమి కంపించిందని స్థానికులు తెలిపారు. పెద్దపల్లిలో సుల్తానాబాద్, సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మండలం రాజక్కపేటలోనూ భూప్రకంపనలతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. చాలా చోట్ల ప్రజలు ఉన్నపళంగా ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు.

## కవలలు మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రితో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్మినేడు గ్రామానికి చెందిన బుట్టి కీర్తి, గణేశ్‌కు ఆరు సంత్సరాల క్రితం వివాహమైంది. కీర్తి ఆలస్యంగా గర్భావతి అయింది. పరిక్షలు చేయిస్తే కవలలు ఉన్నాట్లు తేలింది కాగా ఆమెకు ఆదివారం ఉదయం పురిటినొప్పులు రావటంతో హుటాహుటినా మండల కేంద్రంలో ఉన్న విజయలక్ష్మి ఆసుపత్రిలో చేర్చారు. అనంతరం డాక్టర్లకు సమాచారం ఇచ్చారు. అప్పటికే కీర్తి ప్రసవించేం దుకు సమయం దాటిపోయింది. ఈ నేపథ్యంలో డాక్టర్ అనుషారెడ్డి ఆసుపత్రికి రాకుండా వాట్సప్ విడియోకాల్ ద్వారా జిఎన్ఎం ఉద్యోగితో సిజెరియన్ చేయిం చింది. వైద్యం వికటించటంతో ఇద్దరు కవలలు మృతి చెందారని బంధువులు ఆరోపించారు. ఆసుపత్రి డాక్టర్ సమాచారం ఇచ్చిన వెంటనే గర్భవతికి నాణ్యమైన వైద్యం అందిచినట్లుయితే కవలలు బతికి ఉండేవారని బంధువులు పేర్కోన్నారు. చికిత్స చేయటంలో నిర్లక్ష్యం చేసిన డాక్టర్‌పై కఠిన చర్యలు తిసుకోవాలని, ఆసుపత్రిని సీజ్ చేయాలని బంధువులు ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించి ఆందోళన చేశారు. తక్షణమే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల సిఐలు జగదీష్,రాఘవ రెడ్డి సమక్షంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

**ఆసుపత్రి సీజ్:** గర్భవతికి నాణ్యమైన వైద్యంపై నిర్లక్ష్యం వహించి ఇద్దరు కవల పిల్లల మృతికి కారణమైన డాక్టర్ అనూషారెడ్డిపై విచారణ అయ్యేంత వరకు విజయలక్ష్మి ఆసుపత్రిని సీజ్ చేసినట్లు జిల్లా డిఎం అండ్ ఎచ్ఓ వెంకటేశ్వర్లు పేర్కోన్నారు.అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ విజయలక్ష్మి ఆసుపత్రి డాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఇద్దరు కవల పిల్లలు మృతి చెందటం బాధకరమన్నారు.ఈ సంఘటనపై విచారణ వేగవంతం చేసి డాక్టర్,ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు.

## సమరమా?(మొదటి పేజీ తరువాయి)

కుప్ప కూలుతుంది. ఉద్యోగ సంఘాల నాయకులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాం. ఏదైనా సమస్య ఉంచర్చించుకుందాం'' ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం జరిగిన పోలీసు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల ప్రకటనపై తీవ్రంగా స్పందించారు. గత బిఆర్‌ఎస్ పాలకులు రూ.8500 కోట్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ బకాయిలు పెట్టి వెళ్లారన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు తమపై ఆరోపణలు చేస్తున్నాయని, అవన్నీ వాళ్లు చెల్లించకుండా పెండింగ్ పెట్టి వెళ్లిన బకాయిలేనని సిఎం స్పష్టం చేశారు. 'కేవలం 16 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.30 వేల కోట్ల నగదు రైతుల ఖాతాలకు బదిలీ చేసింది. ఉచిత విద్యుత్ అని చెప్పి విద్యుత్ శాఖకు బకాయిలు పెట్టి వెళ్లారు. విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొనుగోలు చేసి సింగరేణికి బకాయి పెట్టి వెళ్లారు. ప్రాజెక్టులు కట్టామని చెప్పి కాంట్రాక్టర్లకు బకాయిలు పెట్టారు. 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చారు.ఇంతకం దుర్మార్గం ఉంటుందా? ప్రభుత్వం అం మేము ఒక్కరమే కాదు. మనమం తా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు. సేవకులం' అని సిఎం అన్నారు. 'మనం సమరం చేయడానికి ఇక్కడ లేము. ప్రజలకు సేవ చేయడానికే ఇక్కడ ఉన్నాం. ప్రజలపై యుద్ధం చేసిన వాళ్లు బాగుపడినవారు ఎవరూ లేరు. బాధ్యతగా వ్యవహరించాల్సిన ఉద్యోగులు బాధ్యత మరిచి వ్యవహరిస్తే తెలంగాణ సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ ఎక్కడా అప్పు పుట్టడంలేదు. స్వీయ నియంత్రణనే దీనికి పరిష్కారం. ఉద్యోగ సంఘాల నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం కలిస్తేనే కుటుంబం, అలాంటి కుటుంబ పరువును బజారున పడేయొద్దు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. నన్ను కోసినా.. వచ్చిన ఆదాయానికి మించి నేను ఏం చేయలేను. ఆర్థిక విధ్వంసం చేసిన వ్యక్తి ఇపుడు ఫామ్ హౌస్‌లో హాయిగా పడుకున్నారు. ఉద్యోగ సంఘాల నాయకుల్లారా ఇప్పుడు కావాల్సింది సమరం కాదు. సమయస్ఫూర్తి, సంయమనం. ఉద్యోగులందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళదాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

## తండ్రి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

ఆరధ్య (9) లు ఉన్నారు. అయితే కుటుంబ కలహాలతో తన భార్య ఇంటి నుండి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన సుభాష్,తన ఇద్దరి పిల్లల్ని బండ రాయి కొట్టి చంపి ఆ తరువాత తాను ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడాడు. సుభాష్ ఆత్మహత్యకు చేసుకోవడానికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబందించిన పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

## పూర్తి మద్దతిస్తాం (మొదటి పేజీ తరువాయి)

లోతుగా విస్తరించేందుకు కట్టుబడి ఉన్నట్లు నాయకులు ఇద్దరూ పునరుద్ఘాటించారు. ఇదే సందర్భంగా నాజీ ఉన్మాదులపై రష్యా సాధించిన ఘనవిజయం 80వ వార్షికోత్సవం (మే 9) సందర్భంగా పుతిన్‌కు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు.

**సహల్గామ్ ఘటనకు భద్రతా మండలి అధ్యక్షుడు సెకెరిస్ ఖండన:** పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి తర్వాత భారతదేశం యుద్ధ సన్నాహాలు చేస్తూ ఉండటంతో పాకిస్థాన్ చేసిన విజ్ఞప్తి మేరకు సోమవారంనాడు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ప్రత్యేకంగా సన్నిహిత సంప్రదింపుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ విషయంపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని పాకిస్థాన్ కోరింది. ప్రస్తుతం పాకిస్థాన్ భద్రతామండలిలో అశాశ్వత సభ్యురాలిస్థానంలో ఉంది. ఈ మే నెలలో గ్రీస్ దేశం భద్రతామండలి సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నది. వీటో అధికారాలున్న చైనా, అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలతోపాటు మరో పది శాశ్వత సభ్యదేశాలైన ఆల్జీరియా, డెన్మార్క్, గ్రీస గుయానా, పాకిస్థాన్, పనామా, దక్షిణ కొరియా, సియర్రా లియోన్, స్లోవేనియా, సోమాలియా మండలిలో ఉన్నారు. మే నెలలో భద్రతామండలి సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్న గ్రీస్ శాశ్వత సభ్యుడు ఎవాంజిలోస్ సెకెరిస్ గతవారంలో మాట్లాడుతూ, పహల్గామ్ ఘటనపై ఎవరైనా విజ్ఞప్తి చేస్తే భద్రతామండలి చర్చిస్తుందన్నారు. ''నేను ముందుగానే చెప్పినవిధంగా ఉగ్రవాదాన్ని చాలా తీవ్రంగా ఖండిస్తున్నాం, పహల్గామ్‌లో జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య, అమాయకులైన ప్రజలను హతమార్చారు'' అని సెకెరిస్ అన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్, రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో, బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లమ్మీ, ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జీన్ నోయన్ బార్రోట్, దక్షణి కొరియా విదేశాంగమంత్రి ఛో థాయే యుల్ లతో కూడా ఆయన పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి విషయంపై సంభాషించారు. ఈ విషయంపై ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ శాశ్వత సభ్యుడు ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ, ఇదంతా జమ్మూకశ్మీరులో జరుగుతున్న పరిస్థితుల వల్ల సంభవించాయన్నారు. ఈ దాడి ప్రాంతీయ, అంతర్జాతీయ, శాంతికి, భద్రతకు నిజమైన బెడదగా మారిందన్నారు.

**ఉగ్రవాదంపై భారత్‌కు జపాన్ మద్దతు:** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటానికి జపాన్ తన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సోమవారంనాడు భారత్‌లో పర్యటించిన జపాన్ రక్షణమంత్రి జెన్ నకటనికి భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆతిథ్యం ఇచ్చారు. వారిద్దరిమధ్య పలు విషయాలపై విస్తారంగా సంభాషణలు జరిగాయి. ఉగ్రవాద పెనుభూతంతోపాటు రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక రక్షణ సంబంధాలపై చర్చలు జరిగాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా సైన్యం తన పట్టు బిగించి పెత్తనం చెలాయిస్తున్న విషయాలపై కూడా వారు చర్చించారు. పహల్గామ్‌లో దాడి తర్వాత భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలోకి వెళ్ళిన తరుణంలో జపాన్ రక్షణమంత్రి భారత్‌లో పర్యటించారు. ప్రాంతీయ భద్రత, రక్షణ సహకారం వంటి విషయాలపై తాము చర్చించినట్లు రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు.

**పాకిస్థాన్ సైన్యానికి ఆ దేశ రాజకీయపక్షాల గట్టి మద్దతు:** భారత్‌తో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల గురించి పాకిస్థాన్ పౌర, సైనిక న్యాయకత్వం సోమవారంనాడు వివిధ రాజకీయపక్షాలకు వివరించింది. దేశంలోని రాజకీయపక్షాలతో ఒక సమావేశం నిర్వహించి పహల్గామ్ దాడి అనంతర పరిస్థితులను, సరిహద్దుల్లో తలెత్తిన ఉద్రిక్తతలు, భారత్ తీసుకున్న పాకిస్థాన్ వ్యతిరేక చర్యల గురించి వివరించింది. మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్‌ఖాన్ మినహా అన్ని పార్టీ నాయకులు ఆదివారంనాడు జరిగిన ఈ రహస్య సమావేశానికి హాజరయ్యారు. పాకిస్థాన్ సైన్యానికి తమ పూర్తి మద్దతు తెలియజేశారు. భారతదేశం ఎలాంటి చర్యలకు పాల్పడినా వాటిని తిప్పికొట్టాలనీ, ప్రాంతీయ శాంతిని కాపాడాలని రాజకీయపార్టీల నాయకులు సైన్యాన్ని కోరారు. రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ తొలుత రెండు దేశాలమధ్య ఉద్రిక్త పరిస్థితుల గురించి వారికి వివరించారు. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ నాయకులు రాజా పర్వేజ్ అష్రాఫ్, క్వమర్ జమన్ కైర, షాజియా మర్రి, పిఎంఎల్–ఎన్ నాయకులు బారిస్టర్ పర్వేజ్ అష్రాఫ్, తారిక్ ఫజల్ చౌధురి, తల్లాల్ ఛౌధురి, ప్రధానమంత్రి సహాయకుడు పర్వేజ్ ఖట్టక్, ఎంక్యూం–పి నాయకుడు ఫారఖ్ సత్తార్, కశ్మీరీ నాయకుడు షా గులామ్ ఖ్వాదిర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## నిర్వహించాలి(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. 'మిస్ వరల్డ్–2025' ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సిఎంతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డిజిపి జితేందర్, సిటీ పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు, ఎడిజిపి స్టీఫెన్ రవీంద్రతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పపంచవ్యాప్తంగా 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారికి ఆతిథ్యమివ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పోటీదారులతో పాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు మూడు వేల మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలని, పోటీలు పూర్తయ్యేంత వరకు ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పర్యాటక శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, అధికారులందరూ సమర్థవంతంగా తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. హైదరాబాద్ లోని చార్మినార్, లాడ్ బజార్‌తో పాటు తెలంగాణ తల్లి, సెక్రెటేరియట్‌తో పాటు రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్ పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో, అవసరమైన రవాణా, వసతులు కల్పించాలన్నారు. అక్కడ భద్రత కట్టుదిట్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుకోని అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను అధికారులు రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకెపి మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతో పాటు, ఉప్పల్ స్టేడియంలో ఐపిఎల్ సెమీఫైనల్స్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ఈదురు గాలులు, వర్షాలు వచ్చినా గ్రేటర్ సిటీ పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా జిహెచ్ఎంసితో పాటు హైడ్రా విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిస్ వరల్డ్‌కు వచ్చే విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతో పాటు గచ్చిబౌలి స్టేడియం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, సెక్రెటేరియట్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

**హైదరాబాద్‌లో సందడిగా...**

రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరపున మిస్ వరల్డ్ 2025 ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సిఎం సూచించారు. మిస్ వరల్డ్ వేడుకలు జరిగే రోజుల్లో హైదరాబాద్ అంతటా మిస్ వరల్డ్ సందడి కనిపించేలా తోరణాలు, లైటింగ్, హోర్డింగ్‌లతో పాటు సిటీలోని ముఖ్యమైన జంక్షన్లు, చారిత్రక ప్రదేశాలను అందంగా అలంకరించాలని సిఎం అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా పాఠశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఒక రోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

10 నెలల్లో దీనిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చిరు. ఇందుకు సంబంధించిన పనులను తాను స్వయంగా పర్యవేక్షిస్తానన్నారు. ఎల్‌బినగర్ నుంచి మల్కాపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మిస్తున్నామని, పూణే –హైదారబాద్ ఎక్స్‌ప్రెస్ హైవే, భూపాలపట్నం–హైదరాబాద్ 6 లైన్ల రోడ్డు చేపడుతున్నామని, ఫలితంగా యాద్రాది దేవాలయం వెళ్లే భక్తులకు సుఖవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుందన్నారు. రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధితోనే దేశంలో విప్లత్మకమైన మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రోడ్లదే కీలక పాత్ర అని, ఇందుకు కేంద్ర మంత్రి గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్–విజయవాడ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. మొదటి దశ రిజినల్ రింగ్ రోడ్డు టెండర్లను తక్షణమే పిలవాలని, అదేవిధంగా రెండవ దశ రోడ్డును సైతం కేంద్రం నిర్మించాలని మంత్రి గడ్కరికి విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూహైదరాబాద్‌రామగుండం రాజీవ్ రహదారిని 8 లైన్ల గా అభివృద్ధి చేయాలని కోరారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ బాలానగర్ నుంచి గండి మైసమ్మ వరకు పారిశ్రామిక వాడ ప్రాంతం కావడంతో మరో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నా. గడిచిన 65 ఏళ్లలో రాష్ట్రంలో 2500 జాతీయ నిర్మాణం జరిగితే. 10 ఏళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్తగా 2600 కిలో మీటర్లు మే జాతీయ రహదారులు నిర్మించిందని వెల్లడించారు. కాగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని చందానగర్ జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65 ప్రదాన రహదారిపై బిహెచ్‌ఇఎల్ చౌరస్తా వద్ద 175.5 కోట్ల వ్యయంతో 1.65 కిలోమీటర్ల పొడవు 6 లైన్ బ్రిడ్జి, 6 లైన్ సర్వీస్ రోడ్డుతో నూతనంగా నర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజ నర్సింహ, కొండా సురేఖ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు, ఎంఎల్‌ఎలు అరెకపూడీ గాంధీ, గూడెం మైపాల్ రెడ్డిలు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేంద్ర రోడ్ల రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధికి ఏల్లపుడు కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణలో జాతీయ రహదారులను విస్తరిస్తున్నామని, నేడు 330 కోట్ల నిధులతో చందానగర్ ఫ్లై ఓవర్ , అంబర్ పేట్ ఫ్లైవర్ 330 కోట్లతో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని , దీని ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

**జాతీయ రహదారుల విస్తరణతో అభివృద్ధికి బాటలు**

జాతీయ రహదారుల విస్తరణతో అభివృద్ధి బాటలు వేయడం జరుగుతుందని, రహదారుల అనుసంధానికి మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని కేంద్ర రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. సోమవారం జిల్లాలోని కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు వరకు, 3,900 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 4 వరుసల జాతీయ రహదారిని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షస్త్రమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్, గడ్డం వంశీకృష్ణ, ఉమ్మడి ఆదిలాబాద్ శాసనసభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ సిర్పూర్ , ఆదిలాబాద్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల శాసన సభ్యులు కోవలక్ష్మి , పాల్వాయి హరీష్‌బాబు, పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, రామారావు పటేల్, రోడ్డు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జాతీయ రహదారుల శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల శాఖ మంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణతో అభివృద్ధి బాటలు పడతాయని, రహదారుల అనుసంధానికి మరిన్ని నిధులు మంంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆర్థికంగా, సామాజికంగా కొంత వెనుకబడి ఉందని, ఈ ప్రాంతంలో జాతీయ రహదారుల ఏర్పాటుతో పరిశ్రమలు రావడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. రాష్ట్రంలో 32 జిల్లాల కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తున్నామని, వచ్చే 3 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడి నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులు, రైల్వే, ఎరువుల కర్మాగారం, కాసిపేటలో రైల్వే కోచ్ల తయారీ,పసుపు బోర్డుర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తుందని అన్నారు. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రి నితిన్ గట్కరి సహకారంతో రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయడం జరిగిందని, పెండింగ్ లో ఉన్న అటవీ శాఖ అనుమతులు పొందిన తర్వాత రహదారుల విస్తరణకు మరిన్ని చర్యలు లీసుకుంటామని, ఆ దిశగా కేంద్ర మంత్రి దృష్టి సారించి త్వరగా అనుమతులు లభించే విధంగా సహకరించాలని కోరారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షస్త్రమ శాఖ మంత్రి , జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కొంత వెనుకబడి ఉందని, జిల్లాలో ఎక్కువగా అటవీ ప్రాంతాలలో నివసిస్తున్నారని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ఆదిలాబాద్ నుండి ఉట్నూర్, ఆసిఫాబాద్ మీదుగా గచ్చిరోలి జిల్లా అల్లాపెల్లి వరకు జాతీయ రహదారి నిర్మాణం చేసి అనుసంధానం చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. హెలికాప్టర్ ద్వారా హెలిపాడ్‌కు చేరుకున్న కేంద్రమంత్రికి రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాసరావు, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు ఎస్‌పి ప్రభాకర్ రావు, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్, కాగజ్‌నగర్ డివిజన్ అటవీ అధికారి సుశాంత్ బొగాడే, జాతీయ రహదారుల సంస్థ అధికారులు శివశంకర్, రోడ్లు భవనాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## మామిడికాయలు త్వరగా పక్వానికి కార్బైడ్ వాడితే కఠిన చర్యలు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరిక

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** మామిడికాయలు త్వరగా పక్వానికి రావడానికి కార్బైడ్ వాడకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి మార్కెట్ యార్డులలో కార్బైడ్‌ను వినియోగించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్బైడ్ వాడకంతో ప్రజలకు ఆరోగ్యసమస్యలు ఎదురవుతున్నాయని, ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంత్రి ఆదేశాల మేరకు జిహెచ్ఎంసి డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్‌రాజేశ్వరి సిబ్బందితో కలిసి మార్కెటింగ్ అధికారులు సోమవారం జాంబాగ్, బాటసింగారం పండ్ల మార్కెట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా మోతాదుకు మించి ఎథోఫోన్ ఎథిలిన్ ప్యాకెట్లను పండ్ల పక్వం కోసం ఉపయోగిస్తున్నట్లు గుర్తించి, వాటిని సీజ్ చేసి ఐపిఎం పరిశీలనకోసం పంపించారు.

### తెలంగాణలో పోలీసులు వంద శాతం

# శాంతిభద్రతలు కాపాడుతున్నారు

పోలీస్ హీరోలకు

'జీ అవార్డ్స్- 2025' కార్యక్రమంలో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలబడి ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించగలుగుతోందని అందుకు పోలీసుల కృషి ముఖ్యమైనదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు హీరోలకు 'జీ అవార్డ్ 2025' కార్యక్రమం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లోని సైనికుల్లా రాష్ట్రంలో శాంతి భద్రతలను తెలంగాణ పోలీసులు నూటికి నూరు శాతం పరిరక్షిస్తున్నారని కితాబిచ్చారు. పోలీస్ ఉద్యోగం కత్తిమీద సాము లాంటిదని, విధి నిర్వహణలో పోలీసులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారు కాబట్టే మనం ప్రశాంతంగా ఉండగలుగుతున్నాం అని పేర్కొన్నారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం భరోసా అందిస్తుందన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఐపిఎస్ ల కుటుంబాలకు రూ.2కోట్లు , అడిషనల్ ఎస్‌పి, ఎస్‌పిల కుటుంబాలకు రూ. కోటిన్నర అందిస్తున్నామని తెలిపారు.ఇక పోలీస్ పిల్లల భవిష్యత్ కోసం 50 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను ఇటీవలే ప్రారంభించుకున్నామని గుర్తుచేశారు. డ్రగ్స్ నియంత్రణకు యాంటీ నార్కోటిక్స్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. మారుతున్న కాలంతో పాటు నేరగాళ్లు కొత్త పద్ధతులు అవలంబిస్తురని, సైబర్ క్రైమ్ నియంత్రణకు ఆ విభాగాన్ని మరింత బలోపేతం చేశామని అన్నారు. నేరం జరిగినప్పుడే కాదు.. నేరం జరగకుండా నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. అనంతరం విధినిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీసులకు సిఎం అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ కె.రామకృష్ణరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ రావు, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో పాటు సీనియర్ ఐపిఎస్ అధికారులు సందీప్ శాండిల్యా, సివి ఆనంద్, సౌమ్యా మిశ్ర, వై.నాగిరెడ్డి, మహేష్ భగవత్, విజయ్ కుమార్, స్వాతిలక్రా, రంగనాథ్,అవినాష్‌మహంతి, విబి కమలాసన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధరల నియంత్రణలో బిజెపి ప్రభుత్వం విఫలం

వందేళ్ల సిపిఐ ప్రస్థానంలో

అనేక ప్రజా పోరాటాలు

పార్టీ విస్తరణ, గత వైభవం దిశగా ఉద్యమాలు

మహాసభలో సిపిఐ నేత చాడవెంకట్‌రెడ్డి





**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** వందేళ్ల భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రస్థానంలో పేదలపక్షాన నిలబడి అనేక ప్రజా ఉద్యమాలు చేసిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో నిర్వహించిన పార్టీ 8వ మండల మహాసభలలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావుతో కలిసి పాల్గొన్నారు. సభ ప్రాంగణంలో కారల్ మార్క్స్ 207వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఇటీవల మృతిచెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ శ్రమ దోపిడి, శ్రమకు తగ్గ ఫలితం కోసం మార్క్స్ పోరాటం చేశాడని తెలిపారు. వెట్టిచాకిరి, శ్రమ దోపిడికి వ్యతిరేకంగా, దున్నేవాడికే భూమి, పేదలకు కూడు, గూడు, గుడ్డ నినాదాలతో అనేక ప్రజల తరుపున పోరాటం చేసిన పార్టీ సిపిఐ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం అమలు అవుతుందంటే ఆ ఘనత ఎర్రజెండా పార్టీకే దక్కుతుందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, ధరల నియంత్రణలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. బిజెపి చేస్తున్న మత రాజకీయాలతో దేశంలో ఘర్షణలు చెలరేగుతున్నాయని ఆరోపించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ ఎగవేతదారులకు ప్రజల సొమ్ము సుమారు రూ.12వేల కోట్లు మాఫీ చేసిందని తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. కులగణన ఎప్పుడో చేయాల్సిందని, ఇప్పటికైనా సమగ్ర కులగణన చేసి లెక్కలు తేల్చాలన్నారు. నల్లడబ్బు వెనక్కి తీసుకురావడం, కోటి ఉద్యోగాలు ఇస్తామని మాటలకే పరిమితం చేశారని ఎద్దేవా చేసారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలను ఉపేక్షించవద్దన్నారు. కర్రెగుట్టల్లో అపరేషన్ కగార్ నిలిపివేయాలని, మావోయిస్టులు చర్చలకు తాము సిద్ధమంటే కేంద్రం అహంకార పూరితంగా ఆదివాసీలను చంపుతుందని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ అంశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాటలు అభ్యంతరకరమని, చర్చల ద్వారా సమస్య పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో మాజీ సిఎం కెసిఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదని, ప్రస్తుత సిఎం రేవంత్ ప్రభుత్వం బూత్ స్థాయిలో 8 ఇండ్లని పేదలను అయోమయంలో పడేస్తున్నారన్నారని ఆరోపించారు.

రుణమాఫీ రూ.2లక్షలు పూర్తిగా అమలుచేసి, ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మంచాల రమాదేవి, కొంగల రాంచంద్రారెడ్డి, కొట్టె పాక రవి, ఆదరి రమేష్, జుర్రు సంపత్, సుంచు కుమారస్వామి, మమత, గొర్రె బాబు, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, కిషన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవులపల్లి అమర్‌కు మీడియా 'లెజండరీ అవార్డ్'

నేడు ప్రదానం చేయనున్న హైబిజ్.టివి




**హైదరాబాద్ :** ప్రముఖ పాత్రికేయులు దేవులపల్లి అమర్ 'లెజెండరీ అవార్డ్'కు ఎంపికయ్యారు. మీడియా రంగంలో విశేష సేవలు అందించినందుకు గుర్తింపుగా 2025 సంవత్సరానికి గాను ఈ అవార్డును అందజేస్తున్నట్లు హైబిజ్.టివి ఒక ప్రకటనలో తెలియజేసింది. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసి నోవాటెల్ హోటల్‌లో మంగళవారం ఉదయం పది గంటలకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు పేర్కొంది. దేవులపల్లి అమర్ ప్రస్తుతం మన తెలంగాణ దినపత్రిక ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిజం విభాగంలో ఎం.సి.జె. చేసిన ఆయన, ఐదు దశాబ్దాలుగా పాత్రికేయ రంగంలో ఉన్నారు. ఈనాడు, ఉదయం, ఆంధ్రప్రభ, ప్రజాతంత్ర, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తదితర దినపత్రికలు, టివి 9, సాక్షి టివి తదితర న్యూస్ ఛానల్స్‌లో వివిధ హోదాలలో పని చేశారు. అనేక దశాబ్దాలుగా 'డేట్‌లైన్ హైదరాబాద్' పేరుతో ఆయన వర్తమాన రాజకీయ, సామాజిక అంశాలపై కాలమ్‌ను నిర్వహిస్తున్నారు. తన కెరీర్ ప్రారంభం నుంచే దేవులపల్లి అమర్ జర్నలిస్టు ఉద్యమంతో మమేకమయ్యారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులుగా, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ సెక్రెటరీ జనరల్‌గా, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులుగా కూడా పనిచేశారు.

## రైతు మరణాలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే

అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ అన్నదాతల అవస్థలపై లేదు

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రాష్ట్రంలో ఎక్కడ సర్కార్ ధాన్యం కొనటం లేదని.. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం ఎదురు చూస్తు రైతులు దయనీయ స్థితిలో ఉన్నారని, ధాన్యం కుప్పలపై అన్నదాతలు ప్రాణాలు కోల్పోతున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఏప్రిల్ 15న జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలురు వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో చలపతిరెడ్డి రైతు మృతి చెందారన్నారు. ఏప్రిల్ 21న మహాబూబ్‌బాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం ధాన్నం కొనుగోలు కేంద్రంలో హనుమాండ్ల ప్రేమలత మహిళ రైతు మృతిచెందిందని, మహాబూబ్‌బాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి కొనుగోలు కేంద్రంలో బిర్రు వెంకన్న అనే రైతు ప్రాణాలు కోల్పోయారన్నారు. ధాన్యం రాశులే సాక్ష్యంగా కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. సోమవారం సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటిలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతల ఆవేదనపై లేకపోవటం సిగ్గుచేటని విమర్శించారు.

## చర్చల్లేవు.. తుపాకి వీడాలి.. లొంగిపోవాలి!

* అక్కడ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు.. ఇక్కడ అడవిలో మావోయిస్టులు
* నక్సల్స్ మెప్పుకోసమే కాంగ్రెస్, బిఆర్ఎస్ నాటకాలు
* కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



**ప్రజాపక్షం/గోదావరిఖని :** కాశ్మీర్ పహల్గామ్‌లో టూరిస్టులను ఉగ్రవాదులు చంపితే, అడవిలో తుపాకి చేత పట్టి అమాయక ప్రజలను మావోయిస్టులు చంపుతున్నారని, అసలు తుపాకులతో అడవిలో ఉన్న వారితో చర్చలు ఎలా జరుపుతామని, ఎట్టి పరిస్థితుల్లో మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తి లేదని, వారు తుపాకి వీడి లొంగిపోవాలని, జనజీవనస్రవంతిలో కలవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎన్‌టిపిసి పిటిఎస్‌లోని అతిథి గృహంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నాడు నక్సల్స్‌పై నిషేధం విధించిన కాంగ్రెస్ పార్టీ నేడు వారితో చర్చలు జరపాలని చెప్పడం ఆ పార్టీ రెండు నాలుకల ధోరణికి నిదర్శనమన్నారు. సామాజిక కోణం మావోయిస్టులకేనా? వారి చేతిలో ప్రాణాలు కోల్పోతున్న అమాయక ప్రజల గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. దశాబ్ధాల పోరాటంలో నెత్తురోడిన దృశ్యాలే తప్ప ఏమి సాధించారో హరగోపాల్, వరవరరావులు చెప్పాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కొత్త నాటకం మొదలు పెట్టాయన్నారు. అసలు నక్సల్స్‌పై నిషేధాన్ని విధించించే కాంగ్రెస్ ప్రభుత్వమని, పదేళ్ల పాలనలో ఆ నిషేధాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిందన్నారు. కానీ, ఈ రోజు మావోయిస్టుల మెప్పు పొందడానికి ఈ పార్టీలు పోటీపడ్తున్నాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నక్సల్స్‌పై నిషేధాన్ని ఎత్తివేసే దమ్ముందా అన్ని ఆయన ప్రశ్నించారు. ఇన్‌ఫార్మర్ల పేరుతో అమాయక గిరిజన ప్రజలను చంపుతుంటే ఎలా చూస్తూ ఊరుకోవాలన్నారు. ఈ సమావేశంలో బిజెపి రామగుండం నియోజకవర్గం ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆటవిక న్యాయాన్ని అమలు చేసే విధంగా మాట్లాడటం సరైంది కాదు

శాంతి చర్చలు ప్రజల ప్రజాస్వామిక హక్కు

తెలంగాణ పౌరహక్కుల సంఘం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆటవిక న్యాయాన్ని అమలు చేసే విధంగా మాట్లాడటం సరైందికాదని పౌరహక్కుల సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పౌరహక్కుల నేతలపై మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండించింది. శాంతి చర్చలు ప్రజల ప్రజాస్వామిక హక్కు అని, బండి సంజయ్ దానిని గౌరవించి చర్చలకు తన వంతుగా ముందుకు రావాలని పౌరహక్కుల సంఘం కోరింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో పౌరహక్కుల సంఘం తెలంగాణ అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, కార్యవర్గ సభ్యులు డి.సురేష్‌కుమార్, జక్క బాలయ్య మాట్లాడారు. ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ హింస, అణిచివేత లేని సమాజం కోసం పౌరహక్కుల సంఘం పనిచేస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట కర్రె గుట్టను వేలాది మంది పోలీసు బలగాలు చుట్టుముట్టి ఆదివాసులను, మావోయిస్టులను హత మార్చడం అన్యాయమన్నారు. ఈ మారణకాండ లో పోలీసులు బలగాలు కూడా ప్రాణాలను కోల్పోతున్నారని, హింసను ప్రేరేపిస్తే, ప్రతిహింస పుట్టుకొస్తుందన్నారు. మావోయిస్టులతో చర్చలు చేయబోమని బండి సంజయ్ ఒక బిజెపి కార్యకర్త మాదిరిగా మాట్లాడుతున్నారని, ఆయన కేంద్ర మంత్రి అనే విషయం మర్చిపోయినట్లు ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ , బిఆర్ఎస్ నాయకులు చర్చలు జరపాలని మాట్లాడుతుంటే వారిని తప్పుపడుతున్నారని విమర్శించారు. శాంతి చర్చలు ప్రజల ప్రజాస్వామిక హక్కు అని, బండి సంజయ్ దానిని గౌరవించి చర్చలకు తన వంతుగా ముందుకు రావాలని కోరారు. ప్రజాస్వామిక దేశంలో ఒక బలమైన రాజ్యాంగం అమలు కావాల్సిన స్థితిలో ఇటువంటి హత్యాకాండలు ఉండకూడదని, ప్రజాస్వామిక దేశంలో ఒక బలమైన న్యాయవ్యవస్థ కూడా ఉన్నదని, ఆ వ్యవస్థను గుర్తించకుండా ప్రభుత్వాలే మావోయిస్టులను నిర్మూలిస్తాం, హత్యలు చేస్తాం అని సాయుధ బలగాలతో ఆదివాసీల, ఉద్యమకారుల వేటను కొనసాగించడాన్ని హక్కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు.

### అర్హతలతో సంబంధం లేకుండా పూర్వ విఆర్ఎ, విఆర్ఒలకు

# జిపిఒలుగా అవకాశం కల్పించాలి

అధికారులకు తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర రెవెన్యూ శాఖలో పనిచేసి, అపార అనుభవం కలిగిన పూర్వ విఆర్ఎ, విఆర్ఒలకు అర్హతలతో సంబంధం లేకుండా గ్రామ పాలన అధికారులుగా (జిపిఒ) అవకాశం కల్పించాలని తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ (టిజిఆర్ఎస్ఎ) ప్రభుత్వాన్ని కోరింది. టిజిఆర్ఎస్ఎ గౌరవ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి సమక్షంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.భిక్షం అధికారులను కలిసి జిపిఒల నియామకంపై వినతిపత్రం అందచేసి పలు విషయాలను వివరించారు. రెవెన్యూ విభాగంలో నేరుగా విఆర్ఎలుగా నియామకమై 2018–19లలో విఆర్ఒలుగా సుమారు 250 మంది పదోన్నతి పొందారని వారు గుర్తుచేశారు. వీరంతా ప్రస్తుతం వివిధ విభాగాలలో సేవలు అందిస్తున్నారని, వీరందరూ తిరిగి రెవెన్యూ శాఖలోకి వచ్చి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ జిపిఒల నియామకానికి సంబంధించిన జిఒలో పేర్కొన్న కొన్ని నిబంధనలు అడ్డుగా ఉన్నాయన్నారు. ఐదేళ్ల సర్వీసు అనే నిబంధన వీరికి తీవ్ర ఆటంకంగా మారిందని గుర్తుచేశారు. చాలా మంది విఆర్ఒలు పదో తరగతి విద్య అర్హతతో అనేక సంవత్సరాల సేవలు అందించారన్నారు. రెవెన్యూ శాఖలో వారి అనుభవాన్ని ఉపయోగించుకోవడానికి వారిని రెవెన్యూ శాఖలో జిపిఒలుగా అవకాశం కల్పించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతాలలో గ్రామ రెవెన్యూ అధికారుల (విఆర్ఒ) పోస్టులను షెడ్యూల్ తెగల (ఎస్‌టి)కు ఇచ్చారన్నారు. గతంలో కనీస విద్య అర్హత పదో తరగతిగానే ఉందని, నిబంధనలకు లోబడి వారు స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావడానికి అవకాశం ఇవ్వాలన్నారు. పూర్వ విఆర్ఎ, విఆర్ఒలలో చాలా మంది ఇంటర్మీడియట్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిల వరకు విద్యార్హతలను కలిగి ఉన్నారని గుర్తు చేశారు. గతంలో వారు రెవెన్యూ శాఖలో కొనసాగిన సమయంలో విధుల్లో సమగ్ర అనుభవాన్ని కలిగి ఉన్నారన్నారు. భూ పరిపాలనతో వారికి పరిచయం ఉండటం వల్ల వారికి జిపిఒలుగా అవకాశం కల్పిస్తే అంకితభావంతో పనిచేస్తూ ముఖ్యంగా భూ భారతి చట్టం వచ్చిన నేపథ్యంలో వారు సమర్థవంతంగా పని చేస్తారన్నారు. చాలా మంది పూర్వ విఆర్ఎ, విఆర్ఒలు జిపిఒ పోస్టులకు వివిధ సాంకేతిక కారణాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. ఇలాంటి కేసులను జిల్లా కలెక్టర్, సిసిఎల్ఎ పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

# సమ్మెకు సిద్ధమైన టిజిఎస్ ఆర్‌టిసి కార్మికులు

ఆర్‌టిసి కళాభవన్ నుంచి బస్ భవన్ వరకు కార్మికుల భారీ కవాతు

బస్ భవన్‌ను ముట్టడించిన కార్మికులు

భారీగా మోహరించిన పోలీసులు, కవాతుతో ఉద్రిక్తం

చర్చలకు పిలవలేదంటూ జెఎసి నేతల ఆగ్రహం

ఈనెల 7వ తేదీ నుంచి యధా విధిగా సమ్మె

ప్రకటించిన టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిలో సమ్మె అనివార్యం అయ్యేలా పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్దిష్టమైన హామీ లభించకపోవడంతో కార్మికులు సమ్మెకు సన్నద్ధమయ్యారు. సమ్మె సన్నద్ధతలో భాగంగా భారీ ఎత్తున కార్మికులు కవాతు నిర్వహించారు. ఆర్‌టిసి కళాభవన్ నుంచి ప్రారంభమైన ఈ కవాతు బస్ భవన్ వరకు కొనసాగింది. అనంతరం బస్ భవన్‌ను టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ముట్టడించారు. కార్మికుల కవాతు నేపథ్యంలో ఆర్‌టిసి క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. దీంతో బస్ భవన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మరోవైపు సమ్మె ఈనెల 7వ తేదీ నుంచి యధా విధిగా కొనసాగుతోందని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కోచైర్మన్ కె.హనుమంత ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. సమ్మె నేపథ్యంలో తమతో చర్చలకు ఆర్‌టిసి యాజమాన్యం పిలవకపోవడంపై జెఎసి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అర్థరాత్రి నుంచి బస్సులు ఎక్కడివక్కడ నిలిచిపోతాయని స్పష్టం చేశారు. తమ సమ్మెకు సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.

**అనివార్యంగా సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చింది.. సమ్మెకు ప్రజలు సహకరించాలి**

తమ సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ప్రభుత్వానికి, యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కోచైర్మన్ కె.హనుమంత ముదిరాజ్, వైస్‌చైర్మన్ ఎం.థామస్ రెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రాకపోవడంతో అనివార్యంగా సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. సమ్మె నోటీసు ఇచ్చినప్పటికి యాజమాన్యం ఇప్పటివరకు చర్చలకు ఆహ్వానించలేదని, అందుకే సమ్మె సన్నద్ధతలో భాగంగా ఈ కవాతు నిర్వహించామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోగా, ఉన్న సమస్యలను పెంచి, ఆర్‌టిసి ఉద్యోగులను సర్వ నాశనం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటుతున్నా.. పరిష్కారం కానీ సమస్యలు**

కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 18 నెలలు దాటుతున్నా ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయలేదని, సమస్యలను పరిష్కరించలేదన్నారు. టిజిఎస్ ఆర్‌టిసిలో ప్రస్తుతం కార్మిక సంఘాలు లేకపోవడంతో ఎంటిడబ్ల్యు యాక్ట్ అమలు చేయకుండా రోజుకు 16 గంటల వరకు చట్ట వ్యతిరేకంగా విధులు చేయిస్తూ కార్మికుల నడ్డి విరుస్తున్నారని వాపోయారు. 2021, 2025 వేతన సవరణలు వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎస్.బాబు, డి.వి.కె. రావు, ఎం.వెంకటి గౌడ్, కమలాకర్ గౌడ్, యాదయ్యగౌడ్, ఎం.డి.అహ్మద్ అలీ, వి.బాబు, కె.ఎస్.పాల్, పి.అప్పారావు, రాంరెడ్డి, శ్రీనయ్య, ప్రేమ్ నాథ్, స్వాములయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాములు, పి.కె.మూర్తి, డి.రాంచందర్, బి.శ్రీనివాస్, పాండురంగయ్య, బి.జ్యోతి, ఎన్.మంగ, కె.సుజాత, రేణుక, కళ్యాణి, పలు డిపోల నుండి అనేక మంది నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

### 15న పోచంపల్లిని సందర్శించనున్న

## 'మిస్‌వరల్డ్ 2025' పోటీదారులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మిస్ వరల్డ్ 2025 పోటీదారులు ఈనెల 15న ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామం పోచంపల్లిని సందర్శించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం అత్యంత ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలలో ఒకటైన పోచంపల్లి ప్రత్యేకతపై ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లి, దాని సంక్లిష్టమైన చేనేత పద్ధతులకు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంది. పోచంపల్లిని యునెస్కో 'ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామం'గా గుర్తించింది. ఇది చేతిపనులు, సంస్కృతి వారసత్వానికి సజీవ మ్యూజియం. మిస్ వరల్డ్ పోటీదారులు చేనేత సాంప్రదాయ టైఅండ్‌డై ప్రక్రియను అనుభవిస్తారు, నిష్ణాతులైన నేత కార్మికులతో సంభాషిస్తారు. అలాగే హైదరాబాద్ నిజాంలు ఒకప్పుడు అభిమానించిన డబుల్ ఇక్కత్ కళాఖండం అయిన ఐకానిక్ టెలియా రుమల్ తయారీని చూస్తారు. ఆచార్య వినోబా భావే నేతృత్వంలోని భూదాన్ ఉద్యమంలో చరిత్రాత్మక పాత్ర పోషించిన ఈ గ్రామం వస్త్ర కళాత్మకత, సామాజిక సాంస్కృతిక వారసత్వం యొక్క అరుదైన మిశ్రమాన్ని అందిస్తుంది.

**జూన్ 2న గవర్నర్‌తో తేనేటి విందు :** మిస్ వరల్డ్ 2025 పోటీల్లో విజేతలకు జూన్ 2వ తేదీన రాజ్‌భవన్‌లో గవర్నర్ విష్ణుదేవ్ వర్మ తేనేటి విందు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు, హైదరాబాద్ మేయర్‌లు పాల్గొంటారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ సర్కిల్ :: సంగారెడ్డి

**షార్ట్ టెండర్ & పొడిగింపు నోటీసు**

సంగారెడ్డి సర్కిల్‌లో టెండర్ వివరణ నం. T-01 to 5, T-15/2025-26 (New) of SE/Op/Sangareddy ప్రకారం వివిధ పనులు చేపట్టడం కొరకు షార్ట్ టెండర్ ప్రకటన. **బిడ్ డాక్యుమెంట్ తేది:** 06.05.2025 నుండి టెండర్లకు అందుబాటులో ఉందును. **బిడ్ డాక్యుమెంట్ విక్రయం ఆఖరి తేది:** 14.05.2025న 17.00గం.ల వరకు, **బిడ్ దాఖలుకు తేది:** 15.05.2025న 15.00గం.లకు & **ప్రారంభం** 16.00గం.ల నుండి. టెండర్ పూర్తి వివరాలు www.tssouthernpower.com & http://tender.telangana.gov.in/ వెబ్‌సైట్‌లో లభించును. ఫోన్: 9490612311, ఇ-మెయిల్ ఐడి: sesrdtsspdcl@gmail.com

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్ :: సంగారెడ్డి,
DIPR R.O. No. : 1335-PP/CL/ADVT/1/2025-26, Date: 05-05-2025 TGSPDCL.

**తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్**

ల్యాబ్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్ (LMIS) ఫర్ హెల్త్ మరియు ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, తెలంగాణ ప్రభుత్వం కొరకు టెండర్ నోటీసు ఆహ్వానం.

వివిధ టెండర్ సంబంధిత కార్యక్రమాల సమయ షెడ్యూల్:

**బిడ్ ఆహ్వానం తేది:** 03.05.2025, **ప్రీ-బిడ్ కాన్ఫరెన్స్:** 007.05.2025న ఉ.11.30గం.లు, ఒ/ఒ. టిజిటిఎస్, 2వ అంతస్తు, హెచ్ఎసిఎ భవన్, నాంపల్లి, హైదరాబాద్. **వివరణ అందుకోవడానికి చివరి తేది:** 08.05.2025న సా.5.00గం.ల వరకు, **బిడ్ ఆఖరి తేది/ సమయం:** 15.05.2025, సా.04.00గం.ల వరకు, **బిడ్ డాక్యుమెంట్ రుసుము :** రూ.20,000/- ఎండి, టిజిటిఎస్ఎల్‌కు అనుకూలంగా, **ఇ-మెయిల్ ఐడి'స్:** mngdirector-tgts@telangana.gov.in; srinivasrao.T@gov.in; bvrao-tgts-ts@telangana.gov.in; **టెండర్ రిఫరెన్స్ నం.** TGTS/HWP1/HFW/LMIS/2025. వివరణాత్మక టెండర్ నోటిఫికేషన్ మరియు స్పెసిఫికేషన్లకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం దయచేసి http://www.tgts.telangana.gov.in / www.tender.telangana.gov.in ని సందర్శించండి.

సం/- మేనేజింగ్ డైరెక్టర్,
టి.జి. టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్.
DIPR R.O. No. : 1351-PP/CL/ADVT/1/2025-26, Date: 05-05-2025

ప్రజాపక్షం
మంగళవారం, మే 06

# జగన్నాథ ఆలయ రాజకీయం

జగన్నాథ ఆలయం అనగానే చటుక్కున స్ఫురించేది ఒరిస్సా (పూరీ)లోని ప్రాచీన – సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ్ ఆలయం. హిందువుల ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో అదొకటి. పశ్చిమ బెంగాల్‌లోని దిఘాలో ఇప్పుడు మరో జగన్నాథ ఆలయం వెలిసింది. ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఏప్రిల్ 30న ఆలయాన్ని ప్రారంభించారు. ఇది అధికారిక పత్రాల ప్రకారం సాంస్కృతిక కేంద్రం – జగన్నాథ్ థామ్ సాంస్కృతిక కేంద్రం. కళింగ వాస్తు కళలో నిర్మించిన దిఘా ఆలయానికి రాజస్థాన్ నుంచి అందమైన గులాబీరంగు ఇసుకరాయి తెప్పించారు. ఈ సముదాయంలో భోగ్ మంటపం, నట్‌మందిర్, జగ్‌మోహన్, గర్భగుడి ఉన్నాయి. ముఖద్వారం వద్ద 34 అడుగుల ఎత్తున్న 18 ముఖాల అరుణ్ స్థూపం నెలకొల్పారు. ఆ నల్లరాతి స్తంభంపైన అరుణ ప్రతిమను అమర్చారు. ఇది నిస్సందేహంగా హిందూమత ధార్మిక కార్యక్రమం. ప్రభుత్వం అండతో ధార్మిక సంస్థలు చేబట్టాల్సిన ఇటువంటి కార్యక్రమాన్ని మమతాబెనర్జీ ఎందుకు చేబట్టారు? మతం పేరుతో రాజకీయాధికారానికి పాకులాడుతున్న బిజెపిని ఎదుర్కొనటానికి మమతా బెనర్జీ ఈ ఉదార హిందూత్వ కార్యక్రమం చేపట్టారని వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. ముస్లింలను బుజ్జగించే వ్యక్తిగా ఆమెపై బిజెపి దశాబ్దకాలంగా దుమ్మెత్తిపోస్తున్నది. అయితే బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, ఇటీవల ముర్షీదాబాద్‌లో మతకలహాల్లో ముస్లింల ఘోర కృత్యాల నేపథ్యంలో ఆమె బిజెపియేతర హిందువుల్లో అభిమానాన్ని కోల్పోతున్న దృష్ట్యా దాన్ని కూడగట్టుకునేందుకు ఈ ఆలయరాజకీయం ఉపకరిస్తుందంటున్నారు. అయితే 20 ఎకరాల్లో నిర్మించిన ఈ సముదాయానికి మమతాబెనర్జీ 2018లో శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం రూ.250కోట్లు వెచ్చించింది. ఇది దిఘాలో టూరిజాన్ని అభివృద్ధి చేస్తుందని, సాంస్కృతిక కేంద్రంగా పని చేస్తుందని ప్రభుత్వం అంటున్నది. కాగా బిజెపి, టిఎంసిలు మత రాజకీయాలు ఆచరిస్తున్నాయని వామపక్షాలు, కాంగ్రెస్ విమర్శించా యి.

తెలివైన రాజకీయ నాయకురాలైన మమతా బెనర్జీ ఈ ఆలయ కార్యక్రమంతో రాష్ట్ర బిజెపిలో చిచ్చుపెట్టారు. రాష్ట్ర బిజెపి పూర్వాధ్యక్షుడు దిలీప్ ఘోష్‌ను సతీసమేతంగా ప్రభుత్వం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించటం, ఆయన హాజరు కావటం బిజెపిలో అంతర్గత చిటపటలు పెంచింది. 2026లో అసెంబ్లీ ఎన్నికల్లో హిందూత్వ ఆయుధంగా టిఎంసిని ఓడించాలని భావిస్తున్న బిజెపిని మమతాబెనర్జీ ఉదారవాద హిందూత్వతో ఢీకొంటున్నారు. ఆమె తన అగ్రవర్ణ అర్హతలను (బ్రాహ్మణ) ఇంతకుమునుపే ప్రకటించారు. ఆమె ప్రజాదరణను తగ్గించేందుకు బిజెపి చేస్తున్న కృషి బెడిసికొడుతోంది. పార్టీలోపల ఆర్‌ఎస్‌ఎస్ వాదులు సహా మొదటినుంచీ ఉన్నవారికీ, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి వంటి ఫిరాయింపు దారులకు మధ్య సఖ్యత కుదరకపోగా భిన్నధోరణలున్నాయి. ముస్లిం అనుకూల ముద్రతో ముఖ్యమంత్రిని దెబ్బతీసే బిజెపి ప్రయత్నాలను ప్రజలు హర్షించటం లేదు. బిజెపి ఎక్కువగా హిందీ రాష్ట్రాలనుంచి వచ్చి స్థిరపడిన హిందువులపై ఆధారపడుతున్నది. బిజెపి యేతర హిందువులతోపాటు ముస్లింలు (జనాభాలో 27శాతం) స్థిరంగా మమత వెనుక ఉంటూ వున్నారు. 2024లో జరిగిన ఆరు ఉప ఎన్నికల్లో టిఎంసి ఓటువాటా 50 శాతం దాటింది. 2021 ఎన్నికల తర్వాత పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు బిజెపినుంచి తప్పుకున్నారు. అయితే మూడు టరంల పరిపాలన తదుపరి ప్రభుత్వంపట్ల వ్యతిరేకత ఏర్పడుతుందని ఆమెకు తెలుసు. అందుకే అదనంగా హిందువులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే బిజెపి తీవ్ర హిందూత్వను ఉదార హిందూత్వతో ఎదుర్కోవటం సులభం కాదు. కేజ్రీవాల్ ఈ విషయంలో విఫలమైనారు. రాహుల్‌గాంధి సైతం మానస సరోవర్ యాత్ర చేసినా, తాను బ్రాహ్మణుడినని జంధ్యం చూపినా ఫలితం దక్కక పోవటం గమనార్హం. ప్రజాసమస్యలపై పోరాటం, భారత్ జోడో యాత్ర తర్వాతనే ప్రతిపక్షాల మధ్య ఐక్యత పెరిగింది. కాంగ్రెస్ సహా ఇండియా కూటమి గత ఎన్నికల్లో బిజెపికి చెమటలు పట్టించింది.

ఇదిలా ఉండగా, ఒడిశాలోని బిజెపి ప్రభుత్వం 'జగన్నాథ్' థామ్ తమ పేటెంట్ అని, ఆ పేరు ఉపయోగించవలదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి లేఖ రాస్తుందట. ఆలయాల నిర్మాణానికి కూడా బిజెపి పర్మిషన్ కావాలా? భగవంతుడు ఆయన్ను విశ్వసించే భక్తుల సొంతం తప్ప బిజెపి సొంతం కాదుకదా!

# వ్లదిమిర్ పుతిన్, రష్యన్ కమ్యూనిస్టుల ముందున్న సవాళ్లు!



ఎం. కోటేశ్వరరావు

ప్రకృతి ఉన్నంత వరకు ఎర్ర పూలు పూస్తూనే ఉంటాయి. దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిస్టులు ఉద్భవిస్తూనే ఉంటారు. వైపరీత్యాలు సంభవించినపుడు ఎర్రపూల చెట్లు దెబ్బతిన్నట్లే కమ్యూనిస్టులూ అంతే. ప్రపంచం నిరంతరం మారుతూ ఉంటుంది.మారిన పరిస్థితులను బట్టి కమ్యూనిస్టులూ మారాలి అంటే దానర్ధం మౌలిక లక్షణాన్ని వదులుకోవాలని కాదు, ఎత్తుగడలు, వ్యూహాలను మార్చుకోవాలి. అనేక దేశాల్లో కమ్యూనిస్టులు స్థానికంగా ఉన్న పరిస్థితులను బట్టి సమస్యలను ఎదుర్కొంటున్నమాట నిజం. ఉద్యమాలు నల్లేరు మీద బండిలా సాగటం లేదు. ఉదాహరణకు రష్యన్ కమ్యూనిస్టులను చూద్దాం. ఒక వైపు ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం పేరుతో సామ్రాజ్యవాదులు ముందుకు తెచ్చిన ముప్పు, మరోవైపు దానికి వ్యతిరేకంగా గట్టిగా నిలిచిన బూర్జువావర్గ ప్రతినిధి పుతిన్. అతగాడి నాయకత్వంలో కార్మికవర్గాన్ని దోపిడీ చేస్తున్న అల్పజనపాలన. యుద్ధంతో ముందుకు వచ్చిన ఆర్థిక సమస్యలు, జాతీయవాదం. కమ్యూనిస్టులకు ఇది కత్తిమీద సాము.

**ఓల్గాగ్రాడ్ విమానాశ్రయానికి స్టాలిన్ పేరు !**

కమ్యూనిస్టులకుగాక ఏ ఎండకా ఆ గొడుగు పట్టే వారికి ఎందుకు వస్తాయి కష్టాలు. హిట్లర్ మూకలకు గోరీ కట్టిన ఓలాగ్రాడ్‌కు నాడు సోవియట్‌ను నడిపించిన ఉక్కుమనిషి స్టాలిన్ స్మారకంగా స్టాలిన్ గ్రాడ్ అని పేరు పెట్టారు. సోవియట్‌ను కూల్చివేసిన తరువాత తిరిగి పూర్వనామాన్ని తెచ్చారు.ఫాసిజం, నాజీలపై విజయం సాధించి 2025 మే 9న 80వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఆ నగరానికి తిరిగి స్టాలిన్ పేరు పెట్టాలని రష్యన్ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు అలెగ్జాండర్ జెమిలియానిచెంకో, అగ్రనేత గెనడీ జుగనోవ్ అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ను కోరారు. ఉక్రెయిన్ మీద యుద్ధం చేస్తున్న సైనికులకు మానవతాపూర్వక సాయంగా డ్రోన్లు, మోటారు సైకిళ్లను పంపిన సందర్భంగా జుగునోవ్ స్టాలిన్ గ్రాడ్‌లో ఉన్నాడు. తానెప్పుడూ ఆ నగరాన్ని అలాగే పిలుస్తానని, యావత్ దేశం అలాగే అంటున్నదని అన్నాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న వారి గౌరవార్థం గతవారం పుతిన్ పర్యటన సందర్భంగా ఓల్గాగ్రాడ్ విమానాశ్రయానికి స్టాలిన్ గ్రాడ్ అంతర్జాతీయ విమానాశ్రయం అని పేరును ప్రకటించాడు. అందువలన నగరం మొత్తానికి ఆ పేరు పెట్టాలని జుగనోవ్ అన్నాడు. గతంలో కొన్ని సంస్థలు స్టాలిన్ గ్రాడ్ అని తిరిగి పెట్టాలా లేదా అన్న సర్వే చేస్తే ఓల్గాగ్రాడ్ పౌరులు వ్యతిరేకించినట్లు తేలిందని చెప్పారు, నిజంగా అప్పుడు జనం అలా ఉన్నారా లేక పాలకులకు అనుగుణంగా సర్వేను చేశారా అన్నది చెప్పటం కష్టం. ఇప్పుడు పుతినే స్వయంగా విమానాశ్రయపేరు మార్చాడంటే జనాల్లో వ్యతిరేకత లేదన్నది స్పష్టం ఎందుకు అంటే ఫాసిస్టు వ్యతిరేక పోరాటానికి మారుపేరు స్టాలిన్, ఆ పేరును ఉచ్చరించకుండా దాని గురించి చెప్పలేరు.

అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక వేదిక రెండవ సమావేశం గత నెలాఖరులో మాస్కోలో జరిగింది. ప్రపంచమంతటా ఫాసిజం తిరిగి తలెత్తుతున్న పూర్వరంగంలో దాన్ని ఎలా ఎదుర్కోవాలా అని 91దేశాల నుంచి హాజరైన 164 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాస్కో కమ్యూనిస్టు నాయకురాలు తాతిన్యా దెశియాతోవా మాట్లాడుతూ పాలకులు తమ సంపదలను పెంచుకోవటం తప్ప చేసిందేమీ లేదు. కాబట్టి ఇప్పుడు మేము గత కీర్తి కట్టడాలన్నింటినీ శుభ్రం చేస్తున్నాం, పాత సోవియట్ చిహ్నాలను పెడుతున్నాం, పాత పాటలను పాడుతున్నాం, గత విజయాల గురించి చెబుతున్నాం అని చెప్పింది. మూడవ తరానికి చెందిన కమ్యూనిస్టు అయిన ఆమె అమెరికా పత్రిక పీపుల్స్ వరల్డ్‌తో మాట్లాడినపుడు ఈ వ్యాఖ్యలు చేసింది. నిజానికి ఫాసిస్టు వ్యతిరేక వారసత్వం రష్యన్ పౌరులది తప్ప పుతిన్ లేదా అతగాడు ప్రాతినిధ్యం వహిస్తున్న పెట్టుబడిదారీ విధాన పాలకులది కాదు. బోరిస్ ఎల్సిన్ వినాశకర మరియు ప్రజల సంపద లూటీ పాలనతో పోలిస్తే పుతిన్ పాలనలో ఆర్థిక పరిస్థితి కాస్త మెరుగైంది, అది ఎంతో కాలం నిలిచేట్లు కనిపించటం లేదని ఆమె చెప్పింది. యుద్ధం, సంబంధిత అంశాల్లో సోవియట్ పాత్ర, దాని గురించి జనంలో ఉన్న జ్ఞాపకాల గురించి పుతిన్ గ్రహించాడు గనుకనే గత కొద్ది సంవత్సరాలుగా వాటిలో కొన్నింటిని ఎంచుకొంటున్నాడు. విమానాశ్రయానికి స్టాలిన్ పేరు పెట్టటం దానిలో భాగమే. రెండవ ప్రపంచ యుద్ధ విజయం 80వ వార్షికోత్సవం సందర్భంగా నాటి బ్యానర్లు, చిహ్నాలతో మాస్కోను అలంకరించారు.

సోవియట్‌ను కూల్చివేసి మూడున్నర దశాబ్దాలు కావస్తున్నది, ఆ సమయంలో తెలిసీ తెలియని వయస్సులో ఉన్నవారికీ, తరువాత పుట్టిన వారికి గతం గురించి తెలియదు. వర్తమానంలో బతుకు ఎలా సాగించాలా అన్నది తప్ప ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించే తీరిక కూడా ఉండటం లేదు. పరిస్థితి ఉన్నది ఉన్నట్లుగా ఉంటే చాలన్నట్లుగా కొందరి ఆలోచన ఉంది. అయితే 2022లో ప్రారంభమైన

> నాజీ ఫాసిజం పై విజయం సాధించి 2025 మే 9న 80వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఓల్గాగ్రాడ్‌కు తిరిగి స్టాలిన్ పేరు పెట్టాలని రష్యన్ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు అలెగ్జాండర్ జెమిలియానిచెంకో, అగ్రనేత గెనడీ జుగనోవ్ అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌ను కోరారు..... రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న వారి గౌరవార్థం గతవారం పుతిన్ పర్యటన సందర్భంగా ఓల్గాగ్రాడ్ విమానాశ్రయానికి స్టాలిన్ గ్రాడ్ అంతర్జాతీయ విమానాశ్రయం అని పేరును ప్రకటించాడు. అందువలన నగరం మొత్తానికి ఆ పేరు పెట్టాలని జుగనోవ్ అన్నాడు.

ఉక్రెయిన్‌పై మిలిటరీ చర్య తరువాత పరిస్థితిలో మార్పు ప్రారంభమైంది. సామ్రాజ్యవాదుల కుటిల యత్నాలు,వారికి మద్దతు ఇస్తున్న పాలకులు రష్యా సరిహద్దులోని తూర్పు ఉక్రెయిన్ ప్రాంతాలలో రష్యన్ జాతి పౌరులను అణచివేస్తున్న తీరుతెన్నులను గ్రహించిన కమ్యూనిస్టు పార్టీ యుద్ధ ప్రయత్నాలకు మద్దతు ఇచ్చింది. మూడు సంవత్సరాలు గడిచింది, వేలాది మంది మరణించారు, ఆర్థికంగా దేశం సమస్యలను ఎదుర్కొంటున్నది, మిలిటరీ చర్య ఎప్పుడు ముగుస్తుందో తెలియదు. ఇలాంటి తరుణంలో ఏ వైఖరి తీసుకోవాలన్నది కమ్యూనిస్టులకు పెద్ద సమస్య. ఉక్రెయిన్ పోరులో రెండు లక్షణాలు ఉన్నాయి, ఒకటి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరు, రెండవది జాతీయ అంశం. నాటో కూటమి నాయకత్వంలోని సామ్రాజ్యవాదులు, రష్యాలోని పెట్టుబడిదారులకు ప్రాతినిధ్యం వహించే శక్తుల మధ్య ఈ యుద్ధం నడుస్తున్నది.అయితే ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని రష్యన్ జాతి పౌరులు అక్కడి నాజీల చేతిలో అణచివేతను ఎదుర్కొంటున్నారు. వారికి కమ్యూనిస్టులు, ఇతర వామపక్ష శక్తులు నాయకత్వం వహిస్తున్నాయి. రష్యన్ మిలిటరీ ఆప్రాంతంలోకి వెళ్లిన తరువాత పోరాడుతున్న ఆ శక్తులు ఎన్నికలలో పాల్గొనేందుకు పుతిన్ అనుమతించటం లేదనే వార్తలు వచ్చాయి.ఈ సమస్య ఉన్నప్పటికీ ఉక్రెయిన్ను నాజీకరణ కావించకుండా చూడటం, నాటో విస్తరణను అడ్డుకోవటం, అణచివేతకు గురవుతున్నవారిని రక్షించటం మౌలిక అంశాలుగా ఉన్నట్లు అనేక మంది భావిస్తున్నారు. అయితే కమ్యూనిస్టులకు పుతిన్ మీద, పాలకవర్గం మీద ఎలాంటి భ్రమలు లేవు. పాలకవర్గంలో ఉన్న విభేదాలు, వైరుధ్యాల కారణంగా గతంలో ప్రైవేటీకరించిన 10.8బిలియన్ డాలర్ల విలువగల కంపెనీలను గత మూడు సంవత్సరాలలో పుతిన్ సర్కార్ జాతీయం చేసింది. అయితే వాటిని ప్రజల ఆస్తిగానే ఉంచుతారా లేక తిరిగి తమకు అనుకూలమైన వారికి కట్టబెడతారా అన్న సందేహాలు ఉన్నాయి. ప్రైవేటీకరణను ముమ్మరం గావిస్తామని పాలకపార్టీ నేతలు మార్చి నెలలో ప్రకటించారు. దాన్ని అడ్డుకొనేందుకు కమ్యూనిస్టులు సిద్ధం అవుతున్నారు.

**ప్రపంచ విప్లవ ధృవతార వియత్నాం !**

అమెరికా సామ్రాజ్యవాదులపై దక్షిణ వియత్నాంలో విజయం సాధించి రెండు ప్రాంతాల ఏకీకరణకు 50వసంతాలు నిండాయి, 1975 ఏప్రిల్ 30వ తేదీని విజయదినంగా పరిగణిస్తున్నారు. ఈ పరిణామం యావత్ లాటిన్ అమెరికా దేశాలకు, యావత్ ప్రపంచానికి ఇప్పటికీ ఒక ధృవతారగానే ఉందని అర్జెంటీనా కమ్యూనిస్టు పార్టీ ఈ సందర్భంగా పేర్కొన్నది. అమెరికా సామ్రాజ్యవాదంపై విజయం సాధించిన తరువాత గత ఐదు దశాబ్దాలలో వియత్నాం ఎంతో పురోగతి సాధించిందని ఉరుగ్వే కమ్యూనిస్టు పార్టీ శ్లాఘించింది. సోషలిస్టు దేశాలైనప్పటికీ పరస్పర అనుమానాలు, ఇతర కారణాతో చైనా, వియత్నాం మధ్య సాయుధ దాడులు జరిగాయి. అయితే తరువాత రెండు దేశాల కమ్యూనిస్టు పార్టీలు తమ వైఖరులను సవరించుకొని తిరిగి దగ్గరయ్యాయి, కొన్ని దీవుల గురించి ఇప్పటికీ కొన్ని సమస్యలున్నా .తాజాగా రెండు దేశాల మధ్య బంధం మరింత బలపడింది. షీ జింపింగ్ వియత్నాం సందర్శించారు. ఒక ఏడాది కాలంలోనే గణనీయ ఫలితాలు వచ్చాయని ఏప్రిల్ 28న చైనా రాయబారి ప్రకటించారు. తొలిసారిగా విదేశాంగ, జాతీయ రక్షణ, ప్రజాభద్రత మంత్రుల స్థాయిలో ఇరుదేశాలు 3 ప్లస్ 3 పేరుతో సంప్రదింపులకు ప్రపంచంలో తొలిసారిగా నిర్ణయించిన దేశాలుగా చైనా, వియత్నాం దౌత్య చరిత్రకు ఎక్కాయి. యువకుల్లో విప్లవ చరిత్ర గురించి అవగాహన కలిగించేందుకు రెడ్ కల్చర్, రెడ్ జర్నీలను ప్రోత్సహించాలని నిర్ణయించారు.రెండు దేశాల వాణిజ్య లావాదేవీలు గతేడాది 260 బిలియన్ డాలర్లు దాటాయి.

**సోషలిస్టు వ్యవస్థల కూల్చివేతలో పోప్ ప్రమేయం !**

పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం తరువాత కొత్త పోప్ ఎంపిక గురించి విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ సందర్భంగా గతంలో పని చేసిన పోప్‌లు, అమెరికా అధ్యక్ష భవనంతో వారి సంబంధాలు, రాజకీయాలు, కుట్రలు ముఖ్యంగా కమ్యూనిజం, సోషలిస్టు సమాజాలకు వ్యతిరేకంగా జరిపిన కుట్రల గురించి కూడా ప్రస్తావనలు వెలువడ్డాయి.1989లో బెర్లిన్ గోడ కూల్చివేత,1991లో సోవియట్ కూల్చివేతకు ముందు ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో రెండవ పోప్ జాన్ పాల్, అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ సమావేశం వైట్ హౌస్‌లో 1982లో జరిగింది. వారిద్దరి మీద హత్యా ప్రయత్నాలు జరిగిన ఏడాది తరువాత వారి ఏకాంత భేటీ జరిగింది.అక్కడే సోషలిస్టు సమాజాల కూల్చివేతకు కుట్రకు తెరలేపినట్లు గతంలోనే విమర్శలు వచ్చాయి.ఇద్దరూ కమ్యూనిస్టు వ్యతిరేకులే. రెండవ పోప్ జాన్ పాల్ జన్మస్థలమైన పోలాండ్‌లో లెచ్‌వాలేసాను ముందుకు తెచ్చి సాలిడారిటీ ఉద్యమం పేరుతో కుట్రకు తెరతీశారు.తమ పని గడచిన తరువాత లెచ్‌వాలేసాను చరిత్ర చెత్తబుట్టలోకి నెట్టారు. లెచ్‌వాలేసా సాలిడారిటీతో తమకు ఎలాంటి సంబంధం లేదని పోప్, రీగన్ ఇద్దరూ అప్పుడు బొంకాయించారు. అయితే వారి ప్రమేయం గురించి 2004లో ఏపి వార్తా సంస్థ వెల్లడించింది.1989లో పోలాండ్ ఎన్నికల్లో సాలిడారిటీ గెలిచింది, తూర్పు ఐరోపాలో సోషలిస్టు వ్యవస్థల కూల్చివేతకు నాంది పలికింది. సోవియట్ కమ్యూనిజాన్ని పతనం గావించేందుకు పోప్, రీగన్ కలసి పని చేశారని రిపబ్లికన్ పార్టీ మాజీ గవర్నర్ అయిన స్కాట్ వాకర్ 2020లో వాషింగ్టన్ పోస్టు పత్రికలో రాసినదానిలో పేర్కొన్నాడు. చరిత్రలో ఒక అమెరికా అధ్యక్షుడిగా ఉడ్రో విల్సన్ మొదటి ప్రపంచ యుద్ధం ముగిసి, తొలి సోషలిస్టు రాజ్యం ఏర్పడిన తరువాత 1919లో పదిహేనవ పోప్ బెనెడిక్ట్‌ను కలసి వాటికన్‌తో సంబంధాలను ఏర్పరచుకున్నాడు.1959లో అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ ఇరవై మూడవ పోప్ జాన్‌తో భేటీ జరిగినప్పటి నుంచి పోప్‌లు, అమెరికా అధ్యక్షుల కలయికలు క్రమంగా జరుగుతున్నాయి.ఇప్పటి వరకు 32 సమావేశాలు జరిగినట్లు ఫాక్స్ న్యూస్ పేర్కొన్నది.1979వరకు అధ్యక్షులే వాటికన్ వెళ్లేవారు, ఆ తరువాత నుంచి పోప్‌లు అధ్యక్ష భవనానికి వస్తున్నారు.

# మరో సామాజిక విప్లవం... జనగణనలో కులగణన



జుర్రు నారాయణ యాదవ్
9494019270

చరిత్ర అన్నివేళలా ఒకేలా ఉండదు, కాలమాన పరిస్థితులకు తగ్గట్లు మారుతూ ఉం టుంది. కారల్ మార్క్స్ చెప్పినట్లు చరిత్ర అంటే వర్గ పోరాటమే. 19వ శతాబ్దంలో సాంఘిక సంస్కరణ ఉద్య మం, 20 శతాబ్దంలో జాతీ య స్వాతంత్ర్య పోరాటం, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమా లు, ప్రస్తుతం 21వ శతాబ్దంలో రాజకీయ,సామాజిక,ఆర్థిక రంగాల్లో సరియైన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ జనగణనలో కులగణనకై ఉద్యమం. ఇలా ఆయా కాలాల్లో ఆయా ఉద్యమాలు సమాజంపై ప్రభావాన్ని చూపుతూ చరిత్రగా నిలిచిపోయాయి.

జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. 1931 జనాభా లెక్కల నేపథ్యంలో జనగణనలో కుల గణన చేయాలనే ప్రతిపాదన 1951 జనాభా లెక్కల సందర్భంగా ముందుకొచ్చినప్పటికీ కేవలం ఎస్సీ, ఎస్టీల జనాభాను మాత్రమే లెక్కించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.

మొదటి బిసి కమిషన్ కాకా కాలేల్కర్ కమిషన్ సందర్భంగా, రెండవ బిసి కమిషన్ మండల్ కమిషన్ సందర్భంగా జనగణలో కులగణన చర్చకు వచ్చింది. అయినా కేంద్రం ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఇందిరా సహని కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యం లో జనగణలో కులగణన డిమాండ్ మరోసారి ముందుకొచ్చింది. జనగణనలో కులగణనకై డిమాండ్ ఎన్నిసార్లు ముందుకొచ్చిన కేంద్రం మాత్రం జనగణనలో కులగణన వల్ల దేశ ఐక్యత దెబ్బతింటుందని తోసిపుచ్చుతూ వచ్చింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల విషయంలో కూడా ఈ రకమైన అభిప్రాయంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం ఉన్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో భాష ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు అయ్యాయి.


70 సంవత్సరాల భాషా ప్రయుక్త రాష్ట్రాల చరిత్రలో దేశాన్ని విచ్ఛిన్నం చేయగల అనైక్యత ఎక్కడ సంభవించలేదని చెప్పవచ్చు. అంటే ఒక విషయంపై మనలో చాలా కాలంగా గూడు కట్టుకున్న ఆలోచనలు వాస్తవం కాదని తేలిపోయింది.

**ఈ ఘనత ఎవ్వరిది?:**

జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ వచ్చినప్పుడల్లా తోసిపుచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే. అయినప్పటి కీ 2011లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వము గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, కులగణన చేయడం జనగణనలో కులగణనకు మొదటిమెట్టుగా చెప్పవచ్చు. ఎన్‌డిఎ ప్రభుత్వం జనగణనలో కుల గణనని వ్యతిరేకించినప్పటికీ ప్రస్తుతం సానుకూల నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం.

అయితే ఈ ఘనత మాత్రం దేశవ్యాప్తంగా ఈ వాదా న్ని చర్చకు తెచ్చిన కాంగ్రెస్ పార్టీది, ఆయా రాష్ట్రాల్లో జనగణనలో కులగణనకై డిమాండ్ చేసిన డిఎంకె, ఎస్పీ,ఆర్‌జెడి లాంటి ప్రాంతీయ పార్టీలది. కులగణన చేయడమే కాదు, విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ శాసనసభ చట్టం చేసిన తెలంగాణ రాష్ట్రాన్నిది కూడా.

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కులగణనకు డిమాండ్ చేయడం, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కుల గణనకు వాగ్దానం చేయడం,రాష్ట్రంలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించడం,బీసీ సంఘాల ఒత్తిడి నేపథ్యంలో కుల గణన జరగడం,విద్యా ఉద్యోగ స్థానిక




సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల పెంపుకై శాసనసభ చట్టం చేసి కేంద్రానికి పంపడం చకచగా జరిగిపోయాయి. 42శాతం రిజర్వేషన్లు అమలు కోసం బిసి సంఘాలు ఢిల్లీలో 'జంతర్ మంతర్' వద్ద డిమాండ్ చేయడంతో కులగణనపై కేంద్రం ఆలోచనలో మార్పు వచ్చిండోచ్చు.కర్ణాటక, తెలంగాణ తోపాటు బీహార్ లాంటి రాష్ట్రాలు కులగణన పూర్తి చేయడం దేశంలో చాలా రాష్ట్రాల్లో కులగణనకై డిమాండ్లు వినిపించడంతో ఒక్కసారిగా కేంద్రం పునరాలోచనలో పడి ఉండవచ్చు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు రాజ్యాంగ సభలో చివరి ఉపన్యాసంలో మాట్లాడిన మాటలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ప్రభావాన్ని చూపి ఉండవచ్చు.

'ఒక వ్యక్తికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ' ద్వారా 26 జనవరి 1950 నుంచి మనం రాజకీయ సమానత్వంలోకి అడుగు పెట్టబోతున్నాం. కానీ కొన్ని వందల సంవత్సరాలుగా మన దేశంలో ఉన్న ఆచార, సంప్రదాయాలు మన సమాజంలో సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించుటకు ప్రతిబంధకాలుగా ఉన్నాయి. రానున్న ప్రభుత్వాలు ఆ ప్రతిబంధకాలను తొలగిస్తూ సామాజిక, ఆర్థిక సమానత్వానికై ప్రయత్నించాలి. సామాజిక,ఆర్థిక సమానత్వం సాధించని నాడు పీడిత ప్రజలు ఈ రాజ్యాంగసభ కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక వ్యవస్థను కుప్పకూలుస్తారు'అని హెచ్చరించారు'.

ఈ 78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మెజార్టీగావున్న బిసి ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వం చేకూర లేదనే చెప్పవచ్చు.

ఒక వ్యక్తి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ద్వారా రాజకీయ సమానత్వం ఉన్నట్లు కనబడిన, ఆర్థిక అసమానతలు, ఓటు హక్కును నిజాయితీగా ఉపయోగించుకోలేని పరిస్థితుల వల్ల అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం గల రాజకీయ సమానత్వం ఇప్పటికీ సాధ్యం కాలేదు. దీనికి తోడు రాత్రికి రాత్రి ఈడబ్ల్యూ రిజర్వేషన్ తీసుకొచ్చిన కేంద్రంపై దేశవ్యాప్తంగా బిసిలందరూ అసంతృప్తితో ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ తగ్గడం, రానున్న బీహార్,పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో జనగణనలో కులగణన ప్రధాన ప్రచారాంశంగా ఉండడంతో కేంద్రం ఆలోచన మారి ఉండవచ్చు.

సామాజిక,రాజకీయ,ఆర్థిక సమానత్వం సాధించాలంటే దేశవ్యాప్తంగా డిమాండ్‌గా వస్తున్న జనగణనలో కులగణన ఒక్కటే పరిష్కార మార్గంగా కేంద్రం భావించి ఉండవచ్చు.

**ఇల్లు అలుకగానే పండగా కాదు:**

జనగణనలో కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతించాల్సిందే. అయితే ఇల్లు అలుకగానే పండుగ కాదన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంబడి సంబరపడిపోకూడదు.రానున్న జనగణనలో కులగణనకై కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మార్గదర్శకాలను బిసి సమాజం నిశితంగా గమనించాలి. జనగణనలో కులగణన చేస్తే సరిపోదు. కులగణన రిపోర్టు కనుగుణంగా మండల కమిషన్ సూచించిన 40 సిఫారసులను అమలు చేయాలి. సామాజిక,రాజకీయ,ఆర్థిక,విద్య ఉద్యోగ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా తగిన చర్య లు తీసుకోవాలి. అప్పుడే జనగణనలో కులగణన చేపట్టినదానికి సార్ధకత చేకూరుతుంది. రాజ్యాంగ సభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు ఆశించిన రాజకీయ,సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుంది.

# 'పట్టెడ కోయ సంస్కృతి, సంప్రదాయం' ప్రపంచం ముందుంచే ప్రయత్నం

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఎ 2016 (తెలుగు) చేస్తున్న కాలంలో పాఠ్యాంశాలతో పాటు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు అధ్యయనం చేయటం ఆనాడే అలవర్చుకుంది

తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన కళాకారులు డాక్యుమెంటేషన్ ప్రాజెక్టు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజనవిజ్ఞాన పీఠంలో ప్రాజెక్ట్ ఫెలోగా ఆచార్య బట్టు రమేష్ గారి దగ్గర జైనంది కుంజ వరలక్ష్మి గిరిజన గ్రామాలు క్షేత్ర పరిశీలన పర్యటించినపుడు తన అస్తిత్వాన్ని తను చాటుకోవాలని పట్టెడ కోయ సంస్కృతి సంప్రదాయాలపై అధ్యయనం. అదే అంశంపై ఆచార్య బట్టు రమేష్ పర్యవేక్షణలో 2021–2024లో ఎం ఫిల్ జాయిన్ అయి పూర్తి చేసారు. ఎం ఫిల్ సిద్ధాంత గ్రంథం పట్టెడ కోయ గిరిజనుల సంస్కృతి. ఆ సాంప్రదాయాలు అధ్యాయం చదువుతున్నప్పుడు తెలుస్తుంది.




'అధ్యయనం' పదమే చాలా పవిత్రమైనది. అస లు అధ్యయనం అనేది ఎందుకు చేస్తారు? ఒక నూతన అంశాన్ని గురించి పూర్తిస్థాయిలో లేదా తమ పరిధి లో ఉన్న అవకాశాలను వినియోగించుకొని పూర్వపు సిద్ధాంతాలను లేదా పరిశీలనను సమన్వయం చేయ డం లేదా దానికి భిన్నమైన వాదాన్ని తెలుపడానికి చేసే పరిశ్రమే అధ్యయనం !

గిరిజనుల మౌఖిక సాహిత్యంలో గేయాలు కథ లు, సామెతలు జాతీయాలు పొడుపుకథలు వంటివెన్నో దాని చెలిమిలో ఊరుతుంటాయి. వాటి అందచందాలు గిరిజనేతర సమాజాలకు తెలియవలసిన అవసరం ఉంది. అక్షర గ్రంథంలేని కొండకోనల్లో గిరిజనులు అల్లే నోటిసాహిత్యం పరిమళాలు విశ్వవ్యాప్తం అవ్వాలంటే పరిశోధనల ద్వారానే సాధ్యమవుతుంది కనుక విశ్వవిద్యాలయాలలో విస్తృతమైన పరిశోధనలు జరగాలి, వాటన్నిటిని నిక్షిప్తం చేయా లి. అంతే కాకుండా గ్రంథాలను వెలుగులోకి తీసుకరావలసిన అవసరం ఉంది.

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 35 గిరిజన తెగలున్నా యి. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలో 12 తెగలున్నాయని అంచనా. వారందరి వేషభాషలు, సంస్కృతి సంప్రదాయాలు విలక్షణమైనవి, వారి జీవన విధా నం ఆచార వ్యవహారాలు వైవిధ్య భరితంగా ఉంటాయి. అయితే కుంజ వరలక్ష్మి తన పరిశోధనను ఈ కోణంలోనే మొదలు పెట్టి తగిన పద్ధతులను అనుసరించారు. ఎంపిక చేసుకున్నటువంటి ఉమ్మడి ఖమ్మం జిల్లా, వరంగల్ జిల్లాలో ఉన్న గ్రామాల్లో పరిశోధన అంశాలకి సంబంధించిన ప్రశ్నావళితో అక్కడివారిని కలిసి వారితో మమేకమై కావల్సిన మౌఖిక విజ్ఞానాన్ని, సంస్కృతిని, సాహిత్యాన్ని తెలుసుకోగలిగింది వరలక్ష్మి . వీటిలోఎక్కువగా సంసకృతి సంప్రదాయాలు వారి జీవన విధానం మిగిలిన వారి ఆచారాలు సంబంధించిన అంశాలను తెలుసుకోగలింది

ఈ సిద్ధాంత వ్యాసాన్ని నాలుగు అధ్యయనాలలో రూపొందించుకొని పరిశీలన చేశారు. దీనిలో మొదటి రెండు అధ్యాయాలలో భారతదేశం జాతులు ఉప జాతుల పరిచయం, పట్టెడ కోయ సామాజిక నిర్మాణం నిర్వచనం వర్గీకరణ వ్యాప్తిని తెలియజేశారు.

మూడవఅధ్యాయంలో పట్టెడ కోయ జీవన విధా నం, నాలుగో అధ్యాయంలో పట్టెడ కోయ మౌలిక సాహిత్యం ఆచారాలు సంస్కృతి సాంప్రదాయాలు, కోయల సాంఘిక ఆచారాలను చెప్పారు.

విభజన ద్వారా పట్టెడ కోయలంటే ఎవరు?వారి సంస్కృతి సంప్రదాయాలేమిటీ? మౌఖిక సాహిత్యం ఎటువంటిది అనే విషయాలను తెలపటం ఈ పరిశోధన గ్రంథంలో ప్రధాన లక్ష్యంగా తెలుస్తుంది. పట్టెడ కోయ గిరిజన సంసకృతి సంప్రదాయాలు అధ్యయనం పరిశోధన గ్రంథం ద్వారా కుంజ వరలక్ష్మి

పట్టెడకోయ సంస్కృతి సంప్రదాయాలన్నీ అంద లి సౌందర్యాన్ని ఆ సాహిత్యం చుట్టూ పరచుకున్న సామాజిక ఆర్థిక సంస్కృతిక విశేషాలను మనకు అందించే ప్రయత్నం చేసింది. అందులో కొంతవరకు విజయవంతం అయింది వరలక్ష్మి . పరిశోధన ఆత్మగతమైందే కావచ్చుకాని దాని ఫలాలు మాత్రం సమాజగతం కాబట్టి వ్యక్తిగతమైన ఇష్టాఇష్టాలు పక్షపాతం మమకారాలకు లొంగని పరిశోధకురాలు చెప్పవలసి న విషయాలను దాచవద్దు, మంచి చెడులను తుంచాలి, వాస్తవాన్ని నిక్కచ్చిగా వెల్లడించాలి అప్పుడే అది ఉత్తమ పరిశోధనగా నిలబెడుతుంది. వాటికి తోడు సరియైన పద్ధతులను పాటించిన వరలక్ష్మి కోయ తెగ విజ్ఞానం పట్టెడ కోయసంస్కృతి సాహిత్యం సాంప్రదాయాలు ఒక జీవన నది వంటిది ఎన్ని తరాలైనా ఇనికిపోని మౌఖిక సంపద వారి సొంతం నిజానికి వాటిని సృష్టించేది ఆదివాసీలే అయినా ఆ సంసకృతిలోని మాధుర్యం సౌందర్యం ప్రతి ఒక్కరు ఆస్వాదించదగ్గది ఏదిఏమైనా ఆదివాసి గిరిజన సమాజంలో అనేక సంస్కృతి సంప్రదాయా లు సాహిత్యం ప్రత్యేక అలవాట్లు – ఆచారాలుగల పట్టెడ కోయ బిడ్డలు జీవన సౌందర్యాన్ని ప్రపంచం ముందుంచే ప్రయత్నం చేసి గ్రంథరూపంలో తీసుకువస్తున్న కుంజ వరలక్ష్మి ఈ పరిశోధన చేసి ఎంఫిల్ డిగ్రీ పట్టా పొందటంతో అయిపోలేదు, నిరంతరం ఈ విషయంపై తాను పనిచేస్తుండాల్సిందే. ఈ గ్రంథాన్ని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ముద్రిస్తున్నందుకు అభినందనలు, వరలక్ష్మి కి శుభాకాంక్షలు.

*(నేడు హైదరాబాదులో 'పట్టెడ కోయ గిరిజనులు సంస్కృతి సంప్రదాయాలు–అధ్యయనం' గ్రంథాన్ని పంచాయతీరాజ్ శాఖ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్క చేతుల మీదుగా ఆవిష్కరణ సందర్భంగా)*

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రూ.1500 కోట్ల స్కామ్.. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్

**న్యూఢిల్లీ :** మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఇడి) సోమవారం హర్యానా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ధరమ్ సింగ్ చోకర్‌ను అరెస్టు చేసింది. దీన్ దయాళ్ ఆవాస్ యోజన కింద చోకర్, అతని కంపెనీ దాదాపు రూ.1,500 కోట్లు అక్రమంగా తరలించారని ఆరోపణలు ఉన్నాయి. పరారీలో ఉన్న మాజీ ఎమ్మెల్యేను దేశ రాజధాని ఢిల్లీలోని ఒక హోటల్‌లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను గురుగ్రామ్ కోర్టు ముందు హాజరుపరచనున్నారు. తన కుమారులు వికాస్ చోకర్, సికందర్ చోకర్‌తో కలిసి ధరమ్ సింగ్ 1,500 మందికి పైగా గృహ కొనుగోలుదారులను మోసం చేసి, వారి నిధులు రూ.500 కోట్లకు పైగా మళ్లించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సికందర్‌ను గత సంవత్సరం ఇడి అరెస్టు చేయగా.. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. మరో కుమారుడు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, పానిపట్ జిల్లాలోని సమల్ఖా నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అయిన ధరమ్ సింగ్ చోకర్.. గత సంవత్సరం హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో అదే స్థానం నుండి పోటీ చేసి ఓడిపోయారు.

## అల్లర్లను రెచ్చగొట్టేవారు బెంగాల్‌కు శత్రువులు



### కేంద్రం సరిహద్దులను రక్షించాలి : మమతా బెనర్జీ

**ముర్షిదాబాద్ :** బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి సర్కార్ మత విద్వేషాన్ని వ్యాపింపజేస్తోందని, దేశ సరిహద్దును కాపాడటంలో విఫలమైందని ఆరోపించారు. ముర్షిదాబాద్‌లో ఇటీవల జరిగిన హింసాకాండలో ప్రభావితమైన కుటుంబాలను కాషాయ శిబిరం తనను కలవకుండా అడ్డుకుంటోందని మండిపడ్డారు. గత నెలలో జరిగిన అల్లర్ల తర్వాత తొలిసారిగా మమతా బెనర్జీ ముర్షిదాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది బయటి వ్యక్తులు, కొంతమంది మత నాయకులు వర్గాల మధ్య హింస, శత్రుత్వాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని, అల్లర్లను రెచ్చగొట్టేవారు పశ్చిమ బెంగాల్‌కు శత్రువులు అని ఆమె పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)పై తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల ముర్షిదాబాద్‌లో ప్యానల్ సభ్యులు పర్యటించారని, అయితే ప్యానల్ ప్రాధాన్యతలు ఏమిటని ప్రశ్నించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యులు బిజెపి పాలిత ఉత్తర ప్రదేశ్, జాతి హింసతో కల్లోలితమైన మణిపూర్‌ను సందర్శించారా అని నిలదీశారు. 2016లో నోట్ల రద్దు ప్రకటించిన ఒక రోజు తర్వాత ఆన్‌లైన్ చెల్లింపు వేదికలు వార్తాపత్రికలలో మొదటి పేజీ ప్రకటనలతో వచ్చినట్లే, అల్లర్లు జరిగిన వెంటనే ఎన్‌హెచ్‌ఆర్‌సి ముర్షిదాబాద్‌ను సందర్శించిందని, ఇది ముందస్తు ప్రణాళికతో జరిగిందని తాను చెప్పగలనన్నారు.

ఇప్పటికే కుట్రలో కొంత భాగాన్ని వెలికితీశానని, దీనిని మీడియా ముందు బహిర్గతం చేస్తాన్నారు. దురదృష్టవశాత్తు, కొన్ని మీడియా సంస్థలు అబద్ధాలను వ్యాప్తి చేసేందుకు బిజెపి చేతుల్లోకి వెళ్లాయన్నారు. బిజెపి దుర్మార్గపు ఆటపై మండిపడుతూ ముర్షిదాబాద్ అల్లర్ల బాధిత కుటుంబాలను బలవంతంగా ఇతర ప్రదేశాలకు తరలించారని, తద్వారా వారు తనను కలవలేదని బెనర్జీ పేర్కొన్నారు. ఇది కిడ్నాప్ కాదా? వారిని ఇక్కడ కలుసుకుని చెక్కులు అందజేసి ఉంటే ఎలాంటి హాని జరిగి ఉండేది కాదన్నారు. మత హింసను రెచ్చగొట్టే బదులు, మన సరిహద్దులను రక్షించుకోవడానికి ప్రయత్నాలు చేపట్టాలని ముఖ్యమంత్రి కేంద్రానికి హితవు పలికారు.

## సుంకాల పెంపు హక్కు ట్రంప్‌కుంది



### తక్షణమే భారత్ అమెరికా అధ్యక్షుడితో చర్చలు జరపాలి :రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ స్ట్రక్చర్‌ను మార్చాలనుకుంటున్నట్లు ప్రకటించే హక్కు ఆయనకు ఉందని, అయితే భారతదేశం వెంటనే చర్చలు జరపాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ఏప్రిల్ 21న అమెరికా బ్రౌన్ యూనివర్సిటీలోని వాట్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సంభాషణ వీడియోను శనివారం వాట్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ తన యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేశారు. వీడియోను రాహుల్ సోమవారం ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. భారతదేశానికి స్థాయి, నైపుణ్యం ఉందని, మనకు ఇప్పుడు కావలసింది స్పష్టమైన దృక్పథం నిర్మించడం, ముందుకు సాగడమేనన్నారు. ప్రజాస్వామ్యం, భవిష్యత్తును పటిష్టంగా తయారు చేయడానికి చేయి చేయి కలిపి ముందుకు వెళ్లాలని ప్రపంచానికి చాటిచెప్పడమేనన్నారు. గత నెలలో జరిగిన సంభాషణలో రాహుల్ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడుతూ నేడు భారతదేశం ముందు ఉన్న అతిపెద్ద సవాలు చైనాతో పోటీ పడటానికి ఉత్పత్తి వ్యవస్థను సృష్టించడం, అందుకు కావాల్సిన తయారుదారులు, ఉద్యోగాల సృష్టి అని అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ లేకుండా భారతదేశం ఎప్పటికీ ఆ విధంగా చేయలేదని, బలహీనపడుతున్న కుల నిర్మాణాలు, సామాజిక పురోగతి మాట్లాడేవారు ఎవరైనా డబ్బు అవసరమని అంగీకరించాలని రాహుల్ పేర్కొన్నారు. ఉత్పత్తి వ్యవస్థ, బహిరంగ సరళీకృత ఆర్థిక వ్యవస్థను కలిగి ఉండటం ద్వారానే డబ్బు సంపాదించేందుకు ఏకైక మార్గమని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల చర్యకు భారత ప్రభుత్వ ప్రతిస్పందనపై తన అభిప్రాయాల గురించి అడిగినప్పుడు, రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ విషయాలను తమకు చెప్పలేదని, ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వెల్లడించలేమన్నారు. డొనాల్డ్ ట్రంప్ చర్చలు జరుపుతున్నారని, చర్చలు జరపడానికి ఆయనకు హక్కులు ఉందన్నారు. అయితే మనం కూడా తిరిగి చర్చలు జరపాలని సూచించారు. మన బలాలు ఏమిటో, మనకు ఏమి అవసరమో అర్థం చేసుకోవాలన్నారు. అయితే మనకు హానికరమైన రంగాలలో రాజీ పడొద్దని, సుంకాల నిర్మాణాన్ని మార్చాలనుకుంటున్నానని చెప్పడానికి ట్రంప్‌కు హక్కులు ఉన్నాయని రాహుల్ ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్య వాతావరణంలో ఎలా సమర్థవంతంగా ఉత్పత్తి చేయవచ్చో అమెరికా, భారతదేశం చూపించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.


## 15న వక్ఫ్ సవరణ చట్టం పిటిషన్ల విచారణ

### ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడి
### మే 13న సంజీవ్‌ఖన్నా పదవీవిరమణ నేపథ్యంలో ఈ తాజా నిర్ణయం

**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తదుపరి సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మే 15న విచారణకు స్వీకరించనున్నదని సోమవారం సుప్రీం కోర్టు తెలియజేసింది. ప్రస్తుత సిజెఐ సంజీవ్‌ఖన్నా మే 13వ తేదీన పదవీవిరమణ చేసిన ఒకరోజు తర్వాత ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టబోతున్న బిఆర్.గవాయ్ ముందు ఈ వక్ఫ్ (సవరణ) చట్టం వ్యతిరేక పిటిషన్లు విచారణకు రానున్నాయి. సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కెవి.విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ సందర్భంగా మాట్లాడుతూ ‘మీకు (కేంద్రం) కొన్ని అంశాలలో స్పష్టత అవసరం. నేను న్యాయమూర్తికి మధ్యంతర దశలో తీర్పును రిజర్వ్ చేయదలచుకోలేదు. ఈ అంశం ప్రారంభ తేదీ నుంచి ఒక సహేతుకతతో విచారించాల్సి ఉంటుంది. అయితే ఈ పిటిషన్ ఇక నా ముందు విచారణకు ఉండదు’ అని బెంచ్ వివరించింది. ‘మేం చాలా లోతుగా కౌంటర్ అఫిడవిట్ (కేంద్రం యొక్క) లోతుల్లోకి వెళ్లడం లేదు. రిజిస్ట్రేషన్ (వక్ఫ్ ఆస్తులకు) సంబంధించి కొన్ని అంశాలను లేవనెత్తారు, అంతేకాకుండా కొన్ని వివాదాస్పద గణాంకాలను అందజేసి ఉన్నారు. దానికి కొంత పరిశీలన అవసరం అవుతుంది’ అని సిజెఐ సంజీవ్‌ఖన్నా చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా పదవీ విరమణను ప్రస్తావిస్తూ ‘ప్రతీ వివాదానికీ ఒక సమాధానం ఉంటుంది కాబట్టి మేం మీ లార్డ్‌షిప్ (సిజెఐ)ను ఇష్టపడతాం. కానీ సమయం లేనందున మేం మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేం’ అని కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రధాన న్యాయమూర్తి పదవీవిరమణను సూచిస్తూ అన్నారు. ‘పదవీవిరమణను గురించి మీ లార్డ్‌షిప్‌ను (సిజెఐ) గుర్తుచేయడం బాధాకరం’ అని లా ఆఫీసర్ అయిన సొలిసిటర్ జనరల్ ఆవేదన వ్యక్తం చేశారు. ‘లేదు లేదు నేను పిటిషన్ విచారణను ముందుకు తీసుకువెళ్లాలని భావిస్తున్నాను’ అని ప్రధానన్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా అన్నారు. కేంద్రం అఫిడవిట్ సమగ్రంగా ఉందని, మునుపటి తేదీన వ్యక్తం చేసిన ఆందోళనలను సంబంధించిన చాలా సమస్యలను పరిష్కరించిందని సిజెఐ చెప్పారు. కేంద్రం ప్రస్తావించిన కొన్ని గణాంకాలు, ఇతరులవైపు నుంచి వివాదాస్పమైన నేపథ్యంలో ఒక సహేతుకమైన ముందస్తు తేదీన విచారణకు స్వీకరించి పరిష్కరించాల్సి ఉందని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా స్పష్టం చేశారు. సమయ పరిమితుల దృష్ట్యా ఇది తన సారథ్యంలో విచారణ జరిపేందుకు సాధ్యం కాదని, అందువల్ల వక్ఫ్ (సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను మే 15న నూతన ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న బిఆర్.గవాయ్ ధర్మాసనం ముందు విచారణ జరుగనున్నదని సంజీవ్‌ఖన్నా తెలిపారు. అంతకు ముందు కేంద్రం సుప్రీంకోర్టుకు వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయబోమని, ‘వక్ఫ్ బై యూజర్’ ద్వారా సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ లేదా వక్ఫ్ బోర్డులకు మే 5వ తేదీవరకు ఎలాంటి నియామకాలు చేపట్టమని హామీ ఇచ్చి ఉన్నది. దీనికి ముందు వక్ఫ్ (సవరణ)చట్టం 2025లోని కొన్ని నిబంధనల చుట్టూ ఉన్న అసత్యమైన తప్పుడు కథనాలను ఎత్తిచూపుతూ దాఖలు చేసిన పిటిషన్లను తిరస్కరించాలని కేంద్రం సుప్రీంకోర్టును కోరిన విషయం విదితమే.

## ఉద్రిక్తతలవల్ల పాక్ ఆర్థిక వృద్ధికి చేటు

### మూడీ నివేదిక వెల్లడి




**న్యూఢిల్లీ :** పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి అనంతరం ఏర్పడిన ఉద్రిక్తతలవల్ల పాకిస్థాన్ ఆర్థికవ్యవస్థపై భారం పడుతుందని, అది పాకిస్థాన్ ఆర్థిక వృద్ధికి చేటు కలిగిస్తుందని అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థల విశ్లేషణ, పరిశోధనాసంస్థ ‘‘మూడీ’’ నివేదిక వెల్లడించింది. ఈ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థలో ఒడిదొడుకులను తట్టుకుని నిలబడగలశక్తిసామర్థ్యాలు సాపేక్షంగా భారత్‌కు ఉన్నాయని కూడా వెల్లడించింది. ఈ ఉద్రిక్తతలవల్ల పాకిస్థాన్ విదేశీ మారక నిల్వలపై పెనుభారం పడుతుందని పేర్కొంది. ఐతే భారత్ ఆర్థిక కార్యకలాపాలలో అంత భారీస్థాయిలో ఎలాంటి విఘాతం కలగబోదని పేర్కొంది. ఎందుకంటే పాకిస్థాన్‌తో భారత్‌కు చాలా చాలా పరిమితమైన ఆర్థిక సంబంధాలున్నాయని ఇది గత ఏడాదిలో 0.5 శాతం మేరకే ఉన్నాయని పేర్కొంది. ఈ ఉద్రిక్తతలవల్ల పాకిస్థాన్‌పై భారతదేశం తీవ్ర ఆర్థిక ప్రభావం చూపించే అవకాశం ఉందని, భారతవల్ల పాకిస్థాన్ ద్రవ్య పరిస్థితులు, పురోగతి వెనుకబడుతుందని, స్థూల ఆర్థికవ్యవస్థ స్థిరత్వం ప్రగతి కుంటుబడుతుందని ‘‘మూడీ’’ సంస్థ పేర్కొంది. పాకిస్థాన్ స్థూల ఆర్థిక పరిస్థితులు ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాయని, వృద్ధి క్రమంగా పెరగుతోందని, ద్రవ్యోల్బణం తగ్గుతోందనీ, విదేశీ మారకద్రవ్యం నిల్వలు పెరుగుతున్నాయని, ఐఎంఎఫ్ కార్యక్రమం వల్ల ఈ వృద్ధి సాధ్యపడిందని పేర్కొంది. ఐతే ఉద్రిక్తతలు గనుక పెరిగితే పాకిస్థాన్ విదేశీ మారకద్రవ్యంపై ఇది ప్రభావం చూపిస్తుందని, ఈ నిల్వలు తగ్గుతాయని పేర్కొంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కార్యనిర్వాహక మండలి నిర్ణీత ప్రకారం మే తొమ్మిదో తేదీన పాకిస్థాన్ అధికారులతో సమావేశం జరుపుతుంది. ఈ సమావేశంలో బహుశా ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఉద్రిక్తతల నియంత్రణ గురించి కూడా ఐఎంఎఫ్ కొన్ని హెచ్చరికలు పాకిస్థాన్‌కు చేసే అవకాశాలు ఉన్నాయి. వాతావరణ నియంత్రణకు సంబంధించి 1.3 బిలియన్ డాలర్ల తాజా నిధి ఏర్పాటు గురించి ఈ సమావేశం జరగనున్నది. అదేవిధంగా ప్రస్తుతం పాకిస్థాన్ తన సమస్యలను అధిగమించడానికి ఐఎంఎఫ్ నుండి తీసుకున్న ఏడు బిలియన్ డాలర్ల మొత్తాన్ని ఏ విధంగా ఖర్చుపెడుతున్నారన్న విషయాలను కూడా ఈ సమావేశంలో విశ్లేషణ చేస్తారు. అదేవిధంగా పాకిస్థాన్‌కు నిధులు ఇచ్చే విషయంపై పునరాలోచన చేయాలని కూడా భారతదేశం ఐఎంఎఫ్ సహా ఇతర సంస్థలను కోరే అవకాశాలున్నాయి. 1972లో కూడా కిస్థాన్‌కు భారతదేశంతో ఇదే పరిస్థితి వచ్చింది. ఆనాడు కూడా యుద్ధవాతావరణం ఏర్పడినప్పుడు సిమ్లా శాంతి ఒప్పందాన్ని రద్దుచేసింది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రద్దుచేసింది. భారత్ విమానాలు ప్రవేశించకుండా పాకిస్థాన్ గగనతలాన్ని మూసివేసింది. గతవారంలో పాకిస్థాన్ దిగుమతులపై భారతదేశం నిషేధం విధించింది. పాకిస్థాన్ నుండి వచ్చే వస్తురవాణాను నిలిపివేసింది. అనేక ప్రపంచదేశాలు భారత్—పాకిస్థాన్‌లకు ఉద్రిక్తతలు తగ్గించుకోమని విజ్ఞప్తులు చేశాయి.

### పహల్గామ్ ఉగ్రదాడి మృతుడి భార్యపై ట్రోల్స్..
## మహిళా కమిషన్ సీరియస్

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి మృతుడి భార్యను నెట్టింట్లో ట్రోల్ చేస్తున్నారు. దాంతో జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఆమె సైద్ధాంతిక వ్యక్తీకరణను తప్పుపడుతూ ట్రోల్ చేయడం సరి కాదని వ్యాఖ్యానించింది. ఆ ట్రోలింగ్‌ను తీవ్రంగా ఖండించింది. మతం పేరు అడిగి మారణహోమం సృష్టించడం దారుణమని పేర్కొంది. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో నేవీ అధికారి, లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కూడా మరణించారు. ఈ నేపథ్యంలో ఒక వర్గం వారిని టార్గెట్ చేసేలా వ్యాఖ్యలు చేయొద్దంటూ ఆయన సతీమణి హిమాన్షి విజ్ఞప్తి చేశారు. ఇది కొందరు నెటిజన్లకు రుచించలేదు. దాంతో ఆమెను విమర్శిస్తూ ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఆమెను ఉద్దేశించి కామెంట్లు చేయడం ఏమాత్రం తగదని, దీనిపై కేంద్రం స్పందించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ క్రమంలోనే తాజాగా మహిళా కమిషన్ స్పందించింది. పహల్గామ్ ఉగ్రదాడితో ఎన్నో కుటుంబాలకు తీరనిలోటు ఏర్పడిందని వ్యాఖ్యానించింది. లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను కూడా మతం పేరు అడిగి ప్రాణాలు తీశారని విమర్శించింది. ఉగ్రఘటనపై దేశం మొత్తం ఆగ్రహంగా ఉందని, ఈ క్రమంలో హిమాన్షి నర్వాల్ వ్యక్తం చేసిన అభిప్రాయంపై సోషల్ మీడియాలో వస్తోన్న విమర్శలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆగ్రహించింది. హిమాన్షి వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం పూర్తిగా ఖండించదగినదని, ఏదైనా కామెంట్ చేసేటప్పుడు మర్యాదగా, రాజ్యాంగ హద్దులకు లోబడి వ్యవహరించాలని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్టు పెట్టింది. కాగా హర్యానాకు చెందిన వినయ్‌హిమాన్షి వివాహం ఏప్రిల్ 16న జరిగింది. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్‌కు హనీమూన్‌కు వెళ్లారు. తొలుత హనీమూన్ కోసం యూరప్ వెళ్లాలని నిర్ణయించుకున్న ఈ నవ జంట.. తమ వీసాలు రిజెక్ట్ కావడంతో జమ్మూకశ్మీర్‌కు వెళ్లింది. ఉగ్రదాడితో ఆమె కలలన్నీ కల్లలయ్యాయి. పెళ్లై వారం కూడా గడవక ముందే భర్తను కోల్పోయింది. అంత్యక్రియల సమయం లో భర్తకు సెల్యూట్ చేస్తూ ఆమె రోదించిన తీరు ప్రతి ఒక్కరిని బాధించింది.

## భారత్‌కు పాకిస్థాన్ అణుబాంబు హెచ్చరిక



**మాస్కో :** తమదేశంపై దాడికి పాల్పడినా లేదా సింధునదీ జలాల ప్రవాహాన్ని నిలిపివేసినాగానీ అణుబాంబుతో సమాధానం చెబుతామని భారత్‌కు పాకిస్థాన్ హెచ్చరిక చేసింది. ఒకవేళ తమదేశంపై దాడిచేసినా, లేదా కీలకమైన మంచినీటి సరఫరాను అడ్డుకున్నాగానీ అణ్వాయుధాలతోపాటు పూర్తిస్థాయి బలంతో పాకిస్థాన్ ప్రతిస్పందించడానికి సిద్ధంగా ఉందని హెచ్చరించింది. మాస్కోలో పాకిస్థాన్ దౌత్యవేత్త సోమవారంనాడు ఈ మేరకు ఒక హెచ్చరిక చేశారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు గతనెల 22వ తేదీన కాల్పుల దాడి చేసిన తర్వాత రెండు దేశాలమధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో మాస్కోలో పాకిస్థాన్ దౌత్యవేత్త మహ్మద్ ఖలిద్ జమాలీ ఈ హెచ్చరిక చేశారు. రష్యా ప్రభుత్వ వార్తాసంస్థ ‘‘టాస్’కు ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో, పాకిస్థాన్ అటు సంప్రదాయబద్ధమైన ఆయుధాలతోపాటు అణ్వాయుధాలను కూడా పూర్తిస్థాయిలో ఉపయోగించగలదన్నారు. సింధు నదీ జలాలకీలక ఒప్పందాన్ని భారత్ రద్దుచేయడాన్ని ఆయన ప్రస్తావించారు. నీటి సరఫరాను తగ్గించడం లేదా నిలిపివేయడం వంటి చర్యలు యుద్ధంతో సమానమైనదని, అందుకు తగ్గట్టుగా అణ్వాయుధాలతో పాకిస్థాన్ ప్రతిస్పందిస్తుందని ఆయన హెచ్చరించారు. రెండు దేశాలవద్దా అణ్వాయుధాలు ఉన్నాయనీ, అందువల్ల వెనక్కు తగ్గడం మంచిదన్నారు. తొలుత పాకిస్థాన్ పహల్గామ్ ఉగ్రదాడిపై స్పందిస్తూ, ఈ విషయంపై తటస్థపద్ధతిలో విశ్వసనీయమైన దర్యాప్తు జరిపించాలని కోరింది. అంతర్జాతీయ ప్రపంచం ఇందులో జోక్యం చేసుకోవాలని కోరింది. చైనా,రష్యా వంటి దేశాలు ఈ దర్యాప్తులో జోక్యం చేసుకోవాలని పాకిస్థాన్ కోరింది. ‘‘జమ్మూ కశ్మీరులో సమస్యకు మూల కారణం కశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కేననీ, ఈ స్వయంనిర్ణయాధికార హక్కు రక్షణకు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో చేసిన అనేక తీర్మానాల ద్వారా అంతర్జాతీయ సమాజం వాగ్దానాలు చేసిందని అన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని, స్థిరమైన, శాశ్వతశాంతిని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దర్యాప్తులో పాల్గొనాల్సిందిగా రష్యాకు లాంఛనపూర్వక విజ్ఞప్తి చేసేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉందా? అని ప్రశ్నించగా అందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ ఆరోపణల ఆటలను కట్టిపెట్టేందుకు దర్యాప్తు చేయాలని కోరుతున్నామని, ఎప్పటికప్పుడు ఇలాంటి దాడులు జరిగినప్పుడు తమ దేశంపై ఆరోపణలు చేస్తున్నారని, ఈ మూల కారణాన్ని, ఈ మూల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇప్పుడు రష్యా ఉక్రేన్ వివాదంలో మూల కారణాన్ని పరిష్కరించే పనిలో ఉందన్నారు. అదేవిధంగా దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యను కూడా పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో ఇతరులపై నిందలు సులభంగా వేస్తున్నారన్నారు. కాగా ఈ నెల 24వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక ప్రకటన చేస్తూ పహల్గామ్ దాడి సూత్రధారులను మట్టుపెడతామని, ఉగ్రవాదులకు భూమ్మీద చోటు లేకుండా చేస్తామని అన్నారు.

## 11వ రోజూ కాల్పుల విరమణ ఒప్పందానికి పాక్ తిలోదకాలు

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. నియంత్రణ రేఖ వెంబడి దాయాది దేశం పాకిస్థాన్ నిత్యం కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూనే ఉంది. వరుసగా 11వ రోజు అంటే ఆదివారం అర్ధరాత్రి సోమవారం ఉదయం మధ్యలో సరిహద్దుల్లో కాల్పులకు తెగబడింది. కుప్వారా, బరాముల్లా, పూంచ్, రజౌరీ, మెందర్, నౌషేరా, సుందరబనీ, అంకూర్ల సరిహద్దు ప్రాంతాల్లో కాల్పులు జరిపింది. ఈ మేరకు భారత ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది. పాక్ కాల్పులను భారత సైన్యం సమర్థంగా తిప్పి కొట్టినట్లు పేర్కొంది. పహల్‌గామ్ ఉగ్రదాడి తర్వాత దాయాది దేశం పాకిస్తాన్ కయ్యానికి కాలుదువ్వుతోంది. వరుసగా క్షిపణి ప్రయోగాలను పరీక్షిస్తోంది. పాకిస్థాన్ శనివారం అబ్దాలి వెపన్ సిస్టమ్ క్షిపణి శిక్షణ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపింది. ఎక్స్ ఇండస్ కసరత్తుల్లో భాగంగా తయారు చేసిన 450 కి.మీ పరిధి గల ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి ఇది. ఇక సోమవారం ఫతహ్ మిస్సైల్‌ను పరీక్షించింది. 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను ఈ మిస్సైల్ పేల్చగలదు. ఇది సర్ఫేస్ టు సర్ఫేస్ మిస్సైల్.

## రాహుల్ ఒత్తిడికి తలొగ్గిన కేంద్రం



### కులగణనకు ససేమిరా అన్న బిజెపి దారికొచ్చింది : ప్రియాంక

**న్యూఢిల్లీ :** వచ్చే జనాభా లెక్కలతోపాటే కుల గణన చేపడుతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తూనే.. కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపి ప్రియాంకాగాంధీ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. తన సోదరుడు రాహుల్‌గాంధీ ఒత్తిడి కారణంగానే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేందుకు అంగీకరించిందని ఆమె వ్యాఖ్యానించారు. కేరళలోని వయనాడ్ నియోజకవర్గంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రియాంకాగాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. కులగణన అంశాన్ని తన సోదరుడు రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో లేవనెత్తారని ప్రియాంకాగాంధీ చెప్పారు. ‘కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. నా సోదరుడు గత ఏడాది ఈ అంశాన్ని ఎత్తుకున్నారు. మళ్లీ మళ్లీ ఆయన కులగణన అంశాన్ని ప్రస్తావించారు. కానీ బిజెపి నాయకులంతా ఆయన ప్రతిపాదనను తోసిపుచ్చారు. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు కూడా తన ప్రతిపాదనను వ్యతిరేకించారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ఈ అంశంపై మాట్లాడుతుంటే బిజెపి నేతలు ఎగతాళి చేశారు’ అని ప్రియాంకా గాంధీ గుర్తుచేశారు. ‘కులగణనకు ససేమిరా అన్న బిజెపి ఇప్పుడు దారికొచ్చింది. దేశం మొత్తం కులగణన తప్పనిసరి అనే భావనకు రావడంతో కేంద్రం తలొగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో కులగణన అవసరం. ఒత్తిడితోనైనా సరే కులగణన చేపట్టేందుకు కేంద్రం అంగీకరించడాన్ని నేను స్వాగతిస్తున్నా. కులగణన చేపడుతామన్న కేంద్రం ప్రకటన తనకు సంతోషాన్నిచ్చింది. ఆ విషయంలో వాళ్లు ఏదైనా చేయనియ్యండి. కానీ ఒక పద్ధతి ప్రకారం చేయాలి. అప్పుడే అసలైన ఫలితాలు బయటికి వస్తాయి’ అని అన్నారు.

## కుల సర్వే కాలపరిమితి, వివరాలు ప్రకటించాలి

### రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయాలి : కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** ప్రభుత్వం కుల గణనపై కాలపరిమితి, రోడ్ మ్యాప్ ప్రకటించాలని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలని, ప్రైవేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5)ని అమలు చేయాలన్న డిమాండ్‌ను కాంగ్రెస్ మరోసారి ఉద్ఘాటించింది. ప్రతిపక్ష పార్టీ ఎస్‌సి, ఒబిసి, ఆదివాసీ విభాగాల చీఫ్‌లు 24, అక్బర్ రోడ్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా, అర్జున్ సింగ్ విద్యామంత్రిగా ఉన్నప్పుడు, రాజ్యాంగంలోని 93వ సవరణను ఆమోదించారని, దానికి ఆర్టికల్ 15(5) చేర్చారని ఎఐసిసి ఒబిసి విభాగం చైర్మన్ అనిల్ జైహింద్ అన్నారు. ఇది దళితులు, ఆదివాసీలు, ఒబిఇసిలకు విద్యా సంస్థల్లో రిజర్వేషన్‌ను అందించిందన్నారు. అయితే ఈ రిజర్వేషన్‌ను ప్రభు త్వ సంస్థలలో అమలు చేయగా, ప్రైవేట్ సంస్థలు కోర్టుకు వెళ్లాయని చెప్పారు. జనవరి 2014లో, దళితులు, గిరిజనులు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు ప్రభుత్వం కల్పించవచ్చని నిర్ణయించిందన్నారు. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయని, కొత్త ప్రభుత్వం ఏర్పాటయిందన్నారు. గత 11 సంవత్సరాలుగా రాజ్యాంగంలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు ప్రైవేట్ సంస్థలలో రిజర్వేషన్లు ఇవ్వవచ్చని నిబంధన ఉన్నప్పటికీ, దాని కోసం చట్టం చేయాల్సిన అవసరం ఉందని అని జైహింద్ అన్నారు. ఇప్పటివరకు మోడీ ప్రభుత్వం అలాంటి చట్టాన్ని చేయకపోవడం దురదృష్టకరమని, దీనివల్ల సమాజంలోని అణగారిన, దోపిడీకి గురైన వర్గాలు విద్య ప్రయోజనం పొందలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని సామాజిక న్యాయానికి అతిపెద్ద అడ్డంకిగా పేర్కొంటూ కాంగ్రెస్ దానిని రద్దు చేయాలని కోరుతుందని ఎఐసిసి ఎస్‌సి విభాగం అధిపతి రాజేష్ లిలోథియా అన్నారు. కుల గణన నిర్వహించాలని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒత్తిడి చేసినట్లుగానే తాము కూడా రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని కోరుకుంటున్నామన్నారు. ఇడబ్ల్యుస్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అగ్ర సామాజిక వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు మంజూరు చేయగా, దీనిని సుప్రీంకోర్టు కూడా ఆమోదించిందన్నారు. అయితే 50 శాతం పరిమితిని కూడా దాటవచ్చని స్పష్టం చేసినట్లే కదా అని లిలోథియా పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, CUM I ADDITONAL METROPLOTITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT :: KUSHAIGUDA.

I.A. No. 593 of 2024
IN
O.S. No. 1088 of 2024

Between :-
RAMANLAL GUDIVADA ....Petitioner/Plaintiff
AND
BHARATAVARSHA, BHARATAVARSHA DIGITAL MEDIA NETWORK, Rep by its Managing Director, DUVVADA SIVA PRASAD & OTHERS, ....Respondents/Defendants

To,
1) BHARATAVARSHA, BHARATAVARSHA DIGITAL MEDIA NETWORK, Rep by its Managing Director, DUVVADA SIVA PRASAD, O/o. Swarna Towers , Flat No. 406, Madhapur, Hyderabad.- 500081. ......Respondent No.1
2) HINDU JANA SHAKTHI, Rep by its Managing Director, LALITH KUMAR, O/o Flat No. 6, Sai Kiran Residency, Madhapur,Hyderabad.- 500081. ......Respondent No.2
3) BIG TV LIVE, O/o. 3-6-16/12, Ameerpet, Shanti Nagar, Hyderabad. 500016. ......Respondent No.4
4) THE CHITRAGUPTH, Rep by its Managing Director, CHITRA,O/o. 6-8-132/5, Flat No.14, Suvarna Apartments Ameerpet, Hyderabad, Hyderabad- 500016. ......Respondent No.5
5) R VOICE CHANNEL, Rep by its Managing Director, REDDY PRASAD, O/o. Flat No. 16, Aparna Towers, Ameerpet, Hyderabad- 500016 ......Respondent No.6
6) SIGNATURE STUDIOS, Rep by its Managing Director, DERA M, O/o. Vasavi Granth Towers, Madhapur, Hyderabad- 500081 ......Respondent No.7
7) DIVYA DIAMONDS GEMOLOGY, Rep by its Managing Director, MAHRNDER BABU, O/o. Bapu Towers, Ameerpet, Hyderabad- 500016. ......Respondent No.10
8) A.RAJU S/o., Not Known, Flat No. 402, Lakeview Appartment, Gazetted Officers Colony, Madhapur, Hyderabad-500049. ......Respondent No.14
9) RAMESH VEMULUVADA, R/o., H.No. 13-11, Vemulavada, Vemuluvada, Sircilla, Telangana State. ......Respondent No.12
10) GYOORA DEEPIKA W/o., Not Known, R/o., H.No. 13/33/2/2, Near to NFC Railway Gate, Laxmi Nagar, Ghatkesar. ...Respondent No.13
11) G.NAGESHWAR RAO, S/o., Not Known, R/o., H.No. 1-1-20/19/A, Near Old Muncipal Office, Kapra Village, Ranga Reddy District, Hyderabad-500062. ...Respondent No.15
12) SIVA (SRAVYA), R/o., H.No. 3-1-7, Vijayapiri Colony, Uppal, Medchal - Malkajgiri, Telangana State- 500039 ......Respondent No.16
13) CH SRINIVAS S/o., Not Known, R/o., H.No. 9-59, Srivamadripuri Colony, Rampally X Road, Nagaram, Ranga Reddy District- Hyderabad- 500083. ...Respondent No.17

Please take notice that, the above I.A for ad-interim Injunction is filed by Petitioner/Plaintiff, along with Suit For Perpetual Injunction against Respondents/Defendants and the same is posted to 09-05-2025. The Petitioner/Plaintiff filed petition vides I.A. No. 58 of 2025, U/O -V, R-20, R/w-151 of C.P.C. to serve the notice to the Respondents /Defendants by way of Paper Publication the same is allowed and posted on 09.05.2025 for your appearance. If any person/persons or Respondents/Defendants having any objections/claims kindly appear either in person or through an Advocate in the above said court at 10.30 A.M, on the above said date. Otherwise the matter will be decided accordingly.

// By Order of Court //

Sd/-
G.ARUN KUMAR
J.NARSIMHA
J.NAGESH
Advocates
# 41-7/1, Hanuman Nagar,Moulali, Hyderabad – 500 040.
MobileNo. 9246526515.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, CUM I ADDITIONAL METROPLOTITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRIDISTRICT, AT :: KUSHAIGUDA.

O.S. No. 1088 of 2024

Between :-
RAMANLAL GUDIVADA ....Plaintiff
AND
BHARATAVARSHA, BHARATAVARSHA DIGITAL MEDIA NETWORK, Rep by its Managing Director, DUVVADA SIVA PRASAD & OTHERS, ....Defendants

To,
1) BHARATAVARSHA, BHARATAVARSHA DIGITAL MEDIA NETWORK, Rep by its Managing Director, DUVVADA SIVA PRASAD, O/o. Swarna Towers , Flat No. 406, Madhapur, Hyderabad.- 500081. ......Defendant No.1
2) HINDU JANA SHAKTHI, Rep by its Managing Director, LALITH KUMAR, O/o Flat No. 6, Sai Kiran Residency, Madhapur,Hyderabad.- 500081. ......Defendant No.2
3) BIG TV LIVE, O/o. 3-6-16/12, Ameerpet, Shanti Nagar, Hyderabad. 500016. ......Defendant No.4
4) THE CHITRAGUPTH, Rep by its Managing Director, CHITRA, O/o. 6-8-132/5, Flat No.14, Suvarna Apartments Ameerpet, Hyderabad, Hyderabad - 500016 ......Defendant No.5
5) R VOICE CHANNEL, Rep by its Managing Director, REDDY PRASAD, O/o. Flat No. 16, Aparna Towers, Ameerpet, Hyderabad- 500016 ......Defendant No.6
6) SIGNATURE STUDIOS, Rep by its Managing Director, DERA M, O/o. Vasavi Granth Towers,Madhapur, Hyderabad- 500081 ......Defendant No.7
7) DIVYA DIAMONDS GEMOLOGY, Rep by its Managing Director, MAHRNDER BABU, O/o. Bapu Towers, Ameerpet, Hyderabad- 500016. .....Defendant No.10
8) A.RAJU, S/o., Not Known, Flat No. 402, Lakeview Appartment, Gazetted Officers Colony, Madhapur, Hyderabad-500049. ......Defendant No.14
9) RAMESH VEMULUVADA, R/o., H.No. 13-11, Vemulavada, Vemuluvada, Sircilla, Telangana State. ......Defendant No.12
10) GYOORA DEEPIKA, W/o., Not Known, R/o., H.No. 13/33/2/2, Near to NFC Railway Gate, Laxmi Nagar, Ghatkesar. ...Defendant No.13
11) G.NAGESHWAR RAO, S/o., Not Known, R/o., H.No. 1-1-20/19/A, Near Old Muncipal Office, Kapra Village, Ranga Reddy District, Hyderabad-500062. ...Defendant No.15
12) SIVA (SRAVYA), R/o., H.No. 3-1-7, Vijayapiri Colony, Uppal, Medchal-Malkajgiri, Telangana State - 500039 ......Defendant No.16
13) CH SRINIVAS, S/o., Not Known, R/o., H.No. 9-59, Srivamadripuri Colony, Rampally X Road, Nagaram, Ranga Reddy District- Hyderabad-500083. ...Defendant No.17

Please take notice that, the above suit is filed by Plaintiff, Suit For Perpetual Injunction against Defendants and the same is posted to 09-05-2025. The Petitioner/Plaintiff filed petition vides I.A. No. 56 of 2025, U/O -V, R-20, R/w-151 of C.P.C. to serve the notice to the Defendants/Respondents by way of Paper Publication the same is allowed and posted on 09.05.2025 for your appearance. If any person/persons or Respondent/Defendant having any objections/claims kindly appear either in person or through an Advocate in the above said court at 10.30 A.M, on the above said date. Otherwise the matter will be decided accordingly.

// By Order of Court //

Sd/-
G.ARUN KUMAR
J.NARSIMHA
J.NAGESH
Advocates
# 41-7/1, Hanuman Nagar, Moulali, Hyderabad – 500 040.
Mobile No. 9246526515.

## కళాభారతి కోసం కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కేంద్రంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కళాభారతి నిర్మాణం చేపట్టాలని నల్లగొండకు చెందిన కవులు, కళాకారులు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. గతంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి పట్టణంలో టౌన్ హాల్ ఉండేదని, కాలక్రమేణా అది శిథిలమై ప్రస్తుతం పూర్తిగా నేల మట్టం చేశారని, టౌన్ హాల్ కూల్చి వేసిన తర్వాత కవులు, కళాకారులు తమ సాహిత్య సాంస్కృతిక సభలు నిర్వహించుకోవడానికి తగిన చోటు లేదని ఈ సందర్భంగా పలువురు కవులు,కళాకారులు కలెక్టర్ కు విన్నవించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం త్వరలో కళాభారతి నిర్మాణం చేపట్టనున్నదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోమలి కళా సమితి అధ్యక్షులు బక్క పిచ్చయ్య, సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ళ ఆనంద్ పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే



**ప్రజాపక్షం/చండూరు:** పేద ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలపల్లి లో పార్టీ నాయకులతో కలిసి పార్టీ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జరిగిన శాఖ సమావేశంలో సతీష్ కుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సిపిఐ ఎల్లప్పుడు పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. తుమ్మలపల్లి గ్రామంలో ఇండ్లు లేని ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వమే ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నూతన రేషన్ కార్డు , అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు . అనంతరం శాఖ నూతన కార్యదర్శిగా కురుపాటి నగేష్ ఏకగ్రీవంగా ఎన్నికైయారు. కాశిమల్ల శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుంభం నరహరి , శ్రీను, వెంకటేశ్వరరావు, వెంకటయ్య పాల్గొన్నారు.



## మీ గ్రామాల వద్దకే రెవెన్యూ సిబ్బంది

**ప్రజాపక్షం/యాదాద్రి :** రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూర్ మండలంలోని రాయిపల్లి, సర్వేపల్లి గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ రెవెన్యూ వీరారెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలకు ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూభారతి (ఆర్ఓఆర్ చట్టం) అమలులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఆత్మకూర్(ఎం) మండలాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సులో ముందుగా ఆ గ్రామంలోని భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలను తెలియజేయాలని, ఆ పై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం అనంతరం చేయడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్, మార్పులు చేర్పులు, ఏమైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే మీ గ్రామంలోనే మీ ఇంటి దగ్గరకే వచ్చి రెవెన్యూ అధికారులు సమస్య పరిష్కరిస్తారన్నారు. భూ భారతి సేవలు గ్రామంలో రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామ రెవెన్యూ సదస్సులలో ఆర్డీవో కృష్ణారెడ్డి, ఇన్చార్జి తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

### సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య డిమాండ్

**ప్రజాపక్షం/చింతపల్లి :** నల్లగొండ జిల్లాలో ఉన్నా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల కార్యదర్శి పోలె వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని హరిజనాపురం గ్రామంలో ఆదివారం గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ముందుగా హరిజనాపురం సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి కంబాలపల్లి లక్ష్మయ్య అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటయ్య మాట్లాడుతూ సిపిఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇళ్ళను మంజూరు చేయాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి దేవరకొండ, నల్లగొండ నియోజకవర్గాలకు సాగునీరందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు రైతుభరోసా ఇవ్వాలన్నారు. పేదలందరికీ రేషన్ కార్డులు ఇచ్చి, కూలీలకు ఉపాధీ హామీ కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, మండల కార్యవర్గ సభ్యులు మల్లోజు శేఖరాచారి, కలకొండ వెంకటయ్య, వెంకులు, ఇద్దయ్య, కనకయ్య, లింగయ్య, భిక్షమయ్య, ముత్తయ్య, జగన్, జంగయ్య, శ్రీను, ముత్తయ్య, పెద ఇద్దయ్యచ మైసయ్య పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలో సిపిఐ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో జరుగుతున్న గ్రామ శాఖల మహాసభల సందర్భంగా భీమనపల్లి గ్రామ శాఖ మహాసభ సోమవారం జరిగింది.మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వ అధికారులు పారదర్శకంగా చర్యలు చేపట్టాలని కోరారు.నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రాజీవ్ యువ వికాసంకు వేలాది మాది ఋణాల కోసం ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం జరిగింది అన్నారు. ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ఇవ్వాలన్నారు.గ్రామ శాఖ మహాసభలో చిలువేరు రామచంద్రం అధ్యక్షతన జరిగినది.అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా చిలువేరు రామచంద్రం, సహాయ కార్యదర్శిగా కర్నాటి సత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 15న కనగల్‌లో సిపిఐ మండల మహాసభ




**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్) :** ఈ నెల 15వ తేదీన కనగల్ మండల కేంద్రంలో జరిగే సిపిఐ 15వ మండల మా సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో సిపిఐ మండల సమావేశం నిర్వహించారు.సమావేశానికి వీరస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కనగల్ మండలంలో అర్హులైన పేదలకు ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. రైతులు ఆరుగాలాలు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో మిల్లర్లు కొరువులు పెడుతున్నారని ఆరోపించారు. కనగల్ మండలం కేంద్రం లో ఉన్నటువంటి ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యం లేక వేసవికాలంలో అవస్థలు పడుతున్నారు అదేవిధంగా ప్రస్తుతం బస్టాండ్ అంతా గుంతలు, దుమ్ము రావడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బస్టాండ్ లో మరమ్మతులు చేపట్టి ప్రయాణికులు ఇబ్బందులు తీర్చాలన్నారు. మండల కార్యదర్శి గంట సత్యనారాయణ,మండల కార్యవర్గ సభ్యులు దోటి పాండరి, జోగు సురేందర్,బోగరి రామకోటి,వెంకన్న,జోగు కృష్ణయ్య పాల్గొన్నారు.

## అగ్నివీర్ వాయు మ్యూజిషియన్ నియామకానికి దరఖాస్తులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భారత వాయు సైన్యం అఖిల భారత అగ్నివీర్ వాయు మ్యూజిషియన్ నియామక నికి నిర్వహించనున్న ర్యానికి అర్హులైన అభ్యర్థులు ఈనెల 11 వరకు ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్. పద్మ తెలిపారు.అభ్యర్థులు వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు 2005,01 జనవరి, 2008 జులై 1న మధ్య జన్మించి మెట్రిక్యులేషన్,10వ, తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణత కలిగిన అవివాహిత ),పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించబడును.

# రోజువారీ వేతనం రూ.700

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా డిమాండ్



**ప్రజాపక్షం/మునుగోడు :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసే ప్రదేశంలో కూలీలకు కనీస అవసరాలతో పాటు అందుబాటులో ఉన్న సౌకర్యాలను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులలో భాగంగా సోమవారం చండూరు మండలం నెర్మట గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు ఉన్న సమస్యలను కార్మిక సంఘం నేతలకు వివరించారు. అనంతరం బొల్గూరి నర్సింహ్మా మాట్లాడుతూ కూలీలు పనిచేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేక కూలీలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. పని చేసే ప్రదేశంలో మంచినీరు ,టెంట్ ,ఓఆర్ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్టు తదితర సౌకర్యాలను వెంటనే అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కూలీలకు పార ,గడ్డపార తట్ట వంటి పనిముట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కూలీకి సంవత్సరానికి 200రోజుల పనిదినాలు కల్పించి రోజువారి కూలీ 700రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని చేసే ప్రదేశంలో పోటో స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ జీతాలను వెంటనే చెల్లించాలని, అదే విధంగా పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మునుగోడు నియోజకవర్గం అధ్యక్షుడు ఎండి జానిమియా , ప్రధాన కార్యదర్శి చెడుబుద్ది ఊషయ్య, చండూరు మండల కార్యదర్శి ఇరిగి సంజీవ , నాయకులు బండమీది వెంకన్న , డి.అండాలు,ఎస్ సరస్వతి , బి.లక్ష్మమ్మ , ఎం.సుగుణమ్మ ,కడారి చంద్రయ్య ,సైదులు తదితరులు పాల్గొన్నారు.

**పని ప్రదేశాలలో ఫొటోస్ స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలి**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులలో కూలీలకు పని ప్రదేశాలలో ఫొటోస్ స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు లేక ఉపాధి హామీ కూలీలు నానా అవస్థలు పడుతున్నారని పని ప్రదేశాలలో మంచినీరు టెంట్ సౌకర్యం,ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్టు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు ఎండి జాన్మియా, మండల నాయకులు రేవల్లి అంజ య్య, దుబ్బ వెంకన్న, కురుమూర్తి సైదమ్మ, దుబ్బ భాగ్యమ్మ,పారిజాతమ్మ,చాపల ప్రమీల, యాదమ్మ,పద్మ, జయమ్మ పాల్గొన్నారు.

# అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వొద్దు

### ఇస్తే కఠిన చర్యలు : నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఎలాంటి అధికారిక, రాజకీయ ఒత్తిడులకు లోను కాకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని,అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్దనుండి ఫిర్యాదులను స్వీకరించి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇదివరకు వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సహాయం పొందిన వారికి తిరిగి రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆర్థిక సాయం పొందేందుకు అర్హత ఉండదని స్పష్టం చేశారు. రాజీవ్ యువ వికాస పథకం లక్ష్యాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ నెల 12న ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే పోటీదారులు నాగార్జునసాగర్ సమీపంలో ఉన్న బుద్ధవనాన్ని సందర్శిస్తున్న దృష్ట్యా బుద్ధవనం,విజయ విహార్ ల వద్ద శానిటేషన్ , లైటింగ్ ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారిని ఆదేశించారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని పునరుద్ఘాటించారు.ఈసమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, డిఆర్‌డిఏ శేఖర్ రెడ్డి, ఇన్చార్జి డిఆర్ఓ ,ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి, చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి లు ఉన్నారు.

## పైలట్ ప్రాజెక్టుగా గరిడేపల్లి ఎంపిక

### జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గ్రామసభల ద్వారా అర్జీలను స్వీకరించి నూతన చట్టం ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు, భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవిన్యూ సదస్సుఉలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలం రాయినిగూడెం, తాళ్లమల్కాపురం రెవిన్యూ గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవిన్యూ సదస్సుకు ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించి నూతన చట్టం ప్రభుత్వ అదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. భూభారతి చట్టం అమల్లో గరిడేపల్లి మండలాన్ని జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. రాయినిగూడెం గ్రామ రెవిన్యూలో 139 దరఖాస్తులు, తాళ్లమల్కాపురం లో 60 దరఖాస్తులు రైతుల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ కవిత, కోదాడ తహసిల్దార్ వాజీద్‌అలీ, రైతులు పాల్గొన్నారు.

## రూ.10 కోట్లు విలువచేసే గంజాయి ధ్వంసం

### గంజాయి అక్రమ రవాణాపై నిఘానేత్రం : చందనా దీప్తి



**ప్రజాపక్షం/భువనగిరి :** గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లుగా సికింద్రాబాద్ రైల్వే డిస్టిక్ట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ చందనా దీప్తి ఐపిఎస్ తెలిపారు. సోమవారం భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో రోమా ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2024/25 సంవత్సరంలో రైళ్లలో అక్రమంగా రవాణా చేస్తున్న 2,010 కిలోల గంజాయిని పట్టివేసి 74 కేసులు పెట్టినట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా వారు స్వాదీనం చేసుకున్న 2,010 కిలోల గంజాయిని రోమా ఇండస్ట్రీస్‌లోని బర్నర్‌లో కాల్చీబూడిద చేశారు. కాల్చిబూడిద చేసిన గంజాయి విలువ రూ.10 కోట్ల 5 లక్షల 6,750 ఉంటుందని వివరించారు. గంజాయిని ధ్వంసం చేసిన విదానాన్ని వీడియో రూపంలో, ఫోటోల రూపంలో చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రైల్వే డిస్టిక్ట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ నోడల్ అధికారి, సభ్యుడు ఎస్ఎన్ జావెద్, టి.కృపాకర్, శ్రీనివాస్, కె.రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు పునరుద్ధరించాలని ఫిర్యాదు

**ప్రజాపక్షం/మోటకొండూరు :** నల్లగొండ నుండి వలిగొండ మీదుగా చాడ, చందేపల్లి, వర్టూరు, మోటకొండూరు నుండి ఆలేరు వరకు గత కొన్ని సంవత్సరాల నుండి నడిచిన బస్సును కరోనా నుండి నిలిపివేసినారు. దానివల్ల మండల ప్రజలు మండల కేంద్రానికి రావాలన్నా పోవాలన్న అనేక అవస్థలు పడాల్సి వస్తుందని సోమవారం కలెక్టర్‌కు గ్రీవేన్స్ డేలో చాడ, ముత్తిరెడ్డిగూడెం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మోటకొండూరు మండలం ఏర్పాటు అయినప్పటి నుండి కదిరేణిగూడెం, నాంచారిపేట, కొండాపురం, కాటేపల్లి తదితర గ్రామాల ప్రజలు నల్గొండకు పోవాలన్నా,మండల కేంద్రానికి రావాలన్నా చాల సౌకర్యంగా ఉండేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈరగాని శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, అనిత, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## సమగ్ర యువజన విధానం కోసం పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జాతీయ 17వ మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. భువనగిరిలో జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తుల ఐక్యత కొరకు యువత పనిచేయాలని కోరారు. ఈ దేశ సమగ్రత సమైక్యతను కాపాడు కొరకు యువత ఉద్యమాలు నిర్వహించాలని అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల పైన రాజీలేని పోరాటాలు నిర్వహించడానికి ఈ మహాసభలు నాంది కావాలని యువతకు సూచించారు. పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సమగ్ర యువజన విధానం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న సంగం ఏఐవైఎఫ్ అని, ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలని అన్నారు. ఈ నెల 15నుండి18 వరకు తిరుపతిలో జరిగే జాతీయ మహాసభలకు యువకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు బద్దుల శ్రీనివాస్, ఎండి నయీమ్, సహాయ కార్యదర్శి బొలగాని అశోక్, కోశాధికారి సుద్దాల సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం అక్రమ రవాణాకు 'చెక్'

### 20 రోజులుగా కొనసాగుతున్న తనిఖీలు



**ప్రజాపక్షం/నందికొండ:** ఏపీ నుంచి తెలంగాణకు ధాన్యం రాకుండా నాగార్జునసాగర్ పోలీసులు అడ్డుకుంటున్నారు. ఈ మేరకు నాగార్జునసాగర్ కొత్త బ్రిడ్జి అంతరాష్ట్రరిహద్దు వద్ద ప్రత్యేక తనకి కేంద్రాన్ని ఏర్పాటు చేసి వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఆంధ్ర నుంచి తెలంగాణలోకి ధాన్యం రాకుండా సరిహద్దు వద్ద పోలీసులు ఆంక్షలు విధించారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న బోనస్ కు ఆశపడి ఆంధ్ర నుంచి తెలంగాణలోకి ధాన్యం అక్రమ రవాణాకు దళారులు ఆసక్తి చూపిస్తూ ఉండటంతో ఇతర రాష్ట్రాల ధాన్యం తెలంగాణలోవిక్రయించేందుకు అనుమతి లేదనీ అక్రమంగా తరలిస్తే పోలీసులు కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ తెలంగాణ సరిహద్దు వద్ద తనిఖీ కేంద్రం ఏర్పాటు చేశారు. ధాన్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక రైతుల మేలు కోసం సన్నధాన్యం క్వింటాకు రూ.500ల బోనస్, మద్దతు ధర రూ.2320 ప్రకటించగా, ఇదే అదనుగా కొంతమంది దళారులు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేసి ఐకేపీ కేంద్రాలలో రైతుల పేరిట ధాన్యాన్ని పోసి మద్దతు ధర, ప్రభుత్వం ప్రకటించిన బోనస్ తెలంగాణ రైతులను కాదని ఆంధ్ర దళారులు అక్రమంగా కాజేస్తున్నారన్న ఉద్దేశంతో దీని నివారణకై ప్రభుత్వ ఆదేశాలతో తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని తెలంగాణకు రాకుండా కట్టుదిట్టం చేశారు.

## పైలట్ ప్రాజెక్టుగా ఇటిక్యాల ఎంపిక

**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. సోమవారం ఇటిక్యాల మండలం గోపాల్ దిన్నె గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలులో భాగంగా 28 జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన జిల్లా నుండి ఇటిక్యాల మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక ఏసిన నేపథ్యంలో భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలన్నారు. మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు పూర్తిగా ఉచితంగా స్వీకరించబడతాయని , రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు గ్రామంలోనే అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఇటిక్యాల తాహసీల్దార్ వీర భద్రప్ప, ఎర్రవల్లి తాహసిల్దార్ నరేష్, ఎంపీడీఓ అజార్ మొహినుద్దీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి దారుణ హత్యలో నిందితుల అరెస్ట్



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తన భార్యపట్ల భరించలేని వేధింపులకు గురిచేస్తున్నాడని ఓ యువకుణ్ణి దారుణ హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసిన ఘటన యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన హత్యా ఘటన, నిందితుల అరెస్ట్ వివరాల ప్రకారం తుర్కపల్లి మండలంలోని గోపాల్ పురం గ్రామానికి చెందిన దాసారం సాయికుమార్(25) అనే యువకుడు ఇటీవల ములుగు మండలంలో దారుణ హత్యకు గురయ్యాడు. కేసు దర్యాప్తులో భాగంగా అరెస్టైన నిందితులు తెలిపిన వివరాలలో గోపాల్ పూర్ గ్రామానికి చెందిన తలారి ఆంజనేయులు ముదిరాజ్ ఏ1 నిందుతుడు తన భార్య ను సాయికుమార్ అనే యువకుడు భరించలేని విధింపులు చేసేవాడిని,అందుకే ఎలాగైనా అతన్ని చంపాలని నిర్ణయించుకుని ములుగు మండలంలోని బైలాం పూర్ గ్రామ గువ్వ రమేష్ ఏ2, గోపాల్ పురం తలారి కొండయ్య ఏ3, తలారి వెంకటేష్‌లతో కలిసి సాయికుమార్ ను హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. కాగా మృతుడు సాయికుమార్‌ను ఇనుప పైపుతో కొట్టి, డ్రిప్ పైపు టవల్ తో అతని గొంతు కోసి చంపారని, తరువాత మృతదేహాన్ని ములుగు మండలంలోని సింగన్న గూడెం గ్రామ శివార్లకు తరలించి, వంతెన (దాసర్లపల్లి బస్వాపూర్ రోడ్డు) కింద పడేశారు. అనంతరం మృతదేహంపై డీజిల్ పోసి, సాక్ష్యాలను నాశనం చేయడానికి నిప్పంటించారు. యాదాద్రిభువనగిరి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఐపీఎస్, అక్షాంశ్ యాదవ్ ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో, యాదాద్రి డివిజన్ ఎసిపి పి.రమేష్ కుమార్, ఎం.కొండల రావు, పోలీస్ క్లినిక్, యాదగిరిగుట్ట రూరల్, మొహమ్మద్ సహాయంతో గోపాలపురం గ్రామంలో నిందితులను అరెస్టు చేశారు. తుర్కపల్లి పోలీస్ అధికారి తక్యుద్దీన్, పోలీస్ బృందంలో జె.రవి కుమార్, హెచ్సి 1881 ఆఫ్ పిఎస్ గుండాల ఎన్.ప్రదీప్ కుమార్ హెచ్సి, రవి నాయక్, నర్సింహ పిసి, ఎం.శివ కుమార్, ఎస్కె మీరా హుస్సేన్, తుర్కపల్లి అధికారులు వారు చేసిన పనిని అభినందించినట్లు తెలిపారు.

## ఘనంగా కార్ల్ మార్క్స్ జయంతి

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి :** కార్ల్ మార్క్స్ 207 జయంతి సందర్భంగా సోమవారం నాడు గద్వాలలోని సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు టిపిఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్ మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ జర్మన్ శాస్త్రవేత్త, తత్వవేత్త, ఆర్థిక వేత్త, సోషలిస్టు విప్లవకారుడు అని, ఈయన మే 5 , 1818 సంవత్సరంలో ట్రయల్ లోని చిన్న కుటుంబంలో జన్మించాడని, ఆ తర్వాత రాజకీయ తత్వశాస్త్రం చదువుకున్నాడని. యుక్త వయసులో మార్క్స్ ఏ దేశపు పౌరసత్వం లేని సమయంలో లండన్ లో జీవితం గడిపారు. అలాగే లండన్ లోని మరో జర్మన్ తత్వవేత్త అయిన ఫ్రెడరిక్ ఎంగెల్స్‌తో కలిసి అనేక పుస్తకాలు ప్రచురించాడని, అందులో కమ్యూనిస్ట్ మేనిఫెస్టో ముఖ్యమైనదని అన్నారు. ప్రపంచ లో సమాజంలో ఈయన సిద్ధాంతాలను మార్క్సిజంగా పిలుస్తారని, మార్క్సిజం ప్రధానంగా వర్గ పోరాటాల ద్వారా అభివృద్ధి చెందిందని, పెట్టుబడిదారి వ్యవస్థ లో ఇది పాలక వర్గానికి, శ్రామిక వర్గానికి మధ్య ఘర్షణగా పరిణమిస్తుందన్నాడు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, టీజీ రాజు, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ, కార్మిక నాయకుడు వెంకట్రామిరెడ్డి, మస్తాన్, హమాలీ సంఘం నాయకులు శ్యాలిమియా,దీక్షిత పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి : జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌక ర్యా ర్థం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో భాగంగా, సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 10మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్య లను పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పూ ర్తి వివరాలను సమర్పిం చాలని ఆదేశించారు. బాధితుల సమస్యలు త క్షణ పరిష్కారానికి చర్య లు తీసుకోవడం జరుగు తుందన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.



## ఇవిఎం గోదాం కేంద్రాన్ని తనిఖీ

ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి : జిల్లాలో గల ఈవీఎం గోడౌన్‌ను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. ఇవిఎంల భద్రతకు సం బంధించి ప్రతి నెలలో తనిఖీలో భాగంగా గోదామ్‌ను అద న పు కలె క్టర్ బి.ఎస్.లతతో కలిసి సందర్శించినట్లు తెలిపారు. అదనపు కలె క్టర్ బి.ఎస్.లత, కోరుట్ల ఆరిఒ జివాకర్, అర్బన్ తహసీల్దార్ రాం మోహన్, ఎలక్షన్ సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత : జిల్లా కలెక్టర్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ప్రజావాణి కార్యక్ర మంలో వచ్చే dరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరి తగతిన పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు, వినతులు అందాయి. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం గా 348 ధరఖాస్తులు స్వీకరించగా వాటిని సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వెంకటేశ్వర్లు, డిటిడిఒ పవన్ కుమార్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పర్యవే క్షకులు, సిబ్బ ంది, తదితరులున్నారు.

## త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ డి.వేణు



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి: ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించా లని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికా రులను ఆదేశిం చారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు ప్రజల అర్జీ లను స్వీకరించారు.ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తు లను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నీటి లీకేజీని అరికట్టండి


సిపిఐ నగర కార్యవర్గ సభ్యుడు తొడుపునూరి రమేశ్ కుమార్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రామ గుండం నగర పాలక సంస్థ పరిధిలోని 9వ డివిజన్ జనగామలోని మల్లేపల్లి రాజం కమాన్ వద్ద ఎస్‌సి కాలనీకి వచ్చే మంచి నీటి పైపు లైన్ గత కొద్ది రోజుల నుండి లీక్ అయి నీరు బయటకు వస్తుందని, దానిని గ్రామ నాయకులు, పెద్దలు బాగు చేయించాలని కోరుతూ, కాలనీ వాసులు సోషల్ మీడియాలో నీటి లీకేజీ వీడియోను పోస్ట్ చేసిన సం దర్భంగా సిపిఐ పక్షాన స్పందించి సోమ వారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందని సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. త్రాగునీరు ఇలా బయటకు రావడం వలన నీరు కలుషితం అవుతుందని, వచ్చేది వర్షాకాలం ప్రజలకు అనా రోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆయన పేర్కొన్నారు. కనుక మున్సిపల్ కార్పొ రేషన్ అధికారులు స్పందించి త్రాగునీటి పైపులైన్ నుంచి నీటి లీకేజీ ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్



ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్ : ప్రభుత్వం టియుఎఫ్ఐడి సి నిధులు రూ.5కోట్లలతో పెద్దపల్లిలో అన్ని వార్డుల్లో సిసి రోడ్లు, మురికి కాలు వలు, ప్రభుత్వ కార్యాలయ ల ప్రహరీ, వివిధ అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పరిశీలించారు. కమిషనర్ పలు వార్డుల్లో ప్రజల సమస్యలు పరిష్క రించినట్లు తెలిపారు. అనంతరం కమిష నర్ మా ట్లాడుతూ గుత్తేదారులు పనుల్లో వేగం పెంచాలని సిసిరోడ్లు పూర్తి అయిన తరువాత 21 రోజులు రోడ్లపై మట్టితో కట్టలు కట్టి నీరు నిల్వ ఉంచాలన్నారు. పలు వార్డులో పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తి చేస్తామని, వేసవి కాలం దృష్ట్యా పట్టణ ప్రజలు మంచినీటిని వృధా చెయ్యకుండా పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏమైనా సమ స్యలు ఉంటే మున్సిపల్ టోల్ ఫ్రీ నంబర్ 6303127484 చేస్తే సమస్యలు పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. అమృత్ 2 ద్వారా అమర్ నగర్ నుండి ఆర్డీఓ ఆఫీస్ వరకు నిర్మిస్తున్న మంచినీటి పైపు లైన్ పనులను త్వర గా పూర్తి చేయాలన్నారు.మున్సిపల్ ఏఈ సతీష్,వర్క్ ఇన్‌స్పెక్టర్లు అనిల్, వాణి వార్డు ఆఫీసర్లు శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాం ప్రాం తంలో ఇటీవల చోటు చేసుకున్న ఉగ్రదాడిపై దేశవ్యా ప్తం గా తీవ్రది గ్భ్రాంతి వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో కరీంనగర్ నగరంలోని సిక్కు కమ్యూనిటీ దేశభక్తిని చాటతూ ముందు కొచ్చింది. సిక్కు కమ్యూనిటీ తర ఫున మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి రూ.13 వేల చెక్‌ను అందజేశారు. ఈ సంద ర్భంగా ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్ సింగ్ మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులపై జరిపిన దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన దు రదృష్టకర, అమానవీయ ఘటన దేశాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసిందన్నారు. దేశ భద్రత విష యంలో భారత ప్రభుత్వం పాకిస్తాన్‌పై తగిన కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులు ఒక్క రోజు వేతనాన్ని, ప్రతి కు టుంబం తమ శక్తి మేరకు ఆర్థిక సహాయాన్ని అందించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిక్కు కమ్యూనిటీ పెద్దలు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దినసరి అనసూయ (సీతక్క)



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సంక్షేమం, అభి వృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోం దని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శా ఖ మంత్రి దాసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం మంత్రి సీతక్క ధర్మారం మండలం తెనుగువాడ ధర్మారం నుంచి ఎండపల్లి క్రాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 20 లక్షలతో నిర్మించే బిటి రోడ్డు పనులను పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ కృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం అభి వృద్ధి రెండు కండ్లు లాగా సీఎం రేవంత్‌రెడ్డి నా యకత్వంలో పాలన కొనసాగి స్తున్నామని, ప్రజ ల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇదే పంథా కొనసాగిస్తూ పాలన జరు గుతుందన్నారు. వెనుకబడిన నియోజకవర్గాలకు అత్యధికంగా నిధులు ఇవ్వాలనే లక్ష్యంతో పం చాయతీరాజ్ , మహిళా సంక్షేమ శాఖ నుం చి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. రాష్ట్రం లో చేసిన కులగలను ఆదర్శంగా తీసుకుని కేం ద్రం కులగణన ప్రకటించడం సంతోషకరమని అన్నారు. 30సంవత్సరాలు పెండింగ్‌లో ఉన్న వ ర్గీకరణ సమస్యను కూడా పరిష్కరించామన్నారు. మార్కెట్లో సన్న బియ్యం పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిం డర్, రైతులకు సన్న వడ్లకు బోనస్, 20వేలకోట్ల రుణమాఫీ పథకాలను అమలు చేస్తున్నామన్నా రు. ఏడాది కాలంలోనే 60 వేలకు పై గా నియా మక పత్రాలు పంపి ణీ చేశామన్నారు. ఈ కార్య క్రమంలోఎస్ఇపి. ఆర్.చక్రవర్తి పిఆర్ ఇఇ గిరీష్ బాబు, తహసిల్దార్ వకీల్, ఎంపిడిఒ ప్రవీణ్ కు మార్, ఏఈ పి.ఆర్.రాజశేఖర్, అను దీప్, సం బంధిత అధికారులు, ప్రతినిధులు, పాల్గొన్నారు.

## రైతులను తక్షణమే ఆదుకోవాలి

మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి: సిద్దిపేట నియోజకవర్గంలో 1800 ఎకరా ల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లిందని. .వ్యవసాయశాఖ, ఉద్యాన, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టం అంచనావేసి తక్షణ సహాయం అందించాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం దర్గాపల్లిలో ఆకాల వర్షానికి తడిసిన మామిడి తోటలను మాజీ మంత్రి హరీష్‌రావు పలిశీలించారు. గాలివాన వల్ల తీవ్ర నష్టం జరిగిందని మామిడితోట పూర్తిగా దెబ్బతిందని రైతులు ఆవేదన వ్య క్తం చేశారు. హరీష్‌రావు మాట్లాడుతూ రైతులు పంట నష్టపోయి తీవ్ర ఆం దోళనలో ఉన్నారని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతులకు వెం టనే ఇన్‌పుట్ సబ్సిడి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పండ్ల తోటలు, మామిడితోట రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. గతంలో లేని విధంగా తీవ్రమైన వర్షం కురిసిందన్నారు. తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు.

## భూసమస్యల శాశ్వత పరిష్కారానికే భూభారతి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సూచిం చారు.భూ భారతీ పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం జగి త్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేట గ్రామంలో రెవెన్యూ సదస్సుకు విప్ లక్ష్మ ణ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తో కలిసి హాజరయ్యారు. లక్ష్మ ణ్ కుమార్ రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీ లిస్తూ, సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి అప్పటికప్పుడే పరిష్కారం జరిగేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదే శించారు. పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను మండల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మ ణ్ కుమార్ కోరారు. పైలెట్ మండలంలో సదస్సులు పూర్త య్యాక, జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా అధికారులు సదస్సులు నిర్వహి స్తారని తెలిపారు. అనం తరం జిల్లా కలెక్టర్ సత్యప్ర సాద్ భూ భారతి చట్టంపై రైతులు అవగాహన కల్పిం చారు. ఈ సదస్సులో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసిల్దార్ మాజీద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సుభాష్,నాయకులు బాధినేని రాజేందర్, సత్యనారాయణ రావు, నర్సాగౌడ్, శంకర్,మద్దేల నారాయణ, గడ్డం నారాయణ, రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల దాడిని ఖండించాలి

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్: పహెల్గంలో పర్యాట కులపై పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడినీ రాజకీయాలకు, కులమ తాలకు అతీతంగా భారత ప్రజలు ఖండించడమే కాకుండ భారత దేశం చర్యలను సమర్థించేందుకు సంసిద్ధంగా ఉండడం హర్షించదగ్గ విషయమని మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇంది రాభవన్‌లో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రవాదం కన్నా ఉగ్రవాదం అతి ప్రమాదకారం, దేశానికి పొంచున్న ముప్పు ఉగ్రవా దమ న్నారు. మావోయిస్టులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి చర్చల ద్వారా శాంతి కోసం కృషి చేశార న్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి ఆదివాసీల హక్కుల పరి రక్షణ రాజ్యాంగ బద్దంగా జల జమీన్ జంగల్ హక్కుల కో సం ఆయుధాలు చేపట్టిన వారితో శాంతి చర్చలు జరపా ల ని, నక్సలైట్లతో శాంతి చర్చలు జరుపాలని మేధావులు, ప్ర జా సంఘాలు రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయన్నారు. భారత ప్రభుత్వం ఉగ్రవాదం అ ణచి వేయడం పట్ల దృష్టి సారించాలని, భారత సార్వభౌ మ త్వంపై దెబ్బ తీసే కుట్ర చేస్తున్న పాకిస్థాన్ ఉగ్రవాదుల కు ట్రను శాశ్వతంగా అణచివేసే విధంగా చర్యలు చేపట్టా న్నా రు. ప్రపంచ దేశాలు భారత్ కు అండగా నిలుస్తున్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో బండశంకర్, గాజంగి నం ద య్య, కళ్లేపల్లి దుర్గయ్య, జున్ను రాజేందర్, చందా రాధా కిషన్, ధరా రమేష్ బాబు, గాజుల రాజేందర్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ఆశించిన స్థాయిలో లేదు

* బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్లప్రతినిధి : ధాన్యం కొనుగోలు ఏ గ్రామంలో నైనా ఆశించిన స్థాయిలో జరగడం లేదని బిఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బిఆర్ఎస్ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వ హించి మాట్లాడారు. సన్న ధాన్యం పండించిన రైతులు కొనుగోలు లేక ఆందోళనలో ఉన్నారని మండిపడ్డారు. వరి ధాన్యాన్ని తూకం వేసి తీసు కున్న రైతులకు కూడా డబ్బులు చెల్లించడంలో జాప్యం జరుగుతుంద న్నారు. ప్రజాపాలనపేరుతో ప్రజలకు అడ్డగోలు దందాలు చేస్తూ రైతులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వడ్లు కొనడం లేదని, కొన్న వడ్లకు ఖాతాలో డబ్బులు వేయడం లేదు కానీ బోనస్ గురించి మాట్లాడు తున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాకా వదిలి పెట్టేది లేదన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మాజీ జెడ్పి వైస్ చైర్మన్ సిద్దం వేణు, టౌన్ ఉపాధ్యాక్షులు ఎండి. సత్తార్, తంగళ్లపల్లి మండల అధ్యక్షులు గజభీంకార్ రాజన్న, వరుస కృష్ణహరి, గుండారపు కృష్ణారెడ్డి, వెంగళ శ్రీని వాస్, కుంబాల మల్లారెడ్డి, మాట్ల మధు, మెరుగురాజు, గుండు ప్రేమ్ కుమార్, ఇమ్మనేని అమర్‌నాథ్,తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన గ్రౌండింగ్ పనులు పూర్తి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి : ప్రాథమిక ఆరో గ్య కేంద్రాలు, వెటర్నరీ ఉప కేంద్రాలు, అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మంజూరైన మౌలిక సదుపాయాల పనులకు సంబంధించి గ్రౌండింగ్ వర్క్ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులను ఆదేశిం చారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్ట రేట్ ఆడిటోరియంలో అన్ని శాఖల హెచ్‌ఓడిలు, ఎంపిడివోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేం ద్రాలు, పాఠశాలలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రహారీ, టాయిలెట్స్, కిచెన్‌షెడ్ వంటి మౌలిక అవసరాల నిర్మాణానికి పనులు మంజూరు చేశా మని, ఇంకా కొన్ని అభివృద్ధి పనులకు ఇప్పటికీ గ్రౌండింగ్ వర్క్ పూర్తి కాలేదన్నారు. సంబంధిత శాఖల హెచ్‌ఓడిలు, పాఠశాల ప్రధానోపాధ్యా యులు ప్రత్యేక చొరవతో ఎంపిడివో, ఆర్డీవోల సమన్వయంతో 31లోగా గ్రౌండింగ్ వర్క్ పూర్తి చేయాలని ఆదేశిం చారు. రాజీవ్ యువ వికాస్ యోజన దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముగిసిన వెంటనే దరఖాస్తుదారుల వివరాలు బ్యాంకులకు పంపించాలని, అర్హత ఉన్న లబ్దిదారుల వివరా లను గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూ రుకు సంబంధించి విచారణ అధికారులు పకడ్బం దీగా విచారించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ ప్ర ల్ దేశాయ్ మాట్లాడారు.పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల, మిషన్ భగీరథ అధికారులు నీటి సరఫరా వ్యవస్థపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను ఇదివరకే గుర్తించామని, ఆ భవనాల్లోకి అంగన్‌వా డీ కేంద్రాలను, ఆరోగ్య ఉప కేంద్రాలను తరలిం చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిప ల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డిఆర్‌వో వెంక టేశ్వర్లు, డిటిడిఒ పవన్ కుమార్ పాల్గొన్నారు.

## బైపాస్ నుంచి డంప్ యార్డును తరలించాలి

సిపిఐ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ నగరం లోని బైపాస్ రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డును వెం టనే అక్కడి నుంచి తరలి ంచాలని కోరుతూ సోమ వారం సిపిఐ నగరసమితి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహి ంచారు. ఈ సంధర్బంగా సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగరానికి ఆనుకున్న ఉన్న బైపాస్ రోడ్డులో డంపింగ్‌యార్డు ఉండడంతో దాదాపు పది డివిజన్ల ప్రజలు తీవ్ర ఇ బ్బందులు ఎదుర్కొంటున్నారని, డంపింగ్ యార్డు పొగతో వచ్చే కాలుష్యం వల్ల ప్రజలు ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే గంగుల కమ లాకర్ సైతం పలుమార్లు డంపింగ్‌యా ర్డును సందర్శించి పొగలు రాకుండా ప్రజలకు ఇబ్బ ందులు లేకుండా చేస్తామని మాటలు చెప్పాడే తప్ప చేతుల్లో ఏమీ లేదని ఎద్దేవా చేశారు. సిపిఐ నగర స హాయ కార్యదర్శులు పైడిపల్లిరాజు, న్యాలపట్ల రాజు లు మా ట్లాడుతూ డంపింగ్ యార్డు దగ్గరలో తీగల వంతెన, మానేరు రివర్‌ఫ్రంట్ నిర్మించారని, దీంట్లో కూడా గత మేయర్ సునీల్‌రావు పూర్తిగా అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ అవినీతిపై విచారణ జరిపించా లని డిమాండ్ చేశారు. వెంటనే ఈ సమస్యను పరిష్క రించాలని లేని పక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లమ్మ, బావండ్లపెల్లి యుగంధర్, నగర కార్యవర్గ సభ్యులు సాంబరాజు, కూన రవి, రమేష్, చంచల మురళి, మాడిశెట్టి అర వింద్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## చివరి గింజ వరకూ ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ : రైతులు పండించిన నాణ్య మైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలి పారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎలిగేడు మండలంలో విస్తృతంగా పర్యటించారు.ఎలిగేడు మండల కేంద్రం లోని గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న భూ భారతీ రెవెన్యూ సదస్సు, బుర్హాన్ మియాపేట గ్రామంలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ పరి శీలించారు. భూ సమస్యలు ఉన్నవారు తమ దరఖాస్తులను రెవెన్యూ సదస్సులలో అందించాలని, భూ భారతి చట్టం ప్రకారం ప్రతి భూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసు కుంటామని కలెక్టర్ తెలిపారు. ఎలిగేడు మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఐకెపి, ప్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ధూళికట్ట ఐకెపి, పిఎసిఎస్, బుర్హాన్ మియాపేటలోధాన్యం కొను గోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఎలి గేడు మండలం శివపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పను లను కలెక్టర్ పరిశీలించారు. ఇం దిరమ్మ ఇండ్లు త్వరగా గ్రౌండ్ చేసుకొని పనులు ప్రారంభించాలని, ఇండ్లకు ప్రభుత్వం నుండి లబ్ధిదారులకు ఒక లక్ష నిధులు విడుదల చేస్తుందని కలెక్టర్ తెలిపారు. దూళికట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికా రులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఇన్‌చార్జి ఆర్డీవో సురేష్, తహసిల్దార్ బషీరుద్దీన్, అడిషనల్ డిఆర్‌డిఓ రవికుమార్, ఎంపిడిఓ భాస్కర్‌రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటీజన్లకు అండగా ఉంటా : ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : సీనియ ర్ సిటీజన్లకు అం డగా ఉంటానని,వారి సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అం దిస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు.సోమవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసో సియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రూపొందిం చిన వయో వృద్ధుల సంరక్షణ చట్టం అవ గాహన అంశాల గోడ పోస్టర్లను,కరపత్రా లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లా డుతూ సీనియర్ సిటీజేన్స్ అసో సియేషన్ జిల్లా శాఖ సేవలను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో సీనియర్ సిటీజన్స్ కేసులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వ ర్యంలో సత్వరం పరిష్కరి స్తున్న జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌ను ,సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తదితర సంఘ ప్రతినిధు లను అభినందించారు.అనంతరం సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ సీనియర్ సిటీ జేన్స్‌కు ప్రత్యేకంగా ప్రభుత్వశాఖ ఏర్పాటు చేయించాల న్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్య దర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,జిల్లా ప్రధాన కార్య దర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షుడు పి.హన్మంత రెడ్డి, నా యకులు దిండిగాల విఠల్,వెల్మూల ప్రభాకర్‌రావు, ఎం.డి.యా కూబ్,మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ, మాజీ కౌన్సిలర్లు పంబాల రాంకుమార్ క్యాదాసు నవీన్, కూసరి అనిల్ కుమార్, బద్దం జగన్ తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక రంగంలో భారత్‌దే అగ్రస్థానం

డాక్టర్ భీమనాత్ని శంకర్




ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : ప్రాచీన కాలం నుండి శాస్త్ర, సాంకేతిక, వైద్య, విజ్ఞాన రంగంలో భారత్ దేశమే అగ్రగామిగా ఉండేదని ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సంఘచాలక్ డాక్టర్ భీమనాత్ని శంకర్ అన్నారు. జగిత్యాల వాల్మీకి ఆవాసం సే వాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కం ప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభిం చారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శం కర్ మాట్లాడుతూ భారత దేశంలో మేధోసంపదకు కొదవ లేదని అయితే మేదో సంపత్తిని వెలికి తీసే నాయకత్వం అవసరమని తెలిపారు. ఆర్యభట్ట, భాస్కరాచార్య, వరాహమిహిర, శుశ్రుతుడు, కణా ధుడు లాంటి ప్రాచీన శాస్త్రవేత్తలు ప్రపంచానికి అ వసరమైన ఎన్నో ఆవిష్కరణలు అందజేశారని తెలి పారు. ఆధునిక కాలంలో కూడా జగదీష్ చంద్ర బోస్, అబ్దుల్ కలాం, నంబి నారాయణన్ లాంటి వారు మన వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక రంగాలను బలోపేతం చేశారని తెలిపారు. రోజురోజుకు శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు కంప్యూటర్ విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త కోటగిరి అరవింద్ హాజరు కాగా వాల్మీకి ఆవాసం అధ్యక్షులు జడిగే పురు షోత్తం, కార్యదర్శి నందెల్లి మదన్ మోహన్ రావు, కమిటీ సభ్యులు సంపూర్ణ చారి,కంప్యూటర్ శిక్షణ ఇన్చార్జ్ బెక్కం మల్లేశం బొమ్మెర సత్యనారా యణ,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక రవాణాను నిలిపివేయాలని రైతులు ఆందోళన

**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం కల్దుర్కి గ్రామ ప్రధాన రహదారిపై నుంచి సిద్దాపూర్, ఖండవ్, కల్దుర్కి గ్రామంలో గత అనేక రోజుల నుంచి మంజీరా నుంచి ఇసుక రవాణా చేయడంతో రైతులకు ఇబ్బంబి తలెత్తుందని పంట పొలాలకు వెళ్లాంటే దారి లేకుండా పోయిందని ఆందోళన చేపట్టారు. కల్దుర్కి, సిద్దాపూర్ ఖండ్గావ్ నుంచి ఇసుక రవాణాను నిలిపి వేయాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం పంట పొలాల్లో పుటం వేస్తున్నామని పుటం పొడయ్యే పరిస్థితి నెలకొందని, కళ్లలో దుమ్ము పడుతుందని ఇసుక వాహనాలు అత్యధిక సంఖ్యలో తిరగడం వల్ల ప్రజలకు కంటికి కునుకు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రవాణా వల్ల తరుచూ ప్రమాదాలు జర ఉగుతున్నాయని ఇప్పటికైన సమస్యను పట్టించుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు వచ్చి రైతులకు గ్రామస్తులకు సముదాయించారు. సమస్యను పరిష్కరించకుంటే భవిష్యత్‌లో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## ఈ కార్యాలయం ఏ జిల్లాలో ఉందో?

### అర్థం కాని విద్యుత్ శాఖ ఎఈ తీరు..

**ప్రజాపక్షం/ముధోల్:** మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం సబ్ స్టేషన్ ముందర ఏర్పాటు చేసిన బోర్డులో కార్యాలయం ఏ మండలంలో ఉందో రాశారు. ఐతే అదే కార్యాలయం బోర్డులో జిల్లా పేరు ఉన్న చోట ఖాళీగా వదిలి పెట్టి నీలం రంగులో ఉన్న బోర్డులో జిల్లా పేరు వద్ద ఏమి రాయక తెల్లటి పెయింట్ వేశారు. ఈ తెల్లటి పెయింట్ వేసిన చోట గతంలో అదిలాబాద్ జిల్లా పేరు ఉండే. ఐతే జిల్లాల విభజన జరిగి 9 నుండి 10 సంవత్సరాలైనా నిర్లక్ష్యంతో బోర్డులో పాతజిల్లా పేరు రాయకుండా అలానే వదిలేశారు.

కార్యాలయ బోర్డులో సరి చేయాలని ఎన్నోసార్లు పత్రికల్లో ప్రచురించిన స్పందించకపోవడం సిబ్బంది అహంకార ధోరణా మరి నిర్లక్ష్యమా. దీంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కార్యాలయంలో ముఖ్యాధికారైన ఏఈ తీరే అర్థమవ్వడం లేదని పలువురు ఆలోచనలో పడ్డారు. ఇప్పుడైనా స్పందించి వారు చేసే కార్యాలయం బోర్డుకు స్పష్టంగా ఉండి ప్రజలకు తెలిసేలా విధులు నిర్వర్తించాలి.

## ప్రజావాణికి 117 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 117 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లతో పాటు జడ్పీ సీఈఓ సాయగౌడ్, నిజామాబాద్ ఇన్‌చార్జి ఆర్డీఓ స్రవంతిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ :ఎస్పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జూన్ 14న జరగబోవు జాతీయ లోక్ అదాలత్ దృష్టిలో ఉంచుకుని సోమవారం జిల్లా ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ జిల్లాలోని పోలీస్ అధికారులతో,కోర్టు పోలీస్ అధికారులతో ఆన్లైన్ లోదిశా నిర్దేశాలు చేసారు.వివాదాలు,రాజీపడే క్రిమినల్ కేసులు,పెండింగ్‌లో ఉన్నటూ వీలర్,ఫోర్ వీలర్ చలాన్ కేసులు,పెట్టి కేసుల మొదలైన వాటికి సంభందించిన కేసులను సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.కక్షిదారులందరికి సమాచారం అందించి ఈ సదవకాశాన్నిర వినియోగించుకోవాలని తెలిపారు.ఈ లోక్ అదాలత్ లో కేసు పరిష్కారం ద్వారా వారి యొక్క సమయం,డబ్బును ఆదా చేసుకోగలరనీ తెలపాలన్నారు.ఈ లోక్ అదాలత్ లో పరిష్కారానికి అవకాశం ఉన్న కేసుల వివరాలు తయారు చేసుకుని తగిన వారందరికీ సమాచారం అందేలా చూడాలని తెలియజేశారు.ఈ అమూల్యమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేల వారికి కేసుల గురించి వివరించాలని తెలిపారు.

## రైతు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** కేంద్ర ప్రభుత్వం జారీ చేయనున్న రైతు గుర్తింపు కార్డు కోసం మండలంలోని రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్దిరామేశ్వర్ సోమవారం కోరారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం కిసాన్ ఫసల్ భీమా యోజన కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం ఈ గుర్తింపు కార్డు తప్పనిసరి అని తెలిపారు.రైతులు తమ పట్టాదారు పాసుబుక్ నెంబర్, ఆధార్ కార్డును, ఫోన్ నంబర్‌కు లింక్ చేసుకోవాలన్నారు. అయితే ఫోన్ నంబర్ తమ ఆధార్ కి లింక్ అయి ఉండాలన్నారు. రైతులు స్థానిక ఏఈఓల వద్ద గాని లేదా మీ సేవ కేంద్రాలలో గాని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఒకవేళ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే పీఎం కిసాన్ నిధి డబ్బులు పడవు అని తెలిపారు. జూన్ 6వ తేది వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

## తాడ్కోల్‌లో చిన్నారులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/బాన్సువాడ :** బాన్సువాడ మండలంల తాడ్కోల్ గ్రామంలో సోమవారం పోతుల బొగుడ రామురెడ్డి ఆద్వర్యంలో చిన్నారులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజ గాయత్రి చిన్నారులకు పదకొండు రోజుల పాటు భగవద్గీత యొక్క ప్రాముఖ్యత వివరించడంతోపాటు, భరతనాట్యాన్ని నేర్పించి భారతీయ సంస్కృతి సంప్రదాయాలను చిన్ననాటి నుండే అలవరుచుకోవాలని చిన్నారులకు సూచించారు. కార్యక్రమంలో సవిత, జిల్లా కో ఆర్డినేటర్ బొప్పిడి భూమ్‌రెడ్డి, పాల్గొన్నారు.

## 18సంవత్సరాల లోపు మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు తప్పవు

**ప్రజాపక్షం/బోధన్:** 18సంవత్సరాల లోపు మైనర్లకు వాహనాలను ఇచ్చినట్లయితే వాహన యజమానులపై మైనర్ల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయబడతాయని బోధన్ పట్టణ సీఐ వెంకట్ నారాయణ తెలిపారు. పట్టణంలోని సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా వాహనాలు నడుపుతూ ఐదుగురు మైనర్లను పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. వీరిని బోధన్ రెండవ అదనపు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా వారి తల్లిదండ్రులకు జరిమానా విధించినట్లు తెలిపారు. 18సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు ఇచ్చినట్లయితే వాహన యజమానులపై తల్లిదండ్రులపై చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మోర్తాడ్ ఎఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు ఈ నెల 6వ తేదిన ఉదయం 9గంటలకు మోర్తాడ్ రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని ఎఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. కావున రైతులు ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ తీసుకొని రావాలని, రిజిస్ట్రేషన్ చేయిచుకుంటేనే పీఎం కిసాన్ డబ్బులు వస్తాయని మోర్తాడ్ ఎఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

# భూభారతి చట్టంపై రైతులకు అవగాహన

### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/కుంటాల:** భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టన భూభారతి చట్టాన్ని అమలు చేస్తూ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కుంటాల మండలంలోని ఓల గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖీ చర్చించి వారి సమస్యలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించడం, వారి సందేహాల నివృత్తి చేయడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూమిపై పూర్తి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు, విస్తీర్ణంలో పాలు, వారసత్వ భూములు, భూ స్వభావం, నిషేధిత జాబితాలోని భూములు, సర్వే నంబర్ల లోపాలు, పట్టా పాస్ బుక్కుల లేని భూములు, సాదాబైనామాలు, హద్దుల సమస్యల, పార్ట్‌బి భూములు, భూసేకరణ కేసులపై దరఖాస్తుల స్వీకరించి, భూభారతి నూతన ఆర్‌ఓఆర్ ప్రకారం విచారణ జరిపి పరిష్కరిస్తామని వివరించారు. వివిధ కారణాల వలన రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు సమర్పించలేని వారు తర్వాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో అప్లై చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రింట్ చేసిన ప్రొఫార్మాల ఆధారంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, క్షేత్ర స్థాయి విచారణకు వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని సూచించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్కుల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశించారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసీల్దార్ కమల్ సింగ్, తహసీల్దార్ ప్రత్యేక అధికారులు ఏజాజ్ అహ్మద్, ప్రవీణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు విద్యావంతులు అయితేనే సమాంజలో మార్పు

### మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాఫక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** బాలికల విద్యావంతులు అయితేనే సమాంజలో మార్పు వస్తుందని , వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ టెక్నాలజీ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సిఎస్ఆర్ నిధుల నుంచి తోషిభా కంపెనీ ద్వారా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల జోగిపేట, అందోల్ కు నూతన బస్సును జిల్లా కలెక్టర్ వల్లూరు తో జెండా ఊపి మంత్రి పారంభించారు. బస్సులో విద్యార్థులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు కలసి ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే, సమాజం ఉన్నతంగా తీర్చిద్దిలంటే సమాజంలో ఉన్న అనేక రుగ్మతులను రూపుమాపాలంటే బాలికలు అత్యంత విద్యావంతులై ఉండాలన్నారు. నూతన బస్సును నూతన బస్సును ప్రారంభించినందుకు విద్యార్థులు దామోదర్ రాజనర్సింహకు ప్రత్యేక అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదపనపు కలెక్టర్ చంద్రశేఖర్, తోషిభా కంపెని ప్రతినిధులు సంబందిత జిల్లా అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## నటరాజ కళాక్షేత్రం విద్యార్థులను సన్మానించిన కలెక్టర్



**ప్రజాపక్షం/జన్నారం:** మలేషియాలో ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్యాన్స్ ప్రోగ్రామ్‌కు జన్నారం నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు ఏప్రిల్ 27 నాడు మలేషియాలో ప్రదర్శన ఇవ్వడం జరిగిందని జన్నారం నుంచి ఇంటర్నేషనల్ స్థాయిలో నృత్య ప్రదర్శన చేసిన నటరాజ కళక్షేత్రం విద్యార్థులను సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అభినందిస్తూ శాలువాతో సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు పెద్ద పెల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ, నటరాజ కళాక్షేత్రం నిర్వాహకులు డాన్స్ మాస్టర్ నర్మదా గౌడ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. భూభారతి పైలట్ ప్రాజెక్టు రెవెన్యూ సదస్సులలో భాగంగా సోమవారం మెండోరా మండలం చాకిర్యాల్, కొడిచెర్ల గ్రామాలలో నిర్వహించిన సదస్సులలో కలెక్టర్ పాల్గొని రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి రైతలకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే అన్ని మండలాల్లో నూతన చట్టంపై అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాన్ని పైలట్ ప్రాతిపదికన ఎంపిక చేసి గ్రామాల వారిగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు విస్తీర్ణం హెచ్చు తగ్గులు వారసత్వ భూములు, భూస్వభావం తప్పులు, నిషేధిత జాబితాలోని భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్‌బుక్‌లు లేకపోవటం, ప్రభుత్వ భూములను నవీకరించడం సాదాబైనమా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బి లో చేర్చిన భూముల సమస్యలు భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నిర్దేశిత గడువులోపు పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు. భూ సంబంధిత సమస్యలున్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారమందించాలని హెల్ప్‌డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. ఈ సదస్సులలో ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు

### అకాల వర్షంతో నష్టపోయిన రైతన్నలను ఆదుకుంటాం

### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** అకాల వర్షంతో నష్టపోయిన రైతన్నలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని,తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తదని సోమవారం మెదక్ ఎమ్మెల్యే డా॥ మైనంపల్లి రోహిత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకాల వర్షం, ఈదురు గాలులతో పంట నష్టపోయిన రైతులను పంట నష్టపరిహారంతో పాటు అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు. తడిసిన ప్రతి ధాన్యపు గింజను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఏ ఒక్క రైతు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని, రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తినా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలియజేశారు. అంతే కాకుండా ప్రభుత్వం నుండి రైతులకు రావాల్సిన నష్టపరిహారం ఇప్పించడంలో ప్రభుత్వంతో మాట్లాడి నష్టపరిహారం అందాల్సిన ప్రతి యొక్క రైతుకు ఇప్పించేందుకు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## యువ వికాసం.. ఎవరికో అవకాశం...

### జూన్ 2వ తేదీ వరకు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులు



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించడం కోసం రాజీవ్ యువవికాసం పథకాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించడం కోసం రేవంత్ సర్కార్ తీసుకువచ్చిన ఈ పథకంలో దరఖాస్తుదారులు అందరు తమకు లబ్ది జరుగుతుందని భావిస్తున్నారు. రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తు చేసుకున్న వారికి 50 వేల నుంచి నాలుగు లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణాలను బ్యాంకులు మంజూరు చేయవలసి ఉంది. జూన్ రెండవ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినత్సోవం సందర్భంగా లబ్దిదారులకు రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సంవత్సరం సుమారు ఐదు లక్షల మందికి ఈ పథకం ద్వారా లబ్దిచేకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రాజీవ్ యువవికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి లోన్ రావాలంటే వారి సిబిల్ స్కోర్ కీలకంగా మారింది. సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నవారు, బ్యాంకు రుణాలు తీసుకుని చెల్లించని వారు, పర్సనల్ లోన్స్, వ్యవసాయ, గృహ, వాహన రుణాలను తీసుకుని చెల్లించని వారి దరఖాస్తులను బ్యాంకర్లు తిరస్కరించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

## త్వరిత పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణి

### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల విజ్ఞప్తులు ఆమె స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల అంశాలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని, శాఖల వారీగా పెండింగ్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా సిద్ధం చేయాలని రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన తక్షనమే పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన మరమ్మత్తులు చేపట్టి సమయానికి పూర్తిచేయాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన టెలిఫోన్ ప్రజావాణిలో 9100577132 నంబరుకు కాల్ చేసి ప్రజలు తమ సమస్యలు తెలియజేయాలని, వాట్సప్ ద్వారా దరఖాస్తులు పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి రైతుకూ యూనిక్ కోడ్ కేటాయింపు: కేంద్రం నిర్ణయం

### దీని ఆధారంగానే కిసాన్ లబ్దిదారుల ఎంపిక

**ప్రజాపక్షం/నందిపేట్:** భారతదేశంలోని ప్రతిపౌరునికి ఆధార్ గుర్తింపు కార్డు ఇచ్చినట్టుగానే ప్రతి రైతుకు 11 నెంబర్లతో విశిష్ట సంఖ్య (యూనికోడ్)ని కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టు చేపట్టడం జరుగుతుంది. భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ నిర్మించబడుతుంది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయడం జరుగుతుంది. పిఎం కిసాన్ లబ్దిదారులకు తదుపరి విడత లబ్ది పొందుటకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. రైతు వేదికలో ఫార్మర్ రైతువారిగా రిజిస్ట్రేషన్ చేయబడును. కావున రైతులందరు సద్వినియోగం చేసుకోగలరు.


## భూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలి



### కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాఫక్షం/ సంగారెడ్డి ప్రతినిధి/ కొండాపూర్:** కొండాపూర్ మండలాన్ని భూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని, భూ సమస్యల దరఖాస్తులు అనంతరం అధికారుల క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. అదే విధంగా భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని టీజీఐఐ చైర్మేన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. భూ భారత రెవెన్యూ సదస్సును జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో కలెక్టర్ క్రాంతి వల్లూరు టీజిఐఐ చైర్మేన్ నిర్మలా జగ్గారెడ్డిలు ప్రారంభించారు. భూ సమస్యల శాత్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగర్‌పల్లి ,అలియాబాద్ గ్రామాల్లో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ క్రాంతి వల్లూరు ,టీజీఐఐ చైర్మేన్ నిర్మలా జగ్గారెడ్డిలో పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి జనవరి 4వ తారీఖున ప్రకటించబడి ఏప్రిల్ 14న అమల్లోకి వచ్చింది అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి పైలెట్ పాజెక్టు కింద ప్రతి జిల్లాలో లో కొ మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎన్నిక చేయడం జరిగింది. అందులో భాగంగా మన సంగారెడ్డి జిల్లాలో కొండాపూర్ మండలన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నిక చేయడం జరిగింది. అందులో భాగంగా మన సంగారెడ్డి జిల్లాలో కొండాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా నిర్ణయించడం జరిగిందన్నారు. భూ సమస్యల కోసం ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు , సర్వే బృందాలు క్షేత్ర స్థాయిలో వెళ్లి సమస్యను పరిస్కరిస్తామన్నారు. ఏలాంటి భూ సమస్య లైనా సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ సదస్సులో సంగారెడ్డి, ఆర్‌డిఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ అశోక్ రైతులు రైతు సంఘం నాయకులు ప్రజలు ప్రజా ప్రతినిధులు రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్ యువవికాస్ అభ్యర్థుల ఇంటర్వ్యూలు



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్:** తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కాగజ్‌నగర్ ఎంపిడిఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు మండలంలోని అందవెల్లి, అంకుసాపూర్, బారెగూడ గ్రామ పంచాయతీలకు చెందిన దరఖాస్తులు హాజరైనట్లు ఎంపిడిఒ కోట ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస్ పథకం కిందం మండల వ్యాప్తంగా 2478 దరఖాస్తులు రావడం జరిగిందని, గ్రామాల వారిగా ఇంటర్వ్యూలు నిర్వహించిన ఇంటర్వ్యూలు పూర్తయిన తర్వాత అభ్యర్థుల ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోమనోహర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువతరంగం

## ఫోకస్

# ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు అవసరం



వృద్ధాప్యం వచ్చిందంటే వివిధ రకాల ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టినట్టే. వీటి నుంచి బయటపడడమేగాక, అవి దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి వీలుగా ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉంది. వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు అనేవి సాధారణం. వయస్సు పెరిగే కొద్దీ శరీర అవయవాల పనితీరు నెమ్మదిగా తగ్గుతుంది. ఇది అనేక రకాల శారీరక,ఉ మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యమైన వృద్ధుల ఆరోగ్య సమస్యలు..

**1. డయాబెటిస్ (మధుమేహం):** వృద్ధుల్లో ఈ వ్యాధి చాలా సాధారణం. రక్తంలో చక్కెర స్థాయి అదుపులో లేకపోవడం వల్ల ఏర్పడుతుంది. నియంత్రణకు మంచి ఆహారం, వ్యాయామం, మందులు అవసరం.

**2. హై బీపీ (అధిక రక్తపోటు):** ఈ సమస్య సాధారణంగా గుండె, కిడ్నీలపై ప్రభావం చూపుతుంది. శాంతంగా ఉండటం, తక్కువ ఉప్పు తీసుకోవడం అవసరం.

**3. ఆర్థరైటిస్ (ముళ్ల నొప్పులు):** జాయింట్లలో నొప్పులు, వాపు వంటి సమస్యలు తలెత్తుతాయి. వృద్ధుల్లో నడక, కదలికలపై ప్రభావం చూపుతుంది. తగిన మందులు, తేలికపాటి వ్యాయామం సహాయపడతాయి.

**4. ఆస్తమా / ఊపిరితిత్తుల సమస్యలు:** కాలుష్యంతో కూడిన వాతావరణం, పొగధూళి వంటివి ఊపిరితిత్తుల సమస్యలకు ప్రధాన కారణాలు. ఇన్‌హెలర్లు, శ్వాసకోశ వ్యాయామాలు అవసరం.

**5. హృద్రోగాలు:** వృద్ధుల్లో హృదయ సంబంధిత రుగ్మతలు ఎక్కువగా కనిపిస్తాయి. కొలెస్ట్రాల్ నియంత్రణ, ఆహార నియమాలు పాటించాలి.

**6. డిమెన్షియా, అల్జెమర్స్ (మెదడు సంబంధిత వ్యాధులు):** జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, మానసిక గందరగోళం ఏర్పడడం తదితర సమస్యలు తలెత్తుతాయి. దైనందిన పనులు చేసేందుకు సహాయం అవసరమవుతుంది.

**7. వినికిడి, చూపు లోపాలు:** వయస్సుతో పాటు వినికిడి శక్తి, చూపు తగ్గిపోతాయి. కంటి పరీక్షలు, హియరింగ్ ఎయిడ్‌లు ఉపయోగపడతాయి.

**8. నిద్రలేమి:** వృద్ధుల్లో నిద్ర తగ్గడం వల్ల అలసట, మానసిక ఒత్తిడి పెరుగుతుంది. తేలికపాటి వ్యాయామం, రాత్రి కాఫీ లేకుండా ఉండటం కొంత ఉపశమనాన్నిస్తాయి.

**9. మానసిక ఒత్తిడి, ఒంటరితనం:** కుటుంబానికి దూరమవడం, అనాదరణ వల్ల మానసిక రుగ్మతలు తలెత్తుతాయి. కుటుంబ సభ్యుల మద్దతు, స్నేహితులతో సమయం గడపడం అవసరం.

**10. సెల్ ఇమ్యూనిటీ క్షీణత (వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడం):** చిన్న జ్వరం, ఇన్ఫెక్షన్‌లు కూడా తీవ్రమవుతాయి కాబట్టి, వివిధ రకాల వ్యాక్సిన్లు తప్పక వేయించుకోవాలి.

## యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## కైలాష్ సత్యార్థి



కైలాష్ సత్యార్థి భారతదేశానికి చెందిన ప్రముఖ బాలహక్కుల కార్యకర్త. బాల కార్మికత్వం, బాల దాస్య వ్యతిరేకంగా సాగించిన పోరాటం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆయన 2014లో నోబెల్ శాంతి బహుమతిను పాకిస్థాన్‌కు చెందిన మలాలా యూసుఫ్‌జాయితో కలిసి అందుకున్నారు. కైలాష్ సత్యార్థి పుట్టిన తేది: 11 జనవరి 1954. పుట్టిన స్థలం: విద్యా నగర్, మధ్యప్రదేశ్, విద్యార్హత: ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్. తొలుత ఇంజినీర్‌గా ఉద్యోగం ప్రారంభించారు. అయితే బాలల హక్కుల కోసం పని చేయాలనే తపనతో ఉద్యోగం వదిలి సామాజిక ఉద్యమంలోకి ప్రవేశించారు. ఆయన ప్రారంభించిన ముఖ్యమైన ఉద్యమాలు బచ్పన్ బచావో ఆందోళన్, ఇది 1980లో ఆయన స్థాపించిన ఉద్యమం. దీని ద్వారా వేలాది మంది పిల్లలను బంధకత్వం, బలవంతపు కార్మికత్వం నుంచి విముక్తి కలిగించారు. గ్లోబల్ మార్చ్ అగెయినెస్ట్ చైల్డ్ లేబర్: ఇది అంతర్జాతీయ స్థాయిలో బాల కార్మికత్వాన్ని వ్యతిరేకించే ఉద్యమం. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఆయన ఈ ఉద్యమాన్ని నడిపారు. 100 మిలియన్ ఫర్ 100 మిలియన్ క్యాంపెయిన్: ఇది ప్రపంచంలోని 100 మిలియన్ బాలలు బాధ పడకుండా, మరో 100 మిలియన్ యువత వారికి మద్దతుగా నిలబడాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఉద్యమం. ఆయనకు 2014 నోబెల్ శాంతి బహుమతి, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ అవార్డు, డిఫెండర్ ఆఫ్ డెమోక్రసీ అవార్డు, హార్వార్డ్ యూనివర్సిటీ – హ్యూమనిటేరియన్ అవార్డు లభించాయి. ఆయన జీవితం యువతకు మార్గదర్శకం.



ఆందోళన కలిగిస్తున్న ...

# విద్యార్థి వీసాల తగ్గుదల

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు అనేక రంగాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రత్యేకించి విద్యార్థి వీసాల జారీని తగ్గించడం భారత్ వంటి దేశాలకు ఆందోళన కలిగిస్తున్న అంశం. 2024 ఫిబ్రరితో పోలిస్తే, ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా జారీ చేసిన ఎఫ్1 విద్యార్థి వీసాలలో 30% తగ్గుదల (590 నుండి 411 వీసాలు) నమోదైంది. ప్రపంచ సగటు 4.75 శాతం తగ్గుదల కంటే ఎక్కువ. చైనా (5.2 శాతం), జపాన్ (9.6 శాతం), వియత్నాం (7.4 శాతం) వంటి ఇతర దేశాల తగ్గుదల కంటే మన దేశం విద్యార్థులకు జారీ చేసిన వీసాల తగ్గుదల శాతం చాలా ఎక్కువ. తూర్పు ఆసియా రాజధానులలో కేవలం 2–15 రోజులతో పోలిస్తే, భారతీయ విద్యార్థులకు వీసా కోసం వేచి ఉండే సమయం కూడా గణనీయంగా ఎక్కువ. ఉదాహరణకు ఢిల్లీలో సగటున 58 రోజులు. వీసా రద్దులలో పెరుగుదల నమోదుకావడం మరో సమస్య. అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ (ఎఐఎల్‌ఎ) నిర్వహించిన సర్వే ప్రకారం, 2025 ప్రారంభంలో అమెరికా వీసాలు రద్దు చేసిన అంతర్జాతీయ విద్యార్థులలో 50 శాతం మంది భారతీయులే. ఈ ఉపసంహరణలు ఎక్కువగా అమెరికన్ స్టేట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కృత్రిమ మేధ (ఎఐ) ఆధారిత 'క్యాచ్ అండ్ రివోక్' కార్యక్రమం ద్వారా జరిగాయి. ఇది సోషల్ మీడియా, పోలీసు డేటాబేస్‌లను పర్యవేక్షిస్తుంది. ఇది న్యాయంగా, పారదర్శకత, దౌత్యపరమైన పరిణామాలపై ఆందోళనలను లేవనెత్తుతున్నది. చట్టపరమైన, ఆర్థిక ఇబ్బందులు సైతం పెరుగుతున్నాయి. వీసా రద్దును ఎదుర్కొంటున్న విద్యార్థులు తమ స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎస్ఇవిఐఎస్) స్థితిని పునరుద్ధరించడానికి సంక్లిష్టమైన చట్టపరమైన విధానాల ద్వారా వెళ్ళాలి. చాలామంది విద్యార్థులు వివిధ కోర్టుల్లో వ్యాజ్యాలు దాఖలు చేశారు, కానీ ఖర్చులు చాలా ఎక్కువగా ఉండడంతో, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అయితే, విచారణ, ఉత్తర్వుల జారీ వంటి అంశాల్లో విపరీతమైన జాప్యం జరగడం వల్ల విద్యార్థులు విద్యా నిబంధనలు, ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లను కోల్పోయేలా ప్రమాదం ఉంది. భారతదేశంలోని ఐదు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్ నుండి వచ్చే దరఖాస్తుదారులకు ఆస్ట్రేలియా వీసా పరిశీలనను పెంచిందని నివేదికలు సూచిస్తున్నాయి. దీని వలన ఈ ప్రాంతాల నుండి భారతీయ దరఖాస్తుదారులపై ప్రొఫైలింగ్, అన్యాయమైన జనరలైజేషన్ భయాలను ఎదుర్కొంటున్నారు. భారతీయ విద్యార్థి వీసాల తగ్గుదల పలు సమస్యలకు కారణమవుతుంది. చైనాతో పాటు భారతదేశం కూడా అంతర్జాతీయ విద్యార్థుల రెండు అతి పెద్ద వనరులలో ఒకటి. కానీ అమెరికా స్టూడెంట్ వీసాల క్షీణత, ఆస్ట్రేలియాలో కఠినమైన నిబంధనల కారణంగా భారత్‌కు ఎదురుదెబ్బలు తప్పడం లేదు. ఈ అంతరాయాలు భారత సాఫ్ట్ పవర్‌ను. కృత్రిమ మేధ (ఎఐ), క్లైమేట్ సైన్స్, బయోటెక్నాలజీ వంటి కీలక రంగాలలో ప్రాధాన్యతను కోల్పోయేలా చేస్తాయి. ఫలితంగా భారతదేశ జనాభా లాభదాయకతకు ప్రమాదం తప్పకపోవచ్చు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు ఉన్నందున, నైపుణ్యాభివృద్ధికి ప్రపంచ విద్యను పొందడం చాలా ముఖ్యం. వీసా ఆంక్షలు, రద్దులు అవకాశాలకు ఆటంకం కలిగిస్తాయి, దీర్ఘకాలిక ఉత్పాదకత, ఆవిష్కరణలను ప్రభావితం చేస్తాయి. 2024లో, భారతదేశానికి రికార్డు స్థాయిలో 129.1 బిలియన్ల డాలర్ల మేర చెల్లింపులు వచ్చాయి, దీనికి కారణం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలోని భారతీయ విద్యార్థులు పంపిన డబ్బు. ఇలాంటి




చెల్లింపులకు సమస్యలు తప్పవు. కఠినమైన వీసా నిబంధనలు విద్యార్థుల వలసలు, చెల్లింపులను తగ్గించవచ్చు, ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వీసా రద్దుల మాదిరిగా కాకుండా, ఎస్ఇవిఐఎస్ తొలగింపులు సదరు వ్యక్తి అమెరికాలోకి తిరిగి ప్రవేశించడాన్ని నిరోధిస్తాయి. కానీ విద్యార్థి యొక్క చట్టపరమైన స్థితిని స్వయంచాలకంగా రద్దు కావు. ఎస్ఇవిఐఎస్ తొలగింపుల వల్ల ఉద్యోగ అర్హత కోల్పోవడం, జీవిత భాగస్వాములు, పిల్లలు లేదా సదరు వ్యక్తిపై ఆధారపడిన ఇతరులను కూడా తీవ్రమైన ఇబ్బందులకు గురిచేసే ప్రమాదం లేకపోలేదు. రుణాలు లేదా పొదుపులపై ఆధారపడే మధ్యతరగతి ఆశావహులు ఎక్కువగా ఈ పరిణామం వల్ల కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆర్థికంగా, మానసికంగా చితికిపోవడం ఖాయం. ఈ సమస్య సాంప్రదాయ గమ్యస్థానాల (యుఎస్, ఆస్ట్రేలియా) నుండి నార్డిక్ దేశాలు, దక్షిణ కొరియా వంటి అభివృద్ధి చెందుతున్న కేంద్రాల వైపు మళ్లడం, భారతదేశ ప్రపంచ ప్రతిభ ప్రవాహ పథాన్ని మారుస్తుంది. ఈ రీరూటింగ్ నెట్‌వర్క్ నిర్మాణం, దయాస్పోరా ప్రభావం, వ్యూహాత్మక పరిశ్రమ నియామకాలను, ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం, ఆరోగ్య సంరక్షణ, పరిశోధన తదితర రంగాల్లో ప్రభావితం చేస్తుంది. అంతర్జాతీయ అవకాశాలు తగ్గిపోతున్నందున, భారతదేశంలో నాణ్యమైన సంస్థల డిమాండ్ బాగా పెరుగుతుందని భావిస్తున్నారు. ఇది ఇప్పటికే పరిమితమైన టైర్1 విశ్వవిద్యాలయాలను (ఐఐటిలు, ఐఐఎంలు, ఎఐఐఎంలు) ఒత్తిడికి గురిచేయవచ్చు. జాతీయ విద్యా విధానం, 2020 ప్రకారం యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) సామర్థ్య నిర్మాణం, అక్రిడిటేషన్ సంస్కరణలను వేగవంతం చేయడానికి ఒత్తిడి చేయవచ్చు. వియన్నా కన్వెన్షన్ ఆన్ కాన్సులర్ రిలేషన్స్ (1963) విదేశాల్లోని భారతీయ పౌరుల ప్రయోజనాలను కాపాడటానికి భారత మిషన్లకు అధికారం ఇస్తుంది. వీసా సమస్యలను ఎదుర్కొంటున్న విద్యార్థులకు సహాయం చేయడానికి ఈ చట్టపరమైన నిబంధనను మరింత చురుకుగా ఉపయోగించాలి. 1983 నాటి వలస చట్టం కిందకు విద్యార్థి వీసా కన్సల్టెన్సీలను తీసుకురావడం ద్వారా, తప్పుడు వాగ్దానాలు లేదా నకిలీ పత్రాలకు రిజిస్ట్రేషన్, జవాబుదారీతనం, జరిమానాలను అమలు చేయడాన్ని బలోపేతం చేయడం.

**అత్యవసర విద్యార్థి భద్రతా వలయం :** వీసా రద్దు, ట్యూషన్ నష్టం లేదా బలవంతంగా బహిష్కరణ ఎదుర్కొంటున్న విద్యార్థులకు సహాయం చేయడానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విదేశీ విద్య రక్షణ నిధి (ఒఇపిఎఫ్) ఏర్పాటు చేయాలి. 202223 కేంద్ర బడ్జెట్ ప్రకారం, గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ (జిఐఎఫ్‌టి) నగరంలో ప్రపంచ స్థాయి సంస్థలు పనిచేయడానికి వీలు కల్పించే అగ్రశ్రేణి విదేశీ విశ్వవిద్యాలయాలు క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి లేదా జాయింట్‌డిగ్రీ కార్యక్రమాలను అందించడానికి భారతదేశం ప్రోత్సహించాలి. అదే సమయంలో, ఎన్ఇపి 2020 కింద భారతీయ విశ్వవిద్యాలయాలు, ప్రపంచ స్థాయి విద్యా పర్యావరణ వ్యవస్థను సృష్టించడానికి ద్యూయల్‌డిగ్రీ కార్యక్రమాలు, అంతర్జాతీయ అధ్యాపక మార్పిడి వంటి సంస్కరణలను అవలంబించాలి. బహుళ విభాగ విద్య మరియు పరిశోధన విశ్వవిద్యాలయాలు (ఎంఇఆర్‌యులు) ఏర్పాటు చేయాలి. రియల్ టైమ్ వీసా ట్రాకింగ్ మరియు రాయబార కార్యాలయ మద్దతు కోసం భారతదేశం స్వచ్ఛంద డిజిటల్ విద్యార్థి రిజిస్ట్రీని సృష్టించాలి. వీసా ప్రమాదాలపై ముందస్తు హెచ్చరికల కోసం విద్యార్థుల డిజిటల్ ప్రొఫైల్‌లు, సోషల్ మీడియాను పర్యవేక్షించడానికి, భారత రాయబార కార్యాలయాలు అమెరికా 'క్యాచ్ అండ్ రివోక్' ప్రోగ్రామ్ మాదిరిగానే ఎఐ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేయాలి. విద్యా కన్సల్టెన్సీలను నియంత్రించాలి. విద్యార్థులు తప్పుదారి పట్టకుండా చూసుకోవడం ద్వారా భారతదేశం విద్యా కన్సల్టెన్సీలపై నిబంధనలను కఠినతరం చేయాలి. కఠినమైన రిజిస్ట్రేషన్, ఆడిట్‌లు,మోసానికి జరిమానాలను అమలు చేయాలి. మోసాలను తగ్గించడానికి విద్యా మంత్రిత్వ శాఖ అవగాహన ప్రచారాలను ప్రారంభించాలి. ప్రసిద్ధ కన్సల్టెన్సీల ధ్రువీకరించిన జాబితాను అందించాలి.

## దోపిడీ పీడన లేని సమసమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యం

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి



ప్రజాపక్షం/నర్సంపేట : దోపిడి పీడనలేని సమ సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. సోమవారం నర్సంపేట మాదన్నపేట రోడ్ సిపిఐ కాలనీ వద్ద ఉన్న కామ్రేడ్ పంజాల చంద్రమౌళి స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేకల రవి మాట్లాడుతూ అనేక సంవత్సరాలు కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి పేద ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించి దున్నేవాడికి భూమి కావాలని, నిలువ నీడలేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కావాలని అనేక భూ పోరాటాలు నిర్వహించి, పోరాడి భూములను సాధించిన చరిత్ర పంజాల చంద్రమౌళిది అన్నారు. పంజాల చంద్రమౌళి ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా ఆయన ఆశయాలను ఉనికిపుచ్చుకొని రానున్న తరాలకు కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను అందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ సభకు అధ్యక్షత వహించగా సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శిలు ఎస్కే బాష్మియా పనస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, అక్క పెల్లి రమేష్, తోట చంద్రకళ, నాయకులు కందిక చెన్నకేశవులు, గడ్డం యాకయ్య, మియాపురం గోవర్ధన్, పాలక కవిత, భానోతు వీరు నాయక్ చింతకింది కుమారస్వామి, అయిత యాకయ్య, గడ్డం నాగరాజు, అక్బర్, ఇల్లందుల సాంబయ్య, యాదగిరి, సతీష్, మమతా, శైలజ పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల రక్షణకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/దేవరకొండ : కార్మిక హక్కుల రక్షణకు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతన చట్టాలు అమలు చేసి అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టాలు చేయాలని కార్మిక సంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండ మార్కెట్ యార్డులో మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతానికి నియోజకవర్గంలోని ఆల్ ట్రేడ్ యూనియన్‌లతో సదస్సు జరిగింది. సదస్సులో పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ అపాలని, కనీస వేతన చట్టాలు అమలు చేయాలని జరిగే సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సదస్సులో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రామస్వామి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వెంకటయ్య, ఐఎన్‌టియుసి డివిజన్ అధ్యక్షులు మురళీకృష్ణ, టిఆర్‌ఎస్‌కెవి నాయకులు కృష్ణయ్య, యాదగిరి, నాగరాజు, సర్దార్, వెంకటేశ్వర్లు, వెంకట్‌రాములు, మల్లయ్య, సైదాచారి, ఇలియాజ్, అయోధ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

# మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్‌మార్క్స్

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ఘనంగా కారల్ మార్క్స్ జయంతి


హనుమకొండ

ప్రజాపక్షం/హనుమకొండ : ప్రపంచ గతిని మార్చిన మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం కారల్ మార్క్స్ 207వ జయంతి సందర్భంగా హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తక్కెళ్లపల్లి మాట్లాడుతూ ప్రపంచంలో పెట్టుబడిదారీ సమాజానికి మార్క్సిజం ఒక్కటే ప్రత్యామ్నాయం అన్నారు. సమానత్వానికి, సామాజిక న్యాయానికి, నిరుద్యోగ నిర్మూలనకు మార్క్సిజం మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయకార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్.ఎ.స్టాలిన్, నాయకులు మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, ఏషబోయిన శ్రీనివాస్, కొట్టేపాక రవి, మాలోతు శంకర్, ఏదునూరి వెంకటరాజం, కండె నర్సయ్య, దామెర సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం :** కారల్ మార్క్స్ ప్రతిపాదించిన మార్క్సిజం ప్రపంచ గతిని మార్చిందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. సమ సమాజం కోసం పరితపించిన కారల్ మార్క్స్ దోపిడీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేశారని ఆయన తెలిపారు. కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ మానవ శ్రమకు విలువ తెచ్చిన మహనీయుడు కారల్ మార్క్స్ అని తెలిపారు. శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని ఆయన చేసిన కృషి ప్రపంచ కార్మిక వర్గానికి ఒక దిక్సూచిగా మారిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రాబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, రాసాల మోహన్‌రావు, జిల్లా నాయకులు పోటు పూర్ణచందర్ రావు, మందా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** ధనిక, పేద తేడాలు లేని సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా కమ్యూనిస్టు సిద్ధాంతం పనిచేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో కారల్ మార్క్స్ జయంతిని నిర్వహించారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులరించారు. ఈ సందర్భంగా మేకల రవి మాట్లాడుతూ సమాజంలోని అన్ని రకాల సమస్యలు పెట్టుబడిదారీ విధానం వల్లనే వస్తున్నాయని, దానికి ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని రూపొందించిన కారల్ మార్క్స్ ప్రపంచానికే దిక్సూచిగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కె భాష్మీయా, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, గుంపెల్లి మునీశ్వరుడు, దండు లక్ష్మణ్, సంగి ఎలేందర్, ఎండి అక్బర్, నాయకులు ఎండి యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్/అదిలాబాద్ :** అదిలాబాద్ సిపిఐ జిల్లా కార్యాలయంలో కారల్ మార్క్స్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి హాజరై కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు షేక్ పాషా, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు ఖండాల గణేష్, ప్రహ్లాద్ రామేశ్వర్ బోరజ్, రామన్న, గంగమ్మ పాల్గొన్నారు.

**జోగులాంబ గద్వాల :** కారల్ మార్క్స్ జయంతిని జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, టిపిఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, టీజీ రాజు, ఎఐటియుసి జిల్లా సహాయకార్యదర్శి నారాయణ, కార్మిక నాయకులు వెంకట్రామిరెడ్డి, మస్తాన్, హమాలీ సంఘం నాయకులు శ్యాలిమియా, దీక్షి తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం...


వరంగల్..


నిర్మల్ అదిలాబాద్


జోగులాంబ గద్వాల

## మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి పోరాడుతుందని సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్‌సారథిరెడ్డి తెలిపారు. మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ వర్కర్స్, ఇంజనీరింగ్ సెక్షన్, శానిటేషన్ విభాగం, గ్రీన్ టీంలనుంచి 40మంది కార్మికులు సోమవారం ఎఐటియుసిలో చేరారు. కార్యక్రమంలో రేషపల్లి నవీన్, పుచ్చకాయల రమణ, లింగాల విజయ్, వెంపటి రాములు, చెడిపాక శ్రీను, మంద ఆదం, పుల్లూరి నాగేశ్వరావు, పుచ్చకాయల మధుసూధన్, భీమ్, జ్ఞానేశ్వర్, దాసరి రాంమూర్తి, ఎల్లయ్య, జల్లి నవీన్, తప్పెట్ల ప్రవీణ్, మంద సరిత, విజయ్, ఉప్పలయ్య పాల్గొన్నారు.



# పేదల పక్షాన పోరాడిన 'వెంపటి'

సంస్మరణ సభలో కూనంనేని



ప్రజాపక్షం/ఖమ్మం : తుదిశ్వాస వరకు పేదల పక్షాన పోరాడడంతో పాటు అనేక మందిని పోరాటాల వైపు నడిపిన వెంపటి సూర్యనారాయణ ధన్యజీవని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో సూర్యనారాయణ కీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. వెంపటి సూర్యనారాయణ సంస్మరణ సభ సోమవారం పాల్వంచలోని తనూజ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో కూనంనేని మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి సుదీర్ఘ కాలం ప్రజా ఉద్యమాల్లో పనిచేసిన ఘనత సూర్యనారాయణకు దక్కుతుందన్నారు. ప్రజలను పోరాటాలకు సమాయత్తం చేయడం కమ్యూనిస్టు పార్టీని విస్తరించడమే సూర్యనారాయణకు ఇచ్చే సరైన నివాళి అని సాంబశివరావు తెలిపారు. సూర్యనారాయణ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, ఉమ్మడిజిల్లా సిపిఐ నాయకులు యర్రాబాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, భూక్యా శ్రీనివాస్, డి.సుధాకర్, వి.పద్మజ, రత్నకుమారి, కొండల రావుతో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఆర్మీ జవానుకు ఘనసన్మానం



**ప్రజాపక్షం / వేలేరు :** 22సంవత్సరాలు దేశభద్రతలో బాగంగా ఆర్మీలో జవానుగా సేవలు అందించి పదవీవిరమణ చేసి తనస్వగ్రామానికి తిరిగిరాగానే గ్రామస్తులు జవాన్ గొర్రె నరేష్‌కు స్వాగతం పలికి సత్కరించారు. తమ ఎర్రబెల్లి గ్రామస్తుడు గొర్రె నరేష్ దేశభద్రతకోసం దేశఆర్మీతో దేశం కోసం 22 సంవత్సరాలు సేవలు అందించినందుకు సంతోషంగా ఉందని అన్నారు.ముద్దసాని వరుణ్,శ్రావణ్,కిశోర్,అల్లం సతీష్,రాజ్‌కుమార్,ఎర్ర ప్రసాద్,చినబాబు,కుటుంబసభ్యులు తల్లి వెంకటమ్మ,భార్య ఉష,కుమార్తె ప్రియాంక్షి,కుమారుడు రణవ్‌రణవ్ తదితరులు పాల్గొన్నారు.



## ‘మధుగురు అక్షర యజ్ఞం’ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం ఎంఎల్‌ఏ క్యాంప్ కార్యాలయంలో మధుగురు అక్షర యజ్ఞం ప్రచార సంచికను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆవిష్కరించారు. సీతక్క మాట్లాడుతూ అక్షర యజ్ఞం నిర్వాహకులు రౌతు మధు పిల్లలకు ఉన్న చదువులు...పెద్దలకు ఉపాధి మార్గాలు అందించాలని తెలిపారు. అక్షర యజ్ఞంలో భాగంగా మధుగురు ఇన్నోవేషన్ కేంద్రాలలో యువత, మహిళలకు ఉద్యోగానికి కావాల్సిన ప్రావీణ్యాలని, నైపుణ్యాలని పెంపొందించడం, వ్యాపారానికి కావాల్సిన వనరుతలను అందించబడునని పూర్తి వివరాలకు 9441226834, 9491504405లో సంప్రదించాలని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు జిల్లా బిసి సెల్ అధ్యక్షులు వంగ రవి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కొడుకు వేధింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** గోవిందరావుపేట మండలం దుంపిళ్ల గూడెం గ్రామానికి చెందిన జోగు స్వరూప సాంబయ్య దంపతుల మొదటి కొడుకు గత కొద్ది రోజులుగా తల్లిదండ్రులను బెదిరిస్తూ కర్రలతో, కత్తులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. జోగు స్వరూప సోమవారం ములుగు కలెక్టర్‌ను కలిసి తన కొడుకుపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ స్వరూప మొదటి కొడుకు కట్నం పైసలు వాడుకున్నావని, నా డబ్బులు నాకు ఇవ్వాలని, నాలుగు లక్షలు ఇస్తేనే ఇంట్లోకి రానిస్తానని కోడలు,కొడుకు ఇద్దరు కలిసితల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేస్తూ కర్రలతో,కత్తులతోనిందిస్తున్నట్లు కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా చెప్పుకున్నారు. కలెక్టర్ స్పందించి కుమారుడిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## 20న సమ్మె విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** మతోన్మాద విధానాలను ఎదుర్కోవడానికి కార్మిక చట్టాలను రక్షించుకోవడానికి ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం వెంకటాపూర్ మండల కేంద్రంలో గుర్రం రమేష్ అధ్యక్షతన జరిగిన హమాలీ కార్మిక సంఘం సమావేశంలో ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడారు. హమాలీ కార్మిక సంఘం నాయకులుగాలి సమ్మయ్య,ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, మండల నాయకులు తోట సంపత్, గుర్రం రమేష్, ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు జంగిలి నాగరాజు, మేకల సమ్మయ్య, ఖమ్మం నాగరాజు, పెరుక పోషాలు, కనుకయ్య, భీస్కుల సారయ్య, రొక్కల బిక్షపతి, మేకల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా బతుకమ్మకుంట అభివృద్ధి

### జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాష షేక్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ పట్టణంలోని బతుకమ్మ కుంట పనులు శరవేగంగా చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం పూడికతీత పనులకు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ కుంట అభివృద్ధి కోసం కోటీ 50 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయన్నారు. టెండర్ పూర్తి కాగా పనులు ప్రారంభం అయ్యాయన్నారు. బతుకమ్మ కుంట సుందరీకరణలో భాగంగా గ్రిల్స్, కాలబాట, గజిబోలు, లైటింగ్, వ్యాయాయ పరికరాలు, చిన్నారుల ఆటస్థలం, ఆడుకునేందుకు పరికరాలు, చిన్న పార్కు ఏర్పాటు చేయనున్నామన్నారు. నెల రోజుల్లో బతుకమ్మ కుంట పనులు పూర్తి చేసి స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే విధంగా చూడాలన్నారు. ఉదయం, సాయంత్రం వాకింగ్‌తో పాటు సాయంత్రం వేల లైటింగ్, చిన్న పిల్లలకు చక్కటి ఆటస్థలం అందుబాటులోకి రానుందన్నారు.

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

### జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే

**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితుల నుంచి 16 ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు.బాధితుల సమస్యలు సత్వరంగా పరిష్కరించాలని సంబధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

## కారల్‌మార్క్స్ ఆశయ సాధనకు కృషి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రపంచ ఆర్థికవేత్త కారల్ మార్క్స్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్‌కుమార్ అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో సిపిఐ ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ 207వ జయంతి వేడుకలను నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడారు.మార్క్స్ సిద్ధాంతాన్ని మించిన సిద్ధాంతం లేదని అన్నారు. ఆయన మన మధ్యలో లేకపోయినా ఆయన ఆశయాలను సాధించడమే నిజమైన నివాళి అని కొనియాడారు. అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల నాయకులతో కలిసి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కారల్ మార్క్స్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఐ నాయకులు క్యాతరాజు, సతీష్, కోరిమి సుగుణ, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, పొనగంటి లావణ్య, బీమానాధుని సత్యనారాయణ, యాకుబ్ పాషా, రవీందర్, రాములు, మల్లయ్య పాల్గొన్నారు.

## ఎన్‌కౌంటర్లే చేస్తామనడం హేయమైన చర్య

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి

### ఆపరేషన్ ‘కగార్’ను వెంటనే ఆపాలి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** ప్రపంచ సుందరీ పోటీలకు అవసరమైన వసతులు మాత్రమే ప్రభుత్వం కల్పిస్తుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీలను స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలకు అందిస్తున్నట్లు కడియం శ్రీహరి తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాలకు సంబంధించి 111 మంది లబ్ధిదారులకు రూ. 38,22,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయని వాటికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాన్ని 600 అడుగులకు మించకుండా కట్టుకోవాలన్నారు.వేలేరు మండలంలో పిచరలో 132/33 కేవీ సబ్ స్టేషన్‌ను రూ. 24 కోట్లతో నిర్మాణం అవుతుందని, మరో మూడు నెలల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. దీంతో పాటు ధర్మసాగర్ మండలం రాయగూడెం, రఘునాతపల్లి మండలం కుర్చపల్లి, జఫర్‌గడ్ మండలం సాగరం, చిల్పూర్ మండలం కొండాపూర్, చిల్పూరు మండలం లింగంపల్లిలో 33/11 కేవీ సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నట్లు మొత్తం దాదాపు రూ. 35 కోట్లతో నియోజకవర్గంలో ఎక్కడ విద్యుత్ సమస్యలు రాకుండా పనులు చేపట్టినట్లు వివరించారు. ధాన్యం సేకరణలో సన్నాలకు రూ. 500 బోనస్ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల మన్ననలు పొందుతున్న పథకం సన్న బియ్యం పంపిణీ పథకమన్నారు.

### ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి పట్టు విడుపులు ఉండాలని సూచించారు. కేవలం ఎన్‌కౌంటర్లతోనే సమస్యలు పరిష్కారం కావన్నారు. బీజేపీ ప్రభుత్వం శత్రు దేశంతో కాకుండా సొంత ప్రజలపైనే దాడులు చేయడం హేయమని అభివర్ణించారు. ప్రపంచ సుందరి పోటీల ద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ సుందరి పోటీలకు అవసరమైన వసతులు మాత్రమే కల్పిస్తుందన్నారు. మార్కెట్ ఛైర్‌పర్సన్ లావణ్య, గ్రంథాలయ ఛైర్మన్ రాంబాబు, దేవస్థాన ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, శిరీష్‌రెడ్డి, ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, పోగుల సారంగపాణి, వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజేష్‌నాయక్, తీగల కరుణాకర్‌రాజు, తోట సత్యం,గుర్రం ఫాతికుమార్, సతీష్, వెంకటయ్య, చింతమల్లయ్య,ప్రసాద్, సురేష్, చేరాలు, ఇషాక్, అంబటి కిషన్‌రాజు,రమేశ్, బూర్ల రాజుఉన్నారు.

## టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక దాడులు




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ రోహిత్ రెడ్డి ,స్వాతి, శ్రీశికలతో కూడిన బృందం హనుమకొండ పట్టణంలో గల ఫుడ్ ఆన్ ఫైర్, ల్యాండ్ మార్క రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.వంట గది పూర్తిగా అపరిశుభ్రంగా ఉండడం, మురికితో దుర్వాసన కలిగిన రిఫ్రిజిరేటర్‌లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం సరైన ఉష్ణోగ్రతను మైంటైన్ చేయకపోవడమ్, సుమారు 45వేల రూపాయల విలువ కలిగిన 32 కిలోల నిలువ చేసిన కుళ్ళిన మాంసపు ఉత్పత్తులను, హానికర ప్రమాదకరమైన రంగులను కలిపిన చికెన్ కాలం చెల్లిన ఐస్ క్రీములు, పాల ప్యాకెట్లు, మసాలాపొడులు,లేబుల్ డిఫెక్ట్స్ కలిగిన కార్న్,కొబ్బరి పొడి, ఇతర ఆహార ముడి సరుకులు, ఫంగస్ తో కూడుకున్న కాలీఫ్లవర్,క్యాబేజీ వంటి కూరగాయలను, గుర్తించడం, బిర్యానీ, ఇతర ప్రాసెస్డ్ ఫుడ్స్ తయారీలో మోతాదును మించి హానికర రసాయనాలతో కూడిన రంగులను వాడటం,హోటల్ యాజమాన్యం పై ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ అయిన వి. జ్యోతిర్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ,అప్పటికప్పుడే ప్రజల ఆరోగ్యానికి భంగం కలగకూడదని వాటిని ధ్వంసం చేసి ఎఫ్ ఎస్ ఎస్ 2006, చట్టాన్నిఉల్లంఘించినందుకు నోటీసులు జారీ చేయడం జరిగింది. అనుమానిక శాంపిలను సేకరించి హైదరాబాద్లో గల ల్యాబ్ పంపడం నివేదిక ఆధారంగా కల్తీ అనే నిర్ధారణ అయితే వారిపై చట్టరీత్య చర్యలు ఉంటాయని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా ఆహారాన్ని ప్రజలకు విక్రయించాలని టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి.జ్యోతిర్మయి సూచించారు. ఈ నిబంధనలు పాటించని యెడల చట్ట ప్రకారం శిక్షకు గురి కాబడతారని హెచ్చరించారు. టాస్క్ ఫోర్స్ దాడులలో అధికారులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## టెన్త్‌లో ‘డిస్నీల్యాండ్’ ప్రభంజనం



**ప్రజాపక్షం/ఆత్మకూరు :**పదో తరగతి ఫలితాల్లో హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్‌లోని డిస్నీల్యాండ్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల డైరెక్టర్ రాకేష్ భాను సోమవారం మీడియాకు తెలిపారు. తుత్తురు హర్షిని 569 మార్కులు, బానోతు శ్రీమన్ 569,మద్దూరి శ్రీశాంత్ 560 మార్కులు సాధించారు. మరో 47మంది విద్యార్థులు, 500 పైగా మార్కులు సాధించారన్నారు.అనంతరం విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకులు దయ్యాలమల్లయ్య, దయ్యాల సదయ్య, బి.లక్ష్మీ నివాసం, డైరెక్టర్లు బి.శోభారాణి, దయ్యాల రాకేష్ భాను, దయ్యాల దినేష్ చందర్ అభినందించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ఈ నెల 20న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసేందుకు ముందస్తు సమ్మె నోటీసు ను తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజి వాకాడేకు సమ్మె నోటీసు అందజేశారు.ఎఐటీయుసి హనుమకొండ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలతో 47 కోట్ల మందికి నష్టం కలుగుతున్న సందర్భంలో అనేక సార్లు సమ్మె ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలిపినప్పటికీ ఉపసంహరించుకోవడం లేదన్నారు. అందులో భాగంగానే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వరంగల్ పరిధిలోని కార్మికులందరూ ఈ సమ్మెలో పాల్గొంటారని కమిషనర్ కు వివరించారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.మూర్తిరాజు,బొక్క ఏలియా, అంకేశ్వరపు ఎల్లస్వామి,యం.రఘు, ఎస్.కె, షమీం,యం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా పట్టివేత

**ప్రజాపక్షం/వాజేడు:**గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వాజేడు ఎస్సై రాజ్‌కుమార్ వివరాల ప్రకారం... వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామం వద్ద 163వ జాతీయ రహదారిపై సివిల్, సిఆర్పిఎఫ్ పోలీసులతో వాహన తనిఖీలు చేస్తుండగా గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన వ్యక్తి మోటార్‌సైకిల్‌పై పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకొని విచారించారు. గుమ్మడిదొడ్డికి చెందిన కారం లచ్చిరాం(60) బైక్ పై 20 లీటర్ల నిషేధిత గుడుంబానిచత్తీస్గఢ్ నుంచి పట్టుకొస్తున్నానని తెలిపాడని,కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. గుడుంబాను ఎవరైనా అమ్మిన, తరలించినా చర్యలుంటాయనిహెచ్చరించారు. ఏఎస్ఐ యాకూబ్ పాషా, హెడ్ కానిస్టేబుల్ చంద్రప్రకాష్, నిస్సార్ ఆలీ, కానిస్టేబుల్ మిరాజ్, నరేష్ పాల్గొన్నారు.

## ‘అప్పీలు’ ద్వారా భూ సమస్యలు పరిష్కారం

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు




**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** భూభారతి నూతన రెవెన్యూ చట్టం అమల్లో భాగంగా వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసి, సోమవారం మండలంలోని బండవుతాపురం, కొత్తపల్లి గ్రామాల్లో రెవిన్యూ సదస్సులో కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా అనేకమంది పేద రైతులు ఇబ్బందులకు గురయ్యారని, వేల ఎకరాల భూములు గల్లంతయ్యాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. తహసీల్దార్ ద్వారా ఏదేని పొరపాటు జరిగితే ఆర్డీఓ, ఆర్డీఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్‌కు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి జూన్ 2 న పట్టా పాస్ పుస్తకాలను అందజేయనున్నట్లు నాగరాజు తెలిపారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్య లేని మండలం గా వర్ధన్నపేటను తీర్చిదిద్దాలని అధికారులకు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట మండలంలోని 13 గ్రామాల్లో ఈ నెల 5 నుంచి 14వతేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. డిఆర్ ఓ విజయలక్ష్మి ,తహసీల్దార్‌విజయసాగర్, మార్కెట్ ఛైర్మన్ వెంకటయ్య ప్రజా ప్రతినిధులు, రెవిన్యూ అధికారులు, రైతులు తదితరలు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల పోరాటాలే ప్రజాసమస్యలకు ఏకైక మార్గం

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ప్రజా సమస్యలు పరిష్కారానికి కమ్యూనిస్టుల పోరాటాలే ఏకైక మార్గమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. కురవి మండలం అయ్యగారిపల్లి సిపిఐ గ్రామ శాఖ సమావేశం గుడికి పిచ్చయ్య అధ్యక్షతన జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగిపోయాయని, మోడీ అవలంబించిన కార్పోరేట్ అనుకూల విధానాలతో దేశ సంపద కారు చౌకగా కట్టబెట్టడమే అందుకు కారణమని విమర్శించారు. మేడే వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల స్థూపం దగ్గర అరుణపతాకాన్ని ఎగురవేశారు. అనంతరం బొల్లు వెంకన్న సిపిఐ గ్రామ కార్యదర్శిగా, గజ్జి చంద్రయ్య సహాయ కార్యదర్శిగా ఏడుగురు సభ్యులతో కమిటిని ఎన్నుకున్నారు. సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య,కలగూర నాగరాజు, నర్సింగం గురవయ్య,కందుల యాకయ్య, బొడిగ పిచ్చయ్యా, యాకన్న, వీరయ్య, సూర్యనారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

### కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు




**ప్రజాపక్షం/కెయుక్యాంపస్ :** ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి మావోయిస్టు పార్టీ నాయకులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు చేపట్టాలని కాకతీయ యూని వర్సిటీ విద్యార్థులు సూచించారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ఆఫీస్ నుండి యూనివర్సిటీ మొదటి గేటు వరకు శాంతిర్యాలి నిర్వహించారు.భారత్ బచావో నుండి విచ్చేసిన రిటైర్డ్ టీచర్ రాంబ్రహ్మం మాట్లాడారు. కేంద్రం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌నీ రద్దు చేసి ఆదివాసులపై జరుగుతున్న మారణ హనాన్ని ఆపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేసారు. గత పన్నెండు రోజులుగా ఆపరేషన్ కర్రె గుట్టల పేరుతో అక్కడ మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో కొనసాగుతున్న కుంబింగ్‌నీ నిలిపివేసి బలగాలను వెనక్కి పంపాలని వారు కోరారు. డిఎస్‌ఎ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పిడిఎస్యు జిల్లా సెక్రటరీ మర్రి మహేష్, బిఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు శివ, భారత్ బచావో నుండి వెంగల్ రెడ్డి, రాంబ్రహ్మం, రాజా మహమ్మద్, సదానందం, అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మార్క శంకర్ నారాయణ లతో పాటు విద్యార్థి సంఘ నాయకులు ఉప్పుల శివ, మహేష్, శివ, రాజేష్, సన్నీ తదితరులు మాట్లాడారు.

## పుష్కరాల పనులకు ‘10’ డెడ్‌లైన్

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కాళేశ్వరం క్షేత్రంలో సోమవారం విఐపి ఘాట్,సరస్వతి మాతా విగ్రహం ఏర్పాటు, శాశ్వత, తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మాణం, టెంట్ సిటీ, ఫుడ్ కోర్టు, ఎగ్జిబిషన్, స్టాళ్లు ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఈ నెల 15 నుండి 26వరకు సరస్వతి పుష్కరాలు జరగనున్నాయని, పనులు ఈ నెల 10లోగాపూర్తి చేయాలని ఆదేశించారు. సరస్వతి తల్లి విగ్రహం ఏర్పాటు పనులు మంగళవారం నుండి ప్రారంభమవుతాయని తెలిపారు.

## త్వరితగతిన ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం



### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/ హనుమకొండ:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 143 వినతులను అందజేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి:** ప్రజావాణిలో అర్జిదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్, డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, లు ప్రజల నుండి వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం136 దరఖాస్తులు రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు.



### ములుగు కలెక్టర్ దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధిః**ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వినతులను అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావులతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 45 దరఖాస్తులు వచ్చాయన్నారు. వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



### జయశంకర్ కలెక్టర్ రాహుల్‌శర్మ

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సమస్య పరిష్కారం కోరుతూ ప్రజావాణికి వచ్చిన ప్రజల దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 52 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణి ప్రధాన ఉద్దేశం ప్రజల ఫిర్యాదులను స్వీకరించి త్వరితగతిన పరిష్కారం చేయడమేనని అధికారులు జాప్యం చేయొద్దని సూచించారు. అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఏరియా సెక్యూరిటీ జిఎంకు సింగరేణి ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/ఇల్లెందు:** ఎఐటియుసిఅనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లెందుకు విచ్చేసిన జీఎం సెక్యూరిటీ లక్ష్మీ నారాయణ కార్పోరేట్ని ఎస్అండ్పిసి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా యూనియన్ బృంధం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్అండ్పిసి ఎఐటియుసి పిట్ కార్యదర్శి దాట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..షెడ్1ను సవరించి అందరికీ షెడ్లు వర్తింపజేయాలని, ప్రతీ కంప్యూటర్ తనిఖీ కేంద్రంలో ఎసి సౌకర్యం కల్పించాలని, కోయగూడెం ఒసి తనిఖీ కేంద్రం ఓవర్ హెడ్ ట్యాంకు నీటి సరఫరా చేయాలని కోరారు. ఇసుప తనిఖీ కేంద్రం షెడ్ల స్థానంలో నూతన కాంక్రీట్ భవనం, ఎస్అండ్పిసి కార్యాలయంలో చల్లని మంచినీటిని ఉంచే విధంగా కూలర్ ఏర్పాటు చేయాలని, తదితర అంశాలపై నాయకులు వినతిపత్రం ద్వారా తెలిపారు. పిట్ సహాయ కార్యదర్శి ఎస్.రవి, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



**ప్రజాపక్షం/సుజాతనగర్:**రైతులు పండించినధాన్యాన్ని సొసైటీ ద్వారా కాటాలు పెట్టి ప్రభుత్వం కొనుగోలు చేయాలని సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారిలో రైతులు రాస్తారోకో చేశారు. సోమవారం రాఘవాపురం రోడ్డులో సొసైటీ కేంద్రంలో వడ్లు ఆరబోసి వందలాది రైతులతో నిరసన తెలియజేసి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. అకాల వర్షాలతో కళ్ళాల్లో తమ ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుతూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. చాలా రోజుల నుండి ధాన్యం కాటాలు గాక కొనుగోలు జరగక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 20 లారీల వడ్లు సొసైటీలు ఉన్నాయని ఇంకా 1500 ఎకరాలు వరి కోతకు ఉన్నాయని అధికారులు ఎవరూ పట్టించుకోవట్లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కింటాకు 5 కేజీల తారం అడుగుతున్నారని అలాంటిదేమీ లేకుండా కొనుగోలు చేయాలన్నారు. లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## చలివేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు కూలిపోతున్న అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని సిపిఐ నగర సమితి ఆరోపించింది. 19వ డివిజన్లో కొత్తగూడెం అల్లిపురం క్రాస్రోడ్డు ఐటి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం సిపిఐ నాయకులు పరిశీలించారు. చలివేంద్రం ద్వారా చుక్కనీరు అందించిన పాపన పోలేదని ఇప్పటికైనా కూలిపోయిన చలివేంద్రాన్ని మరమ్మతు చేసి ప్రతి చలివేంద్రంలోనూ ఒకరిని ఉంచి త్రాగునీటిని అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ నేతలు కోరారు. చలివేంద్రాన్ని పరిశీలించిన వారిలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, సహాయ కార్యదర్శి,నాయకులు,తదితరులుపాల్గొన్నారు.

## 112కిలోల గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/ఇల్లెందు:** మండల పరిధిలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో పక్కా సమాచారం మేరకు ఎస్ఐపి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 112కిలోల గంజాయిని పట్టుకున్నట్లు డిఎస్పి చంద్రభాను పేర్కొన్నా రు. వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో కొత్తగూడెం నుంచి ఇల్లెందు వై పుగా జహీరాబాద్కు బజాజ్ ఆటో నం.ఎపి20వై4542 వాహనంలో తరలిస్తున్న 112కిలోల గంజాయి సుమారు రూ.56లక్షలు ఉంటుందని, దా నితోపాటు పల్సర్ ద్విచక్రవాహనం నం.టిఎస్26ఎఫ్1896ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని, ఏ1గా స పావట్ వెంకన్న, ఎ2గా మూడ్ శ్రీనివాసులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు.సిఐ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు



**ప్రజాపక్షం/ఇల్లెందు:** మండలంలోనికట్టుగూడెంపాతపెంకు ఫ్యాక్టరీలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని సిఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడి చేసి అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో దాడి చేయగా పే కాడుతున్న ఎనిమిది మందిని అక్కడే అరెస్టు చేశామని ఒకరు పరారీలో ఉ న్నారని, వారి నుంచి రూ.40వేలు నగదు, 8సెల్ఫోన్లు, ఒక కారు, ద్వి చక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.9మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, పేకాట ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పెద్దవాగు బ్రిడ్జిని సందర్శించిన పినపాక ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/కరకగూడెం;**కరకగూడెం మండల పర్యటంలో భాగంగా కరకగూడెం చిరుమళ్ళ గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు బ్రిడ్జి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బ్రిడ్జి సైడ్ వాల్ కోతకి గురి కావడంతో సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పెద్దవాగు బ్రిడ్జిని సందర్శించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని తగు అధికారులతో ఫోన్లో మాట్లాడి బ్రిడ్జి సైడ్ వాల్ నిర్మాణ పనులకు 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగింది. ఇకపై బ్రిడ్జి సైడ్ వాల్ కోతకి గురికాకుండా తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం ఎమ్మార్వో నాగప్రసాద్, ఎంపీడీవో కుమార్, ప్రభుత్వ అధికారులు, కరకగూడెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచ్ పోలేబోయిన శ్రీవాణి తిరుపతయ్య, మండల నాయకులు యర్ర సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎంని కలిసిన ఎమ్మెల్యే ఆదినారాయణ



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట:** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను హైద్రాబాద్లోనితనఛాంబర్లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం కలిసి పుష్పగుచ్చం అందించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరై పోడుభూములను సస్యశ్యామలం చేయాలనే దృఢ సంకల్పంతో నూరుశాతం సబ్సిడీతో సోలార్విద్యుత్ బోర్లు, మోటార్లు ఇస్తున్న తరుణంగా చంద్రగొండ మండలం బెండాలపాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందుకు డిప్యూటీ సిఎం భట్టికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గంలో అశ్వారావుపేట, అచ్యుతాపురం, తి రుమలకుంట, పార్కులగండి గ్రామాల్లో నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్స్టేషన్ల శంకుస్థాపనలకు, పైలెట్ ప్రాజెక్టు బెండాలపాడు గ్రామంలో బోర్ల ప్రారంభోత్సవాలకువిచ్చేయాలనిభట్టికి ఆహ్వానపత్రికను అందచేశారు.

## విజ్ఞానం అందించేందుకు
# 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు'

మార్కెట్ డిమాండ్కు అనుగుణంగా సాగు చేస్తే మేలు

వ్యవసాయ అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రైతులకు విజ్ఞానం అందించేందుకు ప్రభుత్వం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం రాంక్యాతండా రైతు వేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆహార సంక్షోభం నుంచి బయటపడేందుకు మనం హరితవిప్లవం ప్రారంభించామని నేడు మనకు కావల్సిన ఆహార ఉత్పత్తుల తయారీలో స్వాలంభన సాధించామన్నారు. ప్రస్తుతం రైతులకు దిగుబడి పెరిగినా లాభసాటి కావడం లేదని, రసాయనాల వాడకం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. దేశంలో ఉన్న విజ్ఞానం రైతుల వద్దకు తీసుకుని వచ్చేందుకు ప్రభుత్వం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మన నేల, రకం, స్వభావం అనుగుణంగా ఎరువులు, రసాయనాలు అవసరం మేరకు మాత్రమే వాడాలని కలెక్టర్ తెలిపారు. మనం పంట వేసే ముందు ఎరువులు, రసాయనాలు ఎంత వేయాలో తెలుసుకుని అంతే వేయాలన్నారు. మన దగ్గర ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలన్నారు. రైతులు పంటల మార్పిడి విధానం అమలు చేయాలన్నారు. చిన్న, సన్నకారు రైతులు కాకుండా ఐదు, పది ఎకరాలు ఉన్న రైతులు ముందుకు వచ్చి వారు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలన్నారు.ఖమ్మంజిల్లాలో ఏడు లక్షల ఎకరాల పంట పొలా లు ఉంటే నేడు వరి, పత్తి, మొక్కజొన్న మూడు పంటలు 90 శాతానికి పైగా రైతులు సాగు చేస్తున్నారన్నారు. మార్కెట్లో ఉన్న డిమాండ్కు అనుగుణంగా పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్బైడ్ రహిత మామిడి పండిస్తే డిమాండ్ ఉందని గమనించి రైతు ఆ దిశగా సాగు చేస్తే మంచి విలువతో విక్రయించవచ్చునన్నారు. రైతులకు లాభం పెరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దళారులు లేకుండా రైతులు నేరుగా అమ్ముకునేలా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు ఒకసారి చర్చించుకుని మంచి ప్రయత్నం చేయాలని ప్రభుత్వం తరుపున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అనంతరం మండలంలో నూతన సాగును ప్రోత్సహిస్తున్న రైతులను కలెక్టర్ సన్మానించారు. జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య మాట్లాడుతూ రైతులు యూరియా వినియోగం అధికంగా చేస్తున్నారని దీని వల్ల పంట పొలాలు చౌడుబారి దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. విత్తనాలు, పురుగు మందుల రశీదు రైతులు పంట కాలానికి మొత్తం భద్రపర్చుకోవాలన్నారు. వైరా కెవికె శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం సూచించినటువంటి ఆరు అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. ఖమ్మం డివిజన్ ఎడిఎకొంగర వెంకటేశ్వరరావు,మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర రెడ్డి, ఎంపిడిఒఅశోక్కుమార్, ఖమ్మం డివిజన్ ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రైతు సంఘం అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు మందడపు సుధాకర్, తాతా రఘురాం, డివిజన్ ఉద్యానవన అధికారి నగేష్, ఎఇఒలు, పంచాయతీ సెక్రటరీ లాలయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ సెలూన్లను మూసివేయాలని వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** తమ జీవనోపాధిని దెబ్బతీస్తున్న కార్పొరేట్ సెలూన్లను వెంటనే మూసివేయాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్ చేసింది. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ధర్నాచౌక్లో నిరసన తెలిపారు. అంతకు ముందు పెవిలియన్ మైదానం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించి అంబేద్కర్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుండ్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సంఘం అధ్యక్షులు యలమందల జగదీష్ మాట్లాడుతూ వేలాది మంది నాయీ బ్రాహ్మణులు శతాబ్దాల నుంచి కులవృత్తి పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్పొరేట్ సెలూన్ల కారణంగా జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణ కుల వృత్తిని కాపాడేందుకు పాలకులు సహకరించాలని జగదీష్ విజ్ఞప్తి చేశారు. వృత్తిదారులకు రాయితీపై రుణాలు ఇవ్వాలని రూ. 10లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమకు అండగా ఉన్నాయని ప్రభుత్వం ఆలోచించాలని జగదీష్ విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ సెలూన్లు మూసివేసేంత వరకు వివిధ రూపాల్లో తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. సిపిఐ నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు చేస్తున్న ఆందోళనకు తాము పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. భవిష్యత్తులో కార్పొరేట్ సెలూన్ల మూసివేత వరకు సిపిఐ నాయీ బ్రాహ్మణులకు దన్నుగా నిలుస్తుందన్నారు. సిపిఐ మాస్లైన్ జిల్లా కార్యదర్శి , నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఆందోళన అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

## ఘనంగా కార్ల్ మార్క్స్207వ జయంతి



**ప్రజాపక్షం/మణుగూరు:**సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా కార్ల్ మార్క్స్ 207 వ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం మణుగూరు సిపిఐ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా కార్ల్ మార్క్స్ చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మేధావి, అభ్యుదయవాది అయిన కార్ల్ మార్క్స్ 1818 మే 5న జర్మనీలో జన్మించారని అనేక ఆటు పోట్లు కష్టనష్టాలను అనుభవించారని, పెట్టుబడిదారీ వ్యవస్థను ఏ విధంగా ఎదుర్కోవాలి, శ్రామిక కార్మిక వర్గాన్ని ఏ విధంగా కాపాడుకోవాలని మార్క్స్ సిద్ధాంతం ద్వారా ఈ ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి మార్క్స్ అని వారన్నారు. ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలు సోషలిస్ట్, పార్టీలు మార్క్స్ సిద్ధాంతం మీద ఆధారపడి ఉన్నాయని వాటి మీదనే ఆధారపడి నడుస్తాయని మార్క్స్ సిద్ధాంతాన్ని మించింది ఇంకొకటి లేదని వారు అన్నారు. వారు చూపించిన బాటలో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, ఎఐటియుసిమణుగూరు మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, బోశెట్టి సంపత్, మాజీ వార్డు మెంబర్ సూది పోగు లక్ష్మణరావు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రెండు బృందాలతో 22 గ్రామాల్లో సదస్సులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పైలెట్ ప్రాజెక్టు క్రింద జిల్లాలోని బోనకల్ మండలంలో భూభారతి రెవె న్యూ సదస్సులు మే 16 వరకు నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సోమవారం ఒకప్రకటనలోతెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఖమ్మంజిల్లాలోని బోనకల్ మండలంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి ద రఖాస్తులు స్వీకరించాలని ఆదేశించిందని అదనపు కలెక్టర్ తెలిపారు. మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి 22 గ్రామ పంచాయతీల్లో ఒకరోజు చొప్పున ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెవె న్యూ సదస్సులు జరిగేలా షెడ్యూల్ రూపొందించడం జరిగిందన్నారు. ప్రజలు ఈసదస్సులో పాల్గొని తమ భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు సమర్పించాలని ఆయన తెలిపారు.

## ప్రతీ రైతుకూ 11 అంకెలతో ప్రత్యేక నెంబర్ ఐడి కార్డు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కేంద్ర ప్రభుత్వ చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం క్లస్టర్లో ఫార్మర్ ఐడి రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా రైతు రిజిస్ట్రేషన్ను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా పాసుపుస్తకం ఉన్న ప్రతిరైతుకు 11 అంకెల యూనిక్ ఐడి కేటాయించడం జరుగుతుందన్నారు. వారికి ఉన్న భూమి రకం, సాగు, వ్యక్తిగత వివరాలను డిజిటల్ రూపంలో ప్రభుత్వం నమోదు చేస్తుందన్నారు. మే ఐదు నుంచి జూన్ ఐదు వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా వ్యవసాయ రంగంలో డిజిటల్ విప్లవం రానుందన్నారు. ఫార్మర్ ఐడి అనేది రైతులకు అందించే డిజిటల్ గుర్తింపు కార్డు అని దీనిని ఆధార్ కార్డుతో లింక్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ 11 అంకెల ఐడిలో రైతు పేరు, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, పట్టాదారు పాసుపుస్తకం వివరాలు, భూమి రకం, సర్వేనెంబర్లు, సాగు చేసిన పంటలు పూర్తి సమాచారం నమోదు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్ కార్డు, ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు ఈ ఐడి తప్పనిసరి కానుందన్నారు.రైతులు విధిగా ఎఇఒల వద్దకు వచ్చి ఆధార్తో పాటు లింక్ అయిన ఫోన్ నెంబర్ వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎఇఒబాలాబత్తుల శిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

## ఉన్నతంగా ఆలోచించి లక్ష్యాలను అధిరోహించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించి విద్యతో పాటు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఖమ్మంజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఇటీవల విడుదలైన పది పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన భువనశ్రీ, శిరీష, శ్రీజలు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం కలిశారు. డా॥ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడేందుకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థలో తాము సభ్యత్వం పొందామని తమను విష్ చేయండి, బ్లెస్ చేయండి, గైడ్ చేయండి మీరే మాకు రోల్ మోడల్ అంటూ జిల్లా కలెక్టర్తో విద్యార్థులు సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ కొద్దిసేపు ముచ్చటించారు. భవిష్యత్తులో వారు ఏమి కావాలనుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎంతో శ్రమిస్తే మీరు ఈ స్థాయికి వచ్చారని, ప్రస్తుతం విద్యలో వెనకబడిన విద్యార్థులకు మేళకువలను నేర్పుతూ ఐదుగురు విద్యార్థులను చైతన్యవంతులను చేసి మరల తన వద్దకు ఆ ఐదుగురు విద్యార్థులతో రావాలని వారికి సూచించారు. అడిషనల్ కలెక్టర్ డా॥ పి.శ్రీజను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. మీరు కన్న కలలను సాకారం చేసుకునేందుకు శ్రమించాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాధిక్ అలీ ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులను శాలువతో సత్కరించి ఆశీర్వదించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీజ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక పాలేరు నియోజక వర్గ బాధ్యులు డా॥ నజీర్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


సిపిఐఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపు



**ప్రజాపక్షం/మధిర:**భారతదేశంలో మహోజ్వల పోరాట చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం సిపిఐ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. మధిర మున్సిపాల్టీ పరిధి మడుపల్లి గ్రామంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు అధ్యక్షతన సిపిఐ గ్రామశాఖ మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిధిగా హాజరైన దండి సురేష్ మాట్లాడుతూ నిరంతరం కార్మిక, కర్షక, పేద,బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి దోపిడిలేని వర్గ రహిత సమాజ నిర్మాణం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా పనిచేస్తుందని అన్నారు. దేశ రాజకీయ వ్యవస్థలో ప్రజల కోసం పనిచేసే పార్టీగా సిపిఐ కీర్తించబడుతుందని, దేశం కోసం, దేశంలోని అన్ని వర్గాల ప్రజల కోసం నిరంతరం ఆలోచిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ, మానవ హక్కుల కోసం పోరాడుతున్న పార్టీ సిపిఐ అని కొనియాడారు. దేశంలో పాలకులు ఎందరు మారినా ఒక్క ప్రజల పక్షాన నిలిచే పార్టీగా సిపిఐకి పేరుందని, అలాంటి పార్టీని బలోపేతం చేయడం కోసం శ్రేణులంతా పట్టుదలతో కృషి చేయాలన్నారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో సర్పంచ్లు, ఎంపిటిసి స్థానాలతో పాటు మున్సిపాల్టీ కౌన్సిలర్లు, ఎంపిపి స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా కార్యచరణ సిద్ధం చేసుకోవాలని, అందుకు నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి గత వైభవాన్ని పార్టీకి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మడుపల్లి సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా జల్లా బ్రహ్మం ఎన్నిక కాగా గ్రామశాఖ సహాయ కార్యదర్శులుగా అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు , సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, ఎంఎ రహీం, పంగా శేషగిరిరావు, తలారి రమేష్, గ్రామశాఖ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త గనులు రాకపోవడానికి
# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం

గుర్తింపు సంఘం ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్:**సింగరేణి లో కొత్త గనులు రాకపోవడానికి కారణం కేంద్రం లోని బిజెపి ప్రభుత్వమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజకుమార్ అన్నారు. సోమవారం కొత్తగూడెం లోని శేషగిరి భవన్ లో జరిగిన ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడాతూ, దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు కోడ్ లుగా విభజించి కార్మిక సంఘాలను, కార్మికులను బలహీనపరిచే విధంగా తయారుచేసి, యాజమాన్యానికి లబ్ధి చేకూరే విధంగా నాలుగు కోడ్లు ఉన్నాయని, దీనికోసం జాతీయ కార్మిక సంఘాలన్నిటిని కలుపుకొని మే 20న నాలుగు లేబర్ కోడ్ ల రద్దు కై దేశవ్యాప్త సమ్మెను సింగరేణి లో జయప్రదం చేయాలన్నారు. అదేవిధంగా సింగరేణి లో కోయగూడెం, సత్తుపల్లి ఒసి లకు 2021–22న టెండర్లు పిలిచినా ఇప్పటికి పనులను ప్రారంభించలేదని, టెండర్ పాలసీ ప్రకారం సంవత్సర కాలంలో పనులు ప్రారంభించక పోతే ఆ టెండర్లను వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద వైఖరి వలన నూతన బొగ్గు గనులు రాకుండాపోతున్నాయన్నారు. సింగరేణిలో 27 అండర్ గ్రౌండ్ మైన్ లు, 17 ఒసిలు ఉంటే 2025 ఆర్థిక సంవత్సరంలో సుమారు రెండు అండర్ గ్రౌండ్ మైన్లను మూసివేయనున్నారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా బొగ్గు ఉత్పత్తి కి పుట్టినిల్లు ఐన ఇల్లందులో సింగరేణి కార్మికులు ఒకప్పుడు 12,000 మంది ఉంటే నేడు 600 మంది కార్మికులు ఉన్నారన్నారు. జెకె 5 ఒసి ఒబి, కోల్ టెండర్ ను ప్రైవేట్ కంపెనీకి అప్పజెప్పితే సింగరేణి కార్మికులు లేకుండా ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తారన్నారు.. ఈ విషయంపై సింగరేణి సిఎండిని కలిసి జెకె 5 ఒ సి లో కోల్ టెండర్ను సింగరేణి సంస్థకు కేటాయిస్తే, సింగరేణి కార్మికులు బదిలీ కాకుండా ఇక్కడే ఉండే అవకాశం ఉంటుందన్నారు. సింగరేణి కార్మికునికి ఇల్లు కట్టుకోవడానికి పది లక్షల వడ్డీ లేని రుణం ఇచ్చినట్లు, కోల్ ఇండియా తరహాలో 30 లక్షలు ఇల్లు కట్టుకోవడానికి ఇవ్వాలన్నారు.సింగరేణి ఆధ్వర్యంలో ఓ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఏర్పాటుచేసి కార్మికుల వైద్యం కోసం పైసా ఖర్చు లేకుండా చూడాలన్నారు. సింగరేణిలో 2023 డిసెంబర్ లో ఏడవ సారి జరిగిన యూనియన్ ఎన్నికల సమయంలో కార్మికులకు ఎఐటియుసి చేసిన 48 వాగ్దానాలను మేనేజ్మెంట్ తో చర్చించి నెరవేరుస్తూ వేస్తున్నామని ఆయన అన్నారు. సింగరేణిలో కొత్త గనులు రావడం కోసం ఈ నెల 20 న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను సింగరేణి లో జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఎఐటియుసి సీనియర్ నాయకులు దమ్మాలపాటి శేషయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ కార్యదర్శి ఎస్ వి.రమణ మూర్తి, బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

### మహ్మద్ షమికి బెదిరింపులు..



టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ షమికి హత్య బెదిరింపులు వచ్చాయి. దీంతో షమి తరఫున అతని సోదరుడు హసీబ్ ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు రూ.కోటి డిమాండ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజ్‌పుత్ సిందార్ అనే వ్యక్తి మెయిల్ పంపినట్లు గుర్తించారు. తదుపరి విచారణ కొనసాగుతుంతున్నారు. ఇటీవల భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఇటు వంటి బెదిరింపులు వచ్చాయి. 'ఐ కిల్ యూ' అంటూ రెండు ఈమెయిల్స్ వచ్చినట్లు సెంట్రల్ ఢిల్లీ పోలీసులకు గంభీర్ ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం షమి ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతున్న విషయం తెలిసిందే.



### చెన్నై సూపర్ కింగ్స్‌లోకి విధ్వంసకర వీరుడు



చెన్నై సూపర్ కింగ్స్‌లోకి కొత్త కుర్రాడు వచ్చాడు. గుజరాత్‌కు చెందిన వికెట్‌కీపర్ బ్యాటర్ ఉర్విల్ పటేల్‌ను రూ.30 లక్షల కనీస ధరకు జట్టులోకి తీసుకుంది. వంశ్ బేడీ స్థానంలో ఉర్విల్ పటేల్‌ను టీమ్‌లో చేర్చుకుంది. గాయం కారణంగా వంశ్ బేడీ ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. 26 ఏళ్ల ఉర్విల్ పటేల్‌కు టీ20 క్రికెట్‌లో మంచి రికార్డు ఉంది. గతేడాది ముస్తాక్ అలీ ట్రోఫీలో త్రిపురపై 28 బంతుల్లోనే శతకం చేసి వార్తల్లో నిలిచాడు. 2023 విజయ్ హజారే ట్రోఫీలో 41 బంతుల్లో 100 పరుగులు చేశాడు. ఉర్విల్ 2023 ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కానీ, ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే ఛాన్స్ రాలేదు. ఇక, ప్రస్తుత సీజన్‌లో సీఎస్కే ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడి రెండు విజయాలు మాత్రమే సాధించి ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

#### సన్‌రైజర్స్‌లోకి హర్ష్ దూబె

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు స్మరన్ రవిచంద్రన్ కూడా గాయం కారణంగా ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ క్రమంలో అతడి స్థానాన్ని సన్‌రైజర్స్ హర్ష్ దూబెతో భర్తీ చేసింది. మహారాష్ట్రకు చెందిన ఈ బౌలింగ్ ఆల్‌రౌండర్‌ను రూ.30 లక్షల బేస్ ధరకు తీసుకుంది. టీ20ల్లో విదర్భ తరఫున 16 మ్యాచ్‌లు ఆడి 127 వికెట్లు, 941 పరుగులను సాధించాడు. 2024/25 రంజీ ట్రోఫీని విదర్భ దక్కించుకోవడంలో హర్ష్ దూబె కీలక పాత్ర పోషించాడు. 69 వికెట్లు, 476 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు.

### ఢిల్లీకి దడ పుట్టించిన కమిన్స్..!

సొంత గడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ పేసర్లు రెచ్చిపోయారు. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ నడ్డి విరిచారు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్(3/19) మూడు వికెట్లతో దెబ్బకొట్టగా.. ఉనాద్కాట్ రేంజ్‌లో కేఎల్ రాహుల్(10)ను జెట్ వేసి ఢిల్లీని పీకల్లోతు కష్టాల్లో ముంచారు. 62కే 6 వికెట్లు పడిన వేళ ట్రిస్టన్ స్టబ్స్(41 నాటౌట్) ఇంప్యాక్ట్‌గా వచ్చిన అశుతోష్ శర్మ(41)లు ఒత్తిడిలోనూ అద్భుతంగా ఆడారు. డెత్ ఓవర్లలో ఈ జోడీ హైదరాబాద్ బౌలర్లను ఉతికేస్తూ బౌండరీలు రాబట్టి స్కోర్ 100 దాటించారు. ఏడో వికెట్‌కు 66 రన్స్ జోడించి గౌరవప్రదమైన స్కోర్ అందించారు. మలింగ వేసిన 20వ ఓవర్లో స్టబ్స్ ఫోర్ బాదగా ఢిల్లీ 133 పరుగులు చేయగలిగింది. ప్లే ఆఫ్స్ రేసుకు ఆమడ దూరంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో చెలరేగింది. సారథి ప్యాట్ కమిన్స్(3/19) ముందుండి వికెట్ల వేట కొనసాగించగా.. ఢిల్లీని ఆదిలోనే కోలుకోలేని దెబ్బ కొట్టింది. పవర్ ప్లేలో నిప్పులు చెరిగిన ప్యాట్.. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ కరుణ్ నాయర్(0) వికెట్ తీసి ఆరెంజ్ ఆర్మీకి అదిరే బ్రేకిచ్చాడు. ఆ తర్వాత తన రెండో ఓవర్ తొలి బంతికే ఫాఫ్ డూప్లెసిస్(3) ఇన్ స్వింగర్‌తో బోల్తా కొట్టించాడు. షాక్‌లో ఉండిపోయిన ఢిల్లీని మరింత కష్టాల్లోకి నెడుతూ మూడో ఓవర్ మొదటి బంతికే అభిషేక్ పొరెల్ (8) వికెట్ సాధించాడు సన్‌రైజర్స్ సారథి.

అనంతరం ధాటిగా ఆడాలనుకున్న అక్షర్ పటేల్(6)ను హర్షల్ పటేల్ జెట్ చేసి ఢిల్లీని పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాడు. అయితే.. ఆదుకుంటాడనుకున్న కేఎల్ రాహుల్(10) ఉన్నాడన్న భరోసాతో ఉన్న ఢిల్లీకి షాకిచ్చాడు ఉనాద్కాట్. అంతే.. 29 వద్ద ఐదో వికెట్ పడింది. యువ ఆల్‌రౌండర్ విప్రజ్ నిగమ్(18), ట్రిస్టన్ స్టబ్స్(41 నాటౌట్)లు అక్షర్ బృందాన్ని ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ అనికేత్ వర్మ విప్రజ్‌ను రనౌట్ చేయడంతో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా అశుతోష్ శర్మ(41) రావాల్సి వచ్చింది.

#### నిలబడిన స్టబ్స్, అశుతోష్

హైదరాబాద్ బౌలర్ల ధాటికి స్టార్ ఆటగాళ్లు డగౌట్ చేరగా.. కుర్రాళ్లు స్టబ్స్, అశుతోష్‌లు నిలబడ్డారు. స్ట్రాటజిక్ బ్రేక్ తర్వాత జీషన్ అన్సారీ ఓవర్లో అశుతోష్ రెండు స్ట్రెయిట్ సిక్సర్లు బాదాడు. దాంతో, 14 పరుగులు రాగా.. ఢిల్లీ స్కోర్ 80 దాటింది. కమిన్స్ 7 రన్స్ ఇవ్వగా.. హర్షల్ వేసిన 17వ ఓవర్లో శర్మ రెండు బౌండరీలు సాధించాడు. మలింగ వేసిన 18వ ఓవర్లో స్టబ్స్ ఫోర్‌తో వీళ్ల భాగస్వామ్యం హాఫ్ సెంచరీ దాటింది. అనంతరం హర్షల్ ఓవర్లో సిక్సర్ కొట్టాడు. మలింగ వేసిన 20వ ఓవర్లో పెద్ద షాట్ ఆడిన అశుతోష్ బౌండరీ వద్ద అభినవ్ చేతికి చిక్కాడు. చివరి బంతికి స్టబ్స్ ఫోర్ కొట్టగా ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది.



**ఉప్పల్‌లో భారీ వర్షం..**

సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు షాకింగ్ న్యూస్. ఉప్పల్‌లో భారీ వర్షం కురుస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్ ముగిసిందో లేదో చినుకులు మొదలయ్యాయి. చూస్తుండగానే వాన పెద్దదైంది. దాంతో, ఇరుజట్ల ఆటగాళ్లు పరుగున డ్రెస్సింగ్ రూమ్ చేరుకున్నారు. మైదానం సిబ్బంది గబగబా వచ్చి పిచ్‌ను ప్లాస్టిక్ కవర్లతో కప్పేశారు. చూస్తుంటే.. ఈ వాన కమిన్స్ సేన ఇన్నింగ్స్‌కు అంతరాయం కలిగించేలా ఉంది. అదే జరిగితే.. ఓవర్లు కోల్పోయే ప్రమాదముంది. సో.. చినుకులు ఎప్పుడు తగ్గుతాయోనని.. హైదరాబాద్ హిట్టర్లు స్వల్ప లక్ష్యాన్ని ఎంత త్వరగా ఛేదిస్తారా చూడాలని ఆరెంజ్ ఆర్మీ సహా స్టేడియంలోని ఫ్యాన్స్ ఆశపడుతున్నారు.




### సుహాస్ మాస్ ఎంట్రీ..

టాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ సుహాస్ ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. హీరోగా సుహాస్ నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ భామ అయ్యో రామ' రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో సుహాస్ బిజీగా ఉన్నాడు. అయితే, ఆయన తమిళ ఇండస్ట్రీలో తొలిసారి ఓ సినిమాలో నటించబోతున్నాడు. వెర్సటైల్ డైరెక్టర్ వెట్రిమారన్ ప్రొడక్షన్‌లో రూపొందనున్న 'మండాడి' అనే సినిమాలో సుహాస్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. తమిళ నటుడు సూరి తో పాటు సుహాస్ ఈ సినిమాలో ముఖ్య పాత్రలో కనిపించనున్నాడు. ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలోని సుహాస్ లుక్‌ని రివీల్ చేస్తూ ఈ పోస్టర్ తీర్చిదిద్దారు. పక్కా మాస్ అవతారంలో సుహాస్ లుక్ అదిరిపోయింది. అయితే, ఈ సినిమా నేపథ్యంతో పూర్తిగా సముద్రంపై సాగనుంది. దీంతో ఈ సినిమాలో సుహాస్ ఓ జాలరిగా కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. ఇక సుహాస్ మాస్ లుక్‌తో వేసుకున్న జెర్సీపై సునామీ రైడర్స్ అనే క్యాప్షన్ ఆకట్టుకుంటుంది. మరి ఈ సినిమాలో సుహాస్ పాత్ర ప్రేక్షకులను ఎంతమేర ఆకట్టుకుంటుందో చూడాలి. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందించనున్న ఈ సినిమాను మతిమారన్ పుగళేంది డైరెక్ట్ చేస్తున్నారు. మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సత్యరాజ్, అచ్యుత్ కుమార్, సచ్చనా నమిదాస్, రవీంద్ర విజయ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

## రీల్



### ఈసారి కూడా బ్లాక్ బస్టర్ ఇస్తారా? –సమంత

మన టాలీవుడ్‌లో ఉన్నటువంటి స్టార్ హీరోయిన్స్‌లో సమంత కూడా ఒకరు. అయితే సమంత గత కొంత కాలం తెలుగు సినిమాకి గ్యాప్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే సమంత నటించిన సినిమా కాకుండా తన నిర్మాణంలో తెరకెక్కించిన రీసెంట్ చిత్రంతో చాలా కాలం తర్వాత ఆమె తెలుగు ఆడియెన్స్ ని పలకరించేందుకు వస్తుంది. మరి ఆ చిత్రమే శుభం. యువ నటీనటులు హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపుడి తదితరులు నటించిన ఈ చిత్రాన్ని ప్రవీణ్ కాండ్రేగుల తెరకెక్కించారు. మరి ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ విశాఖపట్నంలో గ్రాండ్‌గా జరగగా అక్కడ సమంత కామెంట్స్ ఆసక్తిగా మారాయి. తనకి వైజాగ్‌కి ఉన్న బంధం కోసం మాట్లాడుతూ తాను చేసిన సినిమాల్లో మజిలీ కోసం ముందు చెప్పి ఆ తర్వాత ఓ బేబీ అలాగే రంగస్థలం చిత్రాలు ఈవెంట్స్ ఇక్కడ నుంచే అయ్యాయి అని అన్నీ హిట్స్ అయ్యాయి. ఈసారి కూడా నాకు బ్లాక్ బస్టర్ ఇస్తారా అంటూ సమంత విశాఖ ప్రజలని అడిగిన కామెంట్స్ ఇపుడు వైరల్‌గా మారాయి.



**హాట్**

బ్యూటీ ముమైత్ ఖాన్ తెలుగులో ఒకప్పుడు ఫుల్ క్రేజ్ ను సొంతం చేసుకుంది. ఐతే, తాజాగా ముమైత్ ఖాన్ ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ఆరోగ్య సమస్యల

### నా బ్రెయిన్‌లో.. 9 వైర్లు ఉన్నాయి? – ముమైత్ ఖాన్

గురించి చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఓ టాక్ షోలో ముమైత్ ఖాన్ మాట్లాడుతూ.. 'ఇంట్లో నేను డ్యాన్స్ చేస్తుండగా కాలు స్లిప్ అయి పడిపోయాను. ఆ సమయంలో నాకు మెదడులో నరాలు కూడా కట్ అయ్యాయి. నేను పడిపోయిన పొజిషన్ ను బట్టి, నా నరాలు కట్ అయ్యాయి' అంటూ ముమైత్ ఖాన్ చెప్పింది. ముమైత్ ఖాన్ ఇంకా మాట్లాడుతూ.. 'నేను పడిపోయాక, 15 రోజులు కోమాలో ఉన్నాను. సర్జరీ తర్వాత కొంత మెమొరీ కూడా లాస్ అయ్యాను. ఇప్పటికీ నా బ్రెయిన్‌లో 9 వైర్లు ఉన్నాయి. నా గ్లామర్ అంతా పాడైపోయింది. ఇండస్ట్రీలో చాలా అవకాశాలు కోల్పోయాను. ఆ ప్రమాదం నన్ను ఎంతగానో బాధ పెట్టింది. ఒకవిధంగా నా లైఫ్ ను ఆ ప్రమాదం పూర్తిగా మార్చేసింది' అంటూ ముమైత్ ఖాన్ తెలిపారు.

### రూమర్స్ నమ్మకండి : ఉపేంద్ర



నటుడు ఉపేంద్ర అనారోగ్యానికి గురయ్యారంటూ కన్నడ మీడియాలో వార్తలొచ్చాయి. దీంతో, సోషల్ మీడియా వేదికగా పలువురు అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. వాటిపై ఉపేంద్ర తాజాగా స్పందించారు. "నేను ఆరోగ్యంగానే ఉన్నా. రెగ్యులర్ చెకప్ కోసం ఆస్పత్రికి వెళ్లా. రూమర్స్ నమ్మకండి" అని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పోస్టు పెట్టారు. 'యూఐ' సినిమా షూటింగ్ సమయంలోనే ఉపేంద్రకు అనారోగ్య సమస్యలు తలెత్తాయని, ఇప్పుడు ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రిలో చేరారంటూ కన్నడ మీడియా పేర్కొంది. సినిమాల విషయానికొస్తే.. గతేడాది 'యూఐ'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఉపేంద్ర ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఆయన, శివ రాజ్‌కుమార్ కలిసి నటిస్తున్న '45' మూవీ ఆగస్టు 15న విడుదల కానుంది. మరోవైపు, ఆయన కీలక పాత్ర పోషించిన 'కూలీ'ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

రాష్ట్ర చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్‌గా

### జి.చంద్రశేఖర్ రెడ్డి నియామకం



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్‌గా సీనియర్ ఐఎఫ్‌ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రశేఖర్‌రెడ్డి చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. 1991 ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ బ్యాచ్‌కు చెందిన చంద్రశేఖర్‌రెడ్డికి డిపార్ట్‌మెంట్‌లో టాస్క్ మాస్టర్‌గా మంచి పేరుంది. అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం బోరెగాన్ గ్రామం నుంచి ప్రస్థానం ప్రారంభించిన ఆయన సుదీర్ఘ ప్రభుత్వ సర్వీస్‌లో అనేక హోదాల్లో పనిచేశారు. సిఎం కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉంటూ సిఐసి అయ్యారు.

## హైదరాబాద్‌లో అందాల భామలు

### పలువురి రాక కోసం శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగత ఏర్పాట్లు, ప్రత్యేక డెస్క్






ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక 72వ మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తెలంగాణ రాజధాని హైదరాబాద్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. మే 7న ప్రారంభమై జూన్ 2 వరకు జరగనున్న ఈ అంతర్జాతీయ అందాల పోటీల కోసం నగరం వేదిక కానుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 120 దేశాలకు చెందిన సుందరీమణులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే హైదరాబాద్‌కు తరలివస్తున్నారు.మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వస్తున్న అందగత్తెలతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సందడి వాతావరణం నెలకొంది. విదేశీ ప్రతినిధుల రాక ఈరోజు నుంచి మరింత పెరగనున్న నేపథ్యంలో, వారికి తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికేందుకు పర్యాటక శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేసింది. విమానాశ్రయంలో ప్రత్యేక లాంజ్లతో పాటు, సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్కను కూడా ఏర్పాటు చేశారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, సంస్కృతి, ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత తోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇప్పటికే మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే జాన్సన్వాన్ రెన్స్బర్గ్ సహా దాదాపు 90మంది పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారని నిర్వాహకులు వెల్లడించారు. విమానాశ్రయంలో పర్యాటక శాఖ అధికారులు వీరికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, అనంతరం వారిని బస ఏర్పాటు చేసిన హోటళ్లకు తరలించారు. ఇదిలా ఉండగా, ఈ పోటీలకు పాకిస్థాన్ నుంచి ప్రతినిధులు పాల్గొనడం లేదనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇటీవల భారత్‌పాకిస్థాన్ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, పాకిస్థాన్ సుందరీమణులు ఈ పోటీలకు దూరంగా ఉంటున్నారని సమాచారం. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, ఈ క్రమంలోనే పాకిస్థానీలు ఏప్రిల్ 29 నాటికి దేశం విడిచి వెళ్లాలని సూచనలు అందాయని, ఈ పరిణామాల నేపథ్యంలోనే మిస్ వరల్డ్ పోటీల్లో పాక్ ప్రాతినిధ్యం ఉండకపోవచ్చని తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## సింగరేణి సిఎండికి సమ్మె నోటీసు!

అందజేసిన కార్మిక సంఘాల ఐక్యవేదిక



ప్రజాపక్షం/గోదావరిఖని : బొగ్గు పరిశ్రమ రక్షణ, నూతన బొగ్గు గనులు, 4 లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం రూ.26 వేలు, సమాన పనికి సమాన వేతనం తదితర 17 డిమాండ్ల పరిష్కారానికై సింగరేణిలో ఈనెల 20న సమ్మె చేసేందుకు సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్‌ను కలిసి సమ్మె నోటీసును అందజేసినట్లు హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, జిఎల్‌బికెఎస్, ఐఎఫ్‌టియు జనరల్ సెక్రటరీ జె.సీతారామయ్య, తెలంగాణ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కామెర గట్టయ్య, ఎఐఎఫ్‌టియు అధ్యక్షులు జి.రాములు, టిఎన్‌టియుసి జనరల్ సెక్రటరీ మణిరాంసింగ్, ఎస్‌జికెఎస్ అధ్యక్షులు మహేందర్‌లు తెలిపారు. అదేవిధంగా సమ్మె నోటీసును డిప్యూటి కమిషనర్ ఆఫ్ లేబర్ సెంట్రల్ డి.శ్రీనివాసులుకు కూడ అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో బొగ్గు బ్లాక్‌లను అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని, దీనికి మద్ధతుగా కొన్ని కార్మిక సంఘాలు వ్యవహరించడం అన్యాయమన్నారు. లాభాలతో నడుస్తున్న సింగరేణి సంస్థలో నూతన భూగర్భ గనులకు అనుమతించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న 35 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను పెంచాలని, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు చెల్లించాలని, కార్మిక వర్గం మనుగడకు ముప్పు తెస్తున్న నాలుగు లేబర్ కోడలను మోడీ ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కార్మి వర్గానికి నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి అధ్యక్షులు బోసు, కార్మిక సంఘాల నాయకులు ఏడుకొండలు, కృష్ణ, శ్రీనివాస్, ఎం.దామోదర్‌రెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

## నిందితుడిపై ఆరోపణలా?

(మొదటి పేజీ తరువాయి)

భయానలతో కూడిన ధర్మాసం విచారించింది. 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేక కేసులలో ఇది ఒక పరిపాటిగా మారింది. ఎలాంటి ఆధారాలు లేకుండా మీరు కేవలం ఆరోపణలు చేస్తున్నారు. ఈ పద్ధతితో ప్రాసిక్యూషన్ మా ముందు నిలబడలేరు' అని ధర్మాసనం తలంటింది. విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి.రాజు వాదిస్తూ వికాస్ అగర్వాల్ అనే మరొక వ్యక్తితో అరవింద్‌సింగ్ కుమ్మక్కై రూ.40కోట్లు సంపాదించాడని ఆరోపించారు. అగర్వాల్‌ను నిందితుడిగా మార్చారా అని ధర్మాసనం అదనపు సొలిసిటర్ జనరల్‌ను ప్రశ్నించగా ఆయన సమాధానం ఇస్తూ ఆయన పరారీలో ఉన్నాడని తెలిపారు. ధర్మాసం ఆయన వివరణపై స్పందిస్తూ 'మీరు అరవింద్‌సింగ్ రూ.40కోట్ల మేరకు సంపాదించాడని నిర్దిష్ట ఆరోపణలు చేశారు సరే. అయితే ఆయనకు ఈ వ్యక్తితో సంబంధం ఉందని కానీ, లేదా ఏదైనా ఇతర కంపెనీతో సంబంధం ఉందని కానీ ఆధారాలు ఎందుకు చూపించలేకపోతున్నారు' అని బెంచ్ అడిషనల్ సొలిసిటర్ జనరల్‌ను ప్రశ్నించింది. 'ఆయన ఆ కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారా? లేనిపక్షంలో మెజారిటీ షేర్ హోల్డర్‌గా ఉన్నారా? లేదా ఆయన మేనేజింగ్ డైరెక్టరా? అక్కడ ఏదో ఒక ఆధారం సమర్పించాలిగా' అని కోర్టు అడిగింది. ఒక వ్యక్తి కంపెనీని నియంత్రించగలడు కానీ కంపెనీ ప్రవర్తనకు బాధ్యత వహించాల్సిన అవసరం లేదని అన్నారు. అత్యున్నత న్యాయస్థానం స్పందిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 'ఒక పచ్చి ఆరోపణలు చేస్తున్నది' అని పేర్కొన్నది. అనంతరం విచారణను 9వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది.రాష్ట్ర అధికారులు దాఖలు చేసిన లిక్కర్ కుంభకోణం కేసుకు సంబంధించి నిందితుడిని ఎంతకాలం జైలులో ఉంచుతారని సుప్రీంకోర్టు ఏప్రిల్ 28న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసింది. ఈ అంశంలో మూడు చార్జిషీట్లు ఫైల్‌చేసినా విచారణ ఇంకా ఎందుకు కొనసాగుతోంది అని ధర్మాసనం ప్రశ్నించింది. అరవింద్‌సింగ్,అమిత్ సింగ్‌లను మాజీ ఎక్సైజ్ మంత్రి కవాసీ లఖ్మాలతో కలిసి విచారణకు హాజరు కావాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశిస్తూ విచారణను మే 9కి వాయిదా వేసింది.




## ఘన నివాళి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. అదేవిధంగా హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఎఐటియూసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్. బోస్ నివాళి అర్పించారు. పెట్టుబడిదారులకు సాగిస్తున్న దోపిడికి వ్యతిరేకంగా కార్మికులు, కష్టజీవులను ఏకం చేసే సిద్ధాంతాన్ని రూపకల్పన చేసి, మానవ శ్రమకు విలువ చేకూర్చిన మహామేధావి కార్ల్ మర్క్స్ అని కూనంనేని అన్నారు. కొత్తగూడెం శేషగిరిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మానవ శ్రమకు విలువ లేని పరిస్థితుల్లో శ్రమైక జీవులకు పని గంటలు,శ్రమకు తగిన వేతనం కోసం ఆయన చేసిన కృషి ప్రపంచ కార్మిక వర్గానికి తోడ్పాటును అందించిందన్నారు. సమాజ చరిత్ర అంతా వర్గ పోరుతోనే ముడిపడి ఉంటుందని, ఈ వర్గపోరే అంతిమ విజయం సాధిస్తుందని చెప్పిన మహా మేదావి, మానవతావాది మార్క్స్ అని కొనియాడారు. మార్క్సిజం ప్రపంచ మానవాలికి దిక్సూచి వంటిదని, అన్యాయం, దోపిడి, అవినీతి నిర్మూటించబడాలంటే మార్క్సిజానికి అనుగుణంగా ప్రజలు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరిమి రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బోసు మాట్లాడుతూ.. ప్రపంచ, మేధావి అభ్యుదయవాది కారల్ మార్క్స్ అనేక ఆటుపోట్లు కష్టనష్టాలను, అనుభవించడమే కాకుండ పెట్టుబడిదారీ వ్యవస్థను ఏ విధంగా ఎదుర్కోవాలి, శ్రామిక కార్మిక వర్గాన్ని ఏ విధంగా కాపాడుకోవాలని మార్క్స్ సిద్ధాంతం ద్వారా ఈ ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి ఆయన అని కొనియాడారు. ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలు సోషలిస్ట్, పార్టీలు మార్క్స్ సిద్ధాంతం మీద ఆధారపడి నడుస్తాయని, మార్క్స్ సిద్ధాంతాన్ని మించింది ఇంకొకటి లేదని, ఆయన బాటలో ముందుకు సాగాలని కోరారు.



## మహాసభ లోగో విడుదల

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ సంక్షోభం తదితర కీలకాంశాలపై జాతీయ మహాసభలో చర్చిస్తామన్నారు. వీటితో పాటు పెరుగుతున్న విద్వేషాలు, అశాంతి, రాజ్యాంగంపై దాడి వంటి అంశాలపై కూడా చర్చ జరుగుతుందని తెలిపారు. అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో జాతీయ మహాసభను చండీగఢ్‌లో జరుపుకోవడం విశేషమని అన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్రోద్యమంలో సిపిఐ నిర్వహించిన గర్వకారణమైన ఆపాత్రను, సామాన్య, శ్రామిక, అణగారిన, రైతాంగ, వర్గాల కోసం చేసిన కృషి, జాతీ నిర్మాణంలో నిర్వర్తించిన పాత్రను ప్రజలకు తెలియజేసేందుకు మహాసభ ఒక మంచి అవకాశమని చెప్పారు. బంత్‌సింగ్ మాట్లాడుతూ బ్రిటీష్ వలసవాదుల నుంచి భారత దేశం స్వాతంత్ర్యం సాధించడంలో ముందంజలో ఉండి త్యాగాలు చేసిన వారిలో అనేక మంది పంజాబ్ ప్రజలు కూడా ఉన్నారని తెలిపారు.

#### ఏర్పాట్లలో నిమగ్నమైన ఆహ్వాన సంఘం

పంజాబ్‌లో కళా, సాహితీ, సంస్కృతి రంగాలలో ప్రముఖుడిగా పేరొందిన మాజీ ఐపిఎస్ అధికారి, పంజాబి ట్రిబ్యూన్ పత్రిక మాజీ ఎడిటర్ డాక్టర్ స్వరాజ్ బీర్ సింగ్ చైర్మన్‌గా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బంత్‌సింగ్ బ్రార్ ప్రధాన కార్యదర్శిగా సిపిఐ జాతీయ మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటైంది. వివిధ రంగాల ప్రముఖులు ఇందులు సభ్యులుగా ఉన్నారని బంత్‌సింగ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి హాజరయ్యే సుమారు వెయ్యి మంది ప్రతినిధులకు అవసరమైన ఏర్పాట్లకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నామని తెలిపారు. మహాసభ నేపథ్యంలో వర్తమాన అంశాలపై సెమినార్‌లు, అమరులను స్మరిస్తూ, వారి కుటుంబాలను గౌరవిస్తూ జాతాలను నిర్వహించనున్నట్లు వివరించారు. మహాసభ ప్రారంభసూచిగా సెప్టెంబర్ 21న భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com